అనుదినం... జనస్వరం
www.navatelangana.com
సంపుటి : 11 సంచిక : 81
నవతెలంగాణ
ఆదివారం 23-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు + వెటలో (సోపతి) వెల : 8.00


సభలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నా సమాధానాలకు వాళ్ల మైండ్ బ్లాక్

అందుకే వాకౌట్ అంటూ వెళ్లిపోయారు

పీపీపీ కాదు..హ్యామ్ పద్ధతిలో రోడ్లేస్తాం
శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
మేం గుంతే పూడ్చనట్టు..
రోడ్లే వేయనట్టు మాట్లాడటం తగదు
నల్లగొండలోనే రూ.200 కోట్లతో రోడ్లేసినం : ప్రశాంత్‌రెడ్డి
ఆ రోడ్లను చూపిస్తే సన్మానం చేస్తా..కొబ్బరికాయ కొడతా
యాదగిరి గుట్ట టెంపుల్‌కు రూ.350 కోట్ల బకాయిలు పెట్టిపోయారు : వెంకటరెడ్డి
అధికార, ప్రతిపక్షాల వాగ్యుద్ధంతో హీటెక్కిన సభ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'నా సమాధానాలకు వాళ్ల మైండ్లు బ్లాక్ అయిపోయి ఏం మాట్లాడాలో అర్థంకాక సభ నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు' అంటూ బీఆర్‌ఎస్ సభ్యులనుద్దేశించి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చురకలు అంటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్‌ఎస్ సభ్యులు ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ఈ క్రమంలో ప్రశాంత్‌రెడ్డి, కోమటిరెడ్డి మధ్య వాదోపవాదాలు నడిచాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. 'ప్రయివేటు భాగస్వామ్యంతో రోడ్లు వేయడానికి ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలున్నాయా? ఉంటే వివరాలేంటి.. విధివిధానాలేంటి? ప్రయివేటురంగం, బ్యాంకులు భరించే వ్యయం దామాషా ఎంత? రోడ్ల కోసం తీసుకునే లోన్లు ఎఫ్‌ఆర్‌బీఎమ్ పరిధిలోకి వస్తాయా?' అంటూ హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నలు సంధించారు. దానికి సమాధానమిస్తూ సభ్యులడిగిన ప్రశ్నలేవీ ఉత్పన్నం కావంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమాధానమిచ్చారు. తాము అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమివ్వడం ...13లో


పునర్విభజనపై చెన్నైలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న స్టాలిన్

దక్షిణాదికి నష్టం

మరో పాతికేండ్లు ఆ ఊసే వద్దు

పారదర్శకత అవసరం
అందరినీ భాగస్వాములను చేయాల్సిందే
జనాభాను నియంత్రించిన రాష్ట్రాలను శిక్షించడం తగదు
పునర్విభజనపై స్టాలిన్ నేతృత్వంలో అఖిలపక్ష భేటీ తీర్మానం

చెన్నై: నియోజకవర్గాల ప్రక్రియలో పారదర్శకత ప్రదర్శించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని జేఏసీ డిమాండ్ చేసింది. మరో పాతిక సంవత్సరాల వరకూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టవద్దని కోరింది. ఈ మేరకు శనివారం చెన్నయ్‌లో జరిగిన జేఏసీ సమావేశం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. పారదర్శకత లోపించిన పునర్విభజన ప్రక్రియను తీర్మానం వ్యతిరేకించింది. కీలక రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోవడంలో కేంద్రం విఫలమైందని విమర్శించింది. పార్లమెంటరీ నియోజకవర్గాల్లో మార్పులు నిష్పాక్షికంగా, న్యాయసమ్మతంగా ఉండాలని, బహిరంగ ప్రక్రియ ద్వారా వాటిని చేపట్టాలని అభిప్రాయపడింది. ఆ ప్రక్రియలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, ఇతర సంబంధీకులను భాగస్వాములను చేయాలని సూచించింది. జనాభా ప్రాతిపదికన రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని తగ్గించినట్లయితే జనాభా నియంత్రణ చర్యలను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాలను అన్యాయంగా శిక్షించినట్టు అవుతుందని జేఏసీ తీర్మానం తెలిపింది. గతంలో చేసిన 42వ, 84వ, 87వ రాజ్యాంగ సవరణల వెనుక ఉన్న శాసన సంబంధమైన ఉద్దేశాలను ప్రస్తావిస్తూ జనాభా పెరుగుదలను స్థిరంగా ఉంచడానికి సమర్థవంతమైన చర్యలు తీసుకున్న రాష్ట్రాలకు రక్షణగా నిలిచేందుకు 1971 జనాభా లెక్కల ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల సంఖ్యను ఫ్రీజ్ చేశారని వివరించింది. అయితే జనాభా నియంత్రణ ...3లో

ఈ సమావేశం చారిత్రాత్మకం



సమాఖ్య మూలాలకు రక్షణ కవచం : తమిళనాడు సీఎం స్టాలిన్

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిపితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా దీనిని ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు. నియోజకవర్గాలపై కేంద్రం చేస్తున్న ప్రకటనలు గందరగోళానికి ఆస్కారమిస్తున్నాయని చెప్పారు. వచ్చే సంవత్సరం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని గుర్తు చేస్తూ భారత సమాఖ్య మూలాలను పరిరక్షించే దిశగా ఈ సమావేశం చరిత్రలో నిలిచిపోతుందని స్టాలిన్ తన ప్రసంగంలో ...3లో

జనాభా విధానాన్ని అమలు చేయడమే నేరమా?



డీలిమిటేషన్‌తో పార్లమెంటరీ ప్రాతినిధ్యానికే కాదు.. పన్నుల్లో వాటాకూ ముప్పే : కేరళ సీఎం పినరయి విజయన్

జేఏసీ భేటీలో ప్రసంగించిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీజేపీకి ఉత్తరాది రాష్ట్రాలలో పట్టుందని, జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిపితే ఆ రాష్ట్రాలలో సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, అది ఆ పార్టీకే లబ్ది చేకూరుస్తుందని, అందుకే బీజేపీ ఈ ప్రక్రియ అమలుకు కృతనిశ్చయంతో ఉన్నదని ఆయన విమర్శించారు. 1976వ సంవత్సరపు జాతీయ జనాభా విధానాన్ని దక్షిణాది రాష్ట్రాలు ...3లో



బీజేపీది జనాభా జరిమానా విధానం

మనది ఒకే దేశం..దాన్ని గౌరవిద్దాం
కానీ పునర్విభజనను అంగీకరించొద్దు
అది రాజకీయ అంతరాలను పెంచుతుంది
దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలి : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నియోజకవర్గాల పునర్విభజనలో బీజేపీది జనాభా జరిమానా విధానమని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మనందరిది ఒకే దేశమనీ, దాన్ని గౌరవిద్దామనీ, అయితే పునర్విభజనను అంగీకరించొద్దని సూచించారు. నియోజకవర్గాల పునర్విభజనపై శనివారం చెన్నైలో జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడారు. సీట్లు పెంచకుండా ఉన్న సీట్లలోనే పునర్విభజన చేయాలని కోరారు. జనాభా దామాషా ప్రాతిపదికన పునర్విభజనకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. ప్రొరేటా ప్రక్రియ రాజకీయ అంతరాలను పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలన్నింటిపై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గాల పునర్విభజనపై అందరినీ ఏకథాటిపైకి తెచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ప్రత్యేక అభినందనలు ...3లో

డీలిమిటేషన్‌పై హైదరాబాద్‌లో రెండో సదస్సు

పునర్విభజనతో నష్టపోయే రాష్ట్రాల హక్కుల రక్షణకు భారీ బహిరంగ సభ
జాతీయ స్థాయిలో సమన్వయం..
కార్యాచరణ అమలుకు ఢిల్లీలో కార్యాలయం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు సదస్సులో ఆమోదం
3లో..

ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ వెంటనే పూర్తి చేయాలి

స్థానిక బీజేపీ ఎంపీ ఏమి చేస్తున్నారు?

నిధుల కోసం కేంద్రంపై సీఎం ఒత్తిడి తేవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర



సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోడుప్పల్

హైదరాబాద్‌లోని ఉప్పల్-నారపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం చెంగిచర్ల చౌరస్తా నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఫ్లైఓవర్ పనులు 2018 జులైలో ప్రారంభించారని, 2020 జులై నాటికి పూర్తి కావాలని, కానీ ఏడు సంవత్సరాలు గడిచినా ...13లో



రెవెన్యూ శాఖలో 10,954 పోస్టులు మంజూరు

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెవెన్యూ శాఖలో కొత్తగా 10,954 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం జీవో 41ని జారీ చేశారు. నూతన గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థకు (జీపీఓ)గా ప్రభుత్వం నామకరణం చేసింది. మాజీ వీఆర్వోలు, మాజీ వీఆర్ఏల నుంచి ఆప్షన్లు ...13లో

ప్రముఖ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ అవార్డు



న్యూఢిల్లీ : ప్రముఖ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు దేశంలోనే అత్యున్నత సాహిత్య గౌరవమైన జ్ఞానపీఠ్ అవార్డు దక్కింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన 88ఏండ్ల వినోద్ కుమార్ శుక్లా హిందీ భాషలో ఎన్నో రచనలు చేశారు. హిందీలో షార్ట్ స్టోరీస్, కవితలు, వ్యాసాలు రాశారు.ఆయనను జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపిక చేస్తున్నట్టు శనివారం సాయంత్రం ప్రకటించారు. ఇప్పటికే ఈ అవార్డును 58 మంది అందుకోగా శుక్లా అందుకోబోయేది ...13లో

పది పరీక్ష రాసి వస్తూ...

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

నవతెలంగాణ-మియాపూర్

టెన్త్ పరీక్ష రాసి ఇంటికి బయలుదేరిన విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోయింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీకి చెందిన ప్రభాతి ఛత్రియ(16) టెలికాంనగర్‌లో 10వ తరగతి పరీక్షలు రాస్తోంది. శుక్రవారం మొదటి పరీక్ష రాసిన ఆమె రెండో రోజు శనివారం తన అన్న సుమన్ బైక్‌పై పరీక్షకు వెళ్లింది. పరీక్ష పూర్తి అయిన అనంతరం తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ...13లో


సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ప్రపంచ సుందరి పోటీలు రద్దు చేయాలి

ఐద్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణజ్యోతి, మల్లు లక్ష్మి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో నిర్వహించబోతున్న ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ...13లో

శాంతిని తీసుకురావాలి

మణిపూర్ ప్రజలకు జస్టిస్ గవాయ్ పిలుపు

ఆయన నేతృత్వంలో ఐదుగురు 'సుప్రీం' జడ్జిల ప్రతినిధి బృందం పర్యటన
సహాయ శిబిరం సందర్శన.. నిర్వాసితులతో సంభాషణ



ఇంఫాల్ : జాతి ఘర్షణలతో అట్టుడుకుతోన్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పర్యటించారు. జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ప్రతినిధి బృందం శనివారం ఇంఫాల్‌కు చేరుకున్నది. ప్రజలు శాంతి, సామరస్యాన్ని పునరుద్ధరించటానికి కలిసి పని చేయాలని ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎం.ఎం సుందరేశ్, జస్టిస్ కె.వి. విశ్వనాథ్‌లతో ...13లో

మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనమివ్వాలి

- పెండింగ్ వేతనాలు, బిల్లుల కోసం 24న చలో హైదరాబాద్ : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తామన్న హామీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ. రమ డిమాండ్ చేశారు. రూ.10 వేల వేతనం, పెండింగ్ వేతనాలు, బిల్లుల కోసం ఈ నెల 24న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 నెలల నుంచి కోడిగుడ్ల బిల్లులు, 3 నెలల వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. వంటకు అవసరమైన గ్యాస్‌ను ప్రతి పాఠశాలకు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. గుర్తింపు కార్డులను ప్రభుత్వమే ఇవ్వాలని, వేతనాల కోసం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. 24న ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కార్యకర్తలను ఊహాలోకంలో ఉంచండి

- మీరు ఫామ్‌హౌస్‌లోనే ఉండండి
- కేసీఆర్‌కు సీతక్క కౌంటర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రానున్న కాలంలో తమదే అధికారం అని ఫామ్‌హౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఊహాలోకంలో ఉంచండి..మీరు ఫామ్‌హౌస్‌లోనే ఉండండి అంటూ చురకలు అంటించారు. తాము పాలన చేస్తున్నామనీ, ప్రజలకు మంచి పాలన అందిస్తున్నామని చెప్పారు. 'కలలు కంటూనే ఉండండి..ఎప్పటికీ అధికారంలోకి రారు..ఆ విషయం మీకు అర్థం కాదు' అంటూ విమర్శించారు. ఫామ్‌హౌస్‌లో కూర్చుంటే అధికారంలోకి ఎలా వస్తారని ప్రశ్నించారు.

బస్తీ దవాఖానాలను బలోపేతం చేయండి

బీఆర్ఎస్ సభ్యులు డాక్టర్ సంజయ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని బస్తీ దవాఖానాలను బలోపేతం చేయాలని బీఆర్ఎస్ సభ్యులు డాక్టర్ కె. సంజయ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం అసెంబ్లీలో వ్యవసాయం, రవాణా, వైద్యం పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కళకళలాడిన బస్తీ దవాఖానాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వైద్యుల నియామకం, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. కేసీఆర్ కిట్ పేరు మార్చి తిరిగి అమలు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. 2014లో ప్రభుత్వాస్పత్రుల్లో 30 శాతం ప్రసవాలు నమోదయ్యాయనీ. తమ సర్కార్ కేసీఆర్ కిట్ పథకం ప్రవేశ పెట్టిన తర్వాత 70 శాతానికి పెరిగిందని గుర్తు చేశారు. తమకు పేరుతో సంబంధం లేదనీ, మహిళల ఆరోగ్యమే ముఖ్యమని స్పష్టం చేశారు. తన నియోజక వర్గమైన కోరుట్ల ప్రభుత్వాస్పత్రి భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు.

సచివాలయంలో ఎర్త్ అవర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్యావరణ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎర్త్ అవర్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం పాలుపంచుకున్నది. శనివారం రాత్రి 8 గంటల 30 నిమిషాల నుంచి 9 గంటల 30 నిమిషాల వరకు ఒక గంట పాటు లైట్లు ఆఫ్ చేసి ఎర్త్ అవర్ పాటించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉన్నతాధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనపై విధివిధానాలు ఖరారు కాలేదు

- ఏ రాష్ట్రానికీ, ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదు
- ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం సరిగాదు : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నియోజకవర్గాల పునర్విభజనపై విధివిధానాలు ఇంకా ఖరారు కాలేదనీ, నియమనిబంధనలు రూపొందించలేదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగబోతున్నదని ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం దిగజారుడు తనానికి నిదర్శనమని పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో జరిగి బీజేపీ వ్యతిరేక పార్టీల సమావేశాన్ని తప్పుబట్టారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నాటక, తెలంగాణలో హామీల వైఫల్యాల నుంచి బయటపడేందుకు, తమిళనాడులో డీఎంకే అవినీతి, ప్రజావ్యతిరేకత నుంచి బయటపడేందుకు సమావేశమయ్యాయని విమర్శించారు. బీఆర్ఎస్ ఒక్క ఎంపీ సీటు కూడా గెలవలేదనీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కనీసం పోటీ కూడా చేయలేదని గుర్తుచేశారు. ప్రజల దృష్టి మళ్లించి, భావోద్వేగాలు రెచ్చగొట్టేందుకు ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తీసుకొచ్చే కుట్రలను ఖండించారు. ప్రజల మధ్య భావోద్వేగాన్ని రెచ్చగొట్టేందుకు జాతీయ విద్యావిధానంలో త్రిభాషా సూత్రాన్ని చూపి, హిందీని బలవంతాన రుద్దుతున్నారని తప్పుడు కథనాన్ని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఆ పార్టీలన్నీ కాంగ్రెస్ తానా అంటే తందానా అంటాయని దెప్పిపొడిచారు.

అప్పుడున్నది 14 మందే

- కీలక పద్దులపై సభలో చర్చ
- కోరం లేక వెలవెలబోయిన శాసన సభ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక శాసనసభ. పద్దులపై, సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరిపే ప్రాంగణం అసెంబ్లీ. తమ కష్టాలు, కన్నీళ్లు తుడుస్తారని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలతో ఎన్నుకున్న సభ్యుల్లో సీరియస్‌నెస్ తగ్గుతోంది.

తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. శనివారం అసెంబ్లీలో కీలక పద్దులైన వ్యవసాయం, రవాణా, వైద్యంపై జరిగిన చర్చ సందర్భంగా కోరం లేక సభ వెలవెలబోయింది. సాయంత్రం నాలుగు గంటలకు సభలో మొత్తం 14 మంది సభ్యులకు మించి లేరు. కాంగ్రెస్ నుంచి ఇద్దరు మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు ఆరుగురు సభ్యులున్నారు, బీజేపీ నుంచి నలుగురు, బీఆర్ఎస్ నుంచి ఒకరు మాత్రమే సీట్లల్లో ఉన్నారు. అ సమయంలో సీపీఐ సభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతుండగా బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. సభలో కోరం లేక పోయినా సభ నడపడం సరికాదని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు సభ్యులున్నారనీ, టీ తాగడానికి వెళ్లారేమో అంటూ సభాపతి స్థానంలో ఉన్న ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఆయన వినక పోవడంతో పక్కనే ఉన్న మంత్రి పొన్నం సర్ది చెప్పారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యులు డాక్టర్ సంజయ్ మాట్లాడుతుండగా మరో సభ్యులు హరీశ్‌రావు సభలో ఉన్న శాసన సభా వ్యవహారాల మంత్రిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కోరం లేకున్నా సభ నడపడం, సభ్యులు సమస్యలను ప్రస్తావిస్తుంటే మంత్రులు వినకపోవడం ఇదెక్కడి సభా సంప్రదాయమని నిలదీశారు. చర్చ జరుగుతున్న పద్దులకు సంబంధించిన మంత్రులు కూడా సభలో లేక పోవడమేంటని ప్రశ్నించారు. ఈ దశలో కల్పించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు సర్ది చెప్పారు.

యువత జీవితాల్లో మార్పునకే రాజీవ్ యువ వికాస

- అమలుపై ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష : హాజరైన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాస పథకం ద్వారా యువత జీవితాల్లో మార్పు కోసం అధికారులు అంకితభావంతో పని చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్దేశించారు. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రాజీవ్ యువ వికాస పథకం అమలు గురించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 59 వేల మందికి పైగా ఉద్యోగ నియామక పత్రాలు అందించామనీ, ఉద్యోగాలు రానటువంటి యువత ఆర్థికంగా నిలబడటానికి రాజీవ్ యువ వికాస పథకం ద్వారా స్వయం ఉపాధి పథకాలు అందించాలని తీసుకున్న నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడానికి అధికారులు చాలా నిబద్ధతతో, పవిత్ర యజ్ఞంలా పనిచేయాలని సూచించారు. ఆ పథకం ప్రారంభించడానికి ముందే వనరుల సమీకరణకు సంబంధించి ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకున్నామనీ, నిధుల సమస్య లేదని వివరించారు. రాజీవ్ యువ వికాస పథకంలో లబ్ధిదారుడికి మంజూరి పత్రం అందజేసినప్పటి నుంచి ఎంపిక చేసుకున్న యూనిట్ ఏర్పాటు చేసుకుని వ్యాపారంలో స్థిర పడేంత వరకు కావాల్సిన సహకారాన్ని అందిస్తూ యువత జీవన ప్రమాణాలు పెంచే విధంగా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. బ్యాంకు మార్జిన్‌తో కలిపి రాష్ట్ర ప్రభుత్వం యువత కోసం రూ.9వేల కోట్లు పెట్టుబడిగా పెడుతున్నదనీ, యువత వ్యాపారంలో రాణించి అభివృద్ధి చెందాలన్నా ప్రభుత్వ ఆలోచన విధానాన్ని వంద శాతం అమలు చేసే విధంగా అధికారుల పనితీరు ఉండాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ శాఖలను సమన్వయం చేస్తూ ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి రాజీవ్ యువ వికాస్ మిషన్ ఏర్పాటు చేస్తున్నామనీ, ఈ మిషన్ బాధ్యతలు సీనియర్ ఐఏఎస్ అధికారికి అప్పగిస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా శాఖల వారీగా ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో పర్యవేక్షించడానికి ఒక అధికారిని ప్రత్యేకంగా నియామకం చేయాలని ఆదేశించారు. నిర్దేశించుకున్న ముందస్తు జాబ్ క్యాలెండర్ ప్రకారం ఏప్రిల్ ఐదు లోగా దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేసి, ఆరు నుంచి మూడు వారాల్లో మండల స్థాయిలో లబ్ధిదారుల ఎంపికకు స్క్రూటినీ చేయాలని చెప్పారు. ఆ తర్వాత లబ్ధిదారుల జాబితాను జిల్లా కలెక్టర్‌కు మండల అధికారులు పంపించాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ వారం రోజుల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి జిల్లా ఇన్చార్జి మంత్రి అనుమతి కోసం పంపించి అప్రూవల్ వచ్చిన తర్వాత లబ్ధిదారులను ప్రకటించాలన్నారు. జూన్ రెండు నాడు స్వయం ఉపాధి పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు రాష్ట్ర వ్యాప్తంగా మంజూరి పత్రాలను అందజేయాలన్నారు.. జూన్ రెండు నుంచి తొమ్మిది వరకు లబ్ధిదారులకు సంబంధించిన పత్రాలను నియోజకవర్గాల్లో పంపిణీ చేయాలని చెప్పారు.

ఆ తర్వాత లబ్ధిదారులకు వ్యాపార మెలకువలకు సంబంధించిన నైపుణ్యం అందించడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్దేశించారు. ఈ ప్రక్రియలో ఎక్కడ కూడా మధ్య దళారీల పైరవీలు లేకుండా కట్టడి చేయాలనీ, లబ్ధిదారుల ఎంపిక చాలా పారదర్శకంగా ఉండాలని సూచించారు. నిర్దేశించుకున్న కార్యాచరణ ప్రణాళికను క్షేత్రస్థాయిలో వంది శాతం అమలు కావడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్ ఉన్నత అధికారులు ఈ శ్రీధర్, శరత్, శ్రీధర్, దివ్య దేవరాజన్, తఫ్సీర్ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను దగా చేసిన కాంగ్రెస్

- వరంగల్ డిక్లరేషన్ అమలెప్పుడు : అసెంబ్లీలో పాడి కౌశిక్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని బీఆర్ఎస్ సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. శనివారం అసెంబ్లీలో వ్యవసాయం, అనుబంధ రంగాల పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రైతులందరికీ రూ.రెండు లక్షల్లోపు రుణాలు మాఫీ కాలేదన్నారు. అందరికీ రైతుభరోసా నిధులు జమ కాలేదని వివరించారు. హుజురాబాద్ నియోజకవర్గంలో రైతు రుణమాఫీ రూ.219 కోట్లు అయ్యిందంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రకటించారని గుర్తు చేశారు. తాను అధికారుల ద్వారా తెలుసుకున్న సమాచారం ప్రకారం రూ.185 కోట్ల రుణమాఫీ అయ్యిందని వివరించారు. ఇందులో ఏది వాస్తవమో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. కేసీఆర్ హయాంలో రూ.29 వేల కోట్ల రుణమాఫీ అయ్యిందని వివరించారు. రైతుబంధు ద్వారా రూ.73 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారని అన్నారు. రైతుభరోసా ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారనీ, ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఎకరాకు రూ.12 వేలు ఇవ్వడం సరైంది కాదన్నారు. సన్నవడ్లకు బోనస్ ఇస్తున్నామని చెప్పడం బోగస్ అని ఆరోపించారు. బోనస్ డబ్బులు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇస్తామన్నారని గుర్తు చేశారు. కానీ బారాణ మందిని వదిలేసి చారాణ మందికే ఇస్తున్నారని అన్నారు. అడుగడుగునా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. అన్నం పెట్టిన రైతుకు సున్నం పెట్టిన చరిత్ర సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం చెప్పారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అంటేనే బోగస్ అని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి మీద ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. వరి వేస్తే ఉరి అన్నది బీఆర్ఎస్ కాదా?అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలన రైతులకు స్వర్ణయుగమని అన్నారు. కాంగ్రెస్ పాలన సంక్షోభమని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఇప్పటి వరకు 446 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వరంగల్‌లో రైతు డిక్లరేషన్‌ను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. అందరికీ రుణమాఫీ చేయాలనీ, రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గొర్రెల పంపిణీలో రూ.700 కోట్ల అవినీతి : వాకిటి శ్రీహరి

బీఆర్ఎస్ హయాంలో గొర్రెల పంపిణీలో రూ.700 కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ సభ్యులు వాకిటి శ్రీహరి విమర్శించారు. ఏసీబీ కేసు నమోదు చేసిందనీ, కొందరిని అరెస్టు చేసిందని వివరించారు. యాదవులను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. గొర్రెల యూనిట్ల పంపిణీలో అక్రమాలు జరిగాయని చెప్పారు. చేపపిల్లలను చెరువుల్లో వేయడంలోనూ అవినీతి జరిగిందని అన్నారు.

సమస్యలపై గొంతెత్తిన ప్రజాప్రతినిధులు

జీరోఅవర్‌లో అధికార, ప్రతిపక్ష సభ్యుల గళం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనసభలో శనివారం జీరో అవర్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులు తమ నియోజకవర్గాల్లోని సమస్యలపై ఏకరువు పెట్టారు. వాటిని పరిష్కరించాలని గొంతెత్తారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీలు...ఇలా స్థానికంగా ప్రజలు తక్షణం ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను సభ ముందుచ్చారు. వడగండ్ల వానలకు పంటలు దెబ్బతిన్న వైనాన్ని ప్రస్తావిస్తూ...భూగర్భ జలాలు ఇంకిపోయి పంటలు ఎండిపోతున్న తీరును కండ్లకు కట్టినట్టు వివరించారు. రోడ్లు, భూ సమస్యలు, సాగునీటి కాలువల మరమ్మతులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, ఫ్యూచర్ సిటీలో అదనంగా భూసేకరణ వద్దని సర్కారు దృష్టికి తీసుకొచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో ఫారెస్టు అధికారుల వేధింపులు అధికార పార్టీ సభ్యులకే తప్పడం లేదని ఆ జిల్లా ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న తండాలకు, గ్రామాలకు రోడ్లు నిర్మించాలన్నా... కరెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలన్నా ...పైపులైన్లు వేయాలన్నా...అనేక కొర్రీలు పెడుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో వడ్లగండ్ల వాన విధ్వంసం సృష్టించిందనీ, తద్వారా కరెంట్ పోయిందనీ, వెంటనే పున:రుద్ధరించాలని ఎంఐఎం సభ్యులు కోరారు. నారాయణఖేడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలోని నల్లపోచమ్మ దేవాలయం, మంజీర నది ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బెల్లంపల్లి శాసనసభ్యులు జి. వినోద్ మాట్లాడుతూ తమ ప్రాంతంలో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నూరు రిజర్వాయర్ నుంచి రెండు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ కింద ప్రధాన కాలువలు పూర్తయ్యాయనీ, పిల్ల కాలువలు పూర్తి కాలేదనీ, దీంతో పంట పొలాలకు నీటి సరఫరా కావడం లేదని దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డి వివరించారు. జోగులాంబ దేవాయాలభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని అలంపూర్ శాసనసభ్యులు విజయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో తెలంగాణ ఆరోగ్యశ్రీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యూచర్ సిటీలో ఏడు మండలాలను చేర్చారనీ, అందులో కొన్ని గ్రామాలను చేర్చలేదనీ, అన్ని గ్రామాలను చేర్చాలని మహేశ్వరం శాసన సభ్యులు సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ రహదారి అక్కర్లేదని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనానికి తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖలకు అవకాశం కల్పించడం పట్ల బీజేపీ సభ్యులు రాకేష్‌రెడ్డి తెలుగురాష్ట్రాల సీఎంలకు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. భద్రాచలం నియోజకవర్గంలోని ఏపీ సరిహద్దు గ్రామాల విద్యార్థుల నాన్‌లోకల్ సమస్యను పరిష్కరించాలని శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో పేదల భూముల్లోకి పోకుండా ఓ ప్రయివేటు కంపెనీ ఫెన్సింగ్ వేసిందని అన్నారు. డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చరర్లకు జీవో 1376 ప్రకారం వేతనాలు చెల్లించాలని శాసనసభ్యులు యడ్మబొజ్జు కోరారు.

రైతు రుణమాఫీపై అసెంబ్లీలో మాటకు మాట

- హరీశ్‌రావు వర్సెస్ మంత్రి తుమ్మల
- వందశాతం రుణమాఫీ చేశామన్న మంత్రి
- మాట తప్పిన సర్కార్ ...హరీశ్
- బీఆర్ఎస్ వాకౌట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు రుణమాఫీపై శాసనసభలో శనివారం కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. కాంగ్రెస్ సభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, గల్ఫ్ ప్రాంతాలకు ఉపాధికి వెళ్లిన వారి పేరు మీద పాస్ బుక్ ఉండటం, రుణం కుటుంబంలో ఇతరుల పేరు మీద ఉండటంతో రుణమాఫీ కావడం లేదని తెలిపారు. ఇలాంటి వారు ఎక్కువగా ఉత్తర తెలంగాణలో ఉన్నారని చెప్పారు. వీరికి రుణమాఫీ ఫలితం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యులు హరీశ్ రావు మాట్లాడుతూ, తాము మొదట్నుంచి వందశాతం రుణమాఫీ కాలేదని చెబుతున్నదే కాంగ్రెస్ సభ్యులు ఆది శ్రీనివాస్ కూడా చెప్పారన్నారు. దీనిపై ఆది శ్రీనివాస్ అభ్యంతరం తెలిపారు. తన మాటలను హరీశ్ రావు వక్రీకరించారని తెలిపారు. వంద శాతం రుణమాఫీ జరిగిందనీ, సాంకేతిక సమస్యలున్న చోట ఎదురైన ఇబ్బందులను తొలగించాలని తాను కోరినట్టు తెలిపారు. హరీశ్ రావు మాట్లాడుతూ తాను ప్రాతినిథ్యం వహిస్తున్న సిద్దిపేట నియోజకవర్గంలో 11 వేల మందికి రుణమాఫీ జరగలేదనీ, ఆది శ్రీనివాస్ ప్రాతినిథ్యం వహిస్తున్న వేములవాడలో కూడా అందరికి కాలేదనీ, కావాలంటే జాబితా తెప్పించి ఇస్తానని సవాల్ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, రూ.2 లక్షలలోపు రుణమున్న వారందరికి రుణమాఫీ చేస్తామని మాటిచ్చామనీ, ఆ హామీ మేరకు అందరికి రుణమాఫీ చేసినట్టు స్పష్టం చేశారు. దీనిపై హరీశ్ రావు మాట్లాడుతూ, రూ.2 లక్షల కన్నా ఎక్కువగా రుణముంటే, ఆ ఎక్కువగా ఉన్న రుణం తీర్చుకున్న రైతులకు మిగిలిన రూ.2 లక్షలను ప్రభుత్వం మాఫీ చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట తప్పారనీ, రూ.2 లక్షలలోపు రుణమున్న వారిలో కూడా అందరికి రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ సర్కార్ మాట తప్పినందుకు నిరసనగా వాకౌట్ చేశారు.

మూతబడ్డ హరిత హోటళ్లను తెరిపిస్తాం..కొత్తవి నిర్మిస్తాం

- కూనంనేని చెప్పిన జూపార్కు, సఫారీ వినతిని పరిశీలిస్తాం
- పర్యాటరంగం అభివృద్ధి కోసం ప్రత్యేకదృష్టి : మంత్రి జూపల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి మూతపడ్డ హరిత హోటళ్లను తెరిపిస్తామనీ, కొత్తవి నిర్మిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీనిచ్చారు. శనివారం శాసనసభలో నదీపరివాహక ప్రాంతాల్లో పర్యాటకరంగం అభివృద్ధిపై సీపీఐ పక్ష నేత కూనం నేని సాంబశివరావు, విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, భూపతిరెడ్డి, మనోహర్‌రెడ్డి, రామచంద్రనాయక్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. కూనంనేని మాట్లాడుతూ..కిన్నెరసానిని టూరిజం సెంటర్‌గా మార్చాలనీ, అక్కడ ఫారెస్టువాళ్లతో మాట్లాడి జూపార్కు ఏర్పాటు చేయాలని విన్నవించారు. కిన్నెరసాని నుంచి భద్రాచలం వరకు పలు పర్యాటక ప్రాంతాలను కలుపుతూ సఫారీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..మిడ్‌మానేరు డ్యామ్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలనీ, నాంపల్లి గుట్టపై రోప్‌వే ఏర్పాటు చేయాలని కోరారు. సిరిసిల్ల హరిత హోటల్‌ను పూర్తిచేయాలని కోరారు. భూపతిరెడ్డి మాట్లాడుతూ..బాసర సర్క్యూట్‌ను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని విన్నవించారు. వికారాబాద్ జిల్లాలోని కోటిపల్లి ప్రాజెక్టుకు ప్రతి ఆదివారం ఐదువేల నుంచి పదివేల మంది పర్యాటకులు సందర్శిస్తున్నారనీ, అక్కడ కనీస సౌకర్యాలు లేవని ఎత్తిచూపారు. ఆ ప్రాంతంలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకులు మరింత ఎక్కువ సంఖ్యలో వస్తారని చెప్పారు. కొరవి వీరభద్రస్వామి దేవాలయాన్ని, భద్రకాళి చెరువులో బోటింగ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో టూరిజం హోటల్‌ను నిర్మించాలని కోరారు. వచ్చే ఐదేండ్లలో 15వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించి 3 లక్షల మందికి ఉపాధి కల్పించేలా పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సభ్యులు లేవనెత్తిన అంశాలు తమ పరిశీలనలో ఉన్నాయన్నారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తికాగానే నియోజకవర్గాల వారీగా పర్యాటక రంగం అభివృద్ధికి అనుకూలంగా ఉన్న ప్రాంతాలను గుర్తిస్తామన్నారు.

IN THE COURT OF THE HON BLE I ADDL. DISTRICT JUDGE:
M-M DISTRICT AT: KUSHAIGUDA
I.A. No. 1697/2024
IN
0.S.No. 1317 of 2022
(Old O.S. No. 1075/2014)

Between:
1. Garika Yadagiri, S/o. Late G.Bachaiah, (Died per LRs.) & Others
Petitioners/Plaintiffs
AND
1. Samala Sayamma & Others ...Respondents /Defendants
To,

1. R-1 Samala Sayamma, W/o. Late Malla Reddy @ Mallaiah, Aged 62 years, Occ: House-wife, R/o. Boduppal Village, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500 092
2. R-3 Thotakura Salaiah, S/o. Late Achaiah, Aged 65 years, Occ:Business, R/o. Boduppal Village, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500 092
3. R-8 M. Srikanth Reddy, S/o. M. Venkat Reddy, Aged 37 years, Occ: Business, R/o.Plot No.9, East Hanumannagar, Boduppal Village, Medipally Mandal, Medchal-Malkajgiri District-500 092
4. R-20 Uppu Thirupathaiah, S/o. Venkateshwarlu, Aged 58 years, Occ: Pvt. Service, R/o. Vinukonda Village & Mandal, Guntur District-522 647.
5. R-27 Smt. V. Lakshmi, W/o. V.Veeraiah, Aged 56 years, Occ: Housewife, R/o. H. No. 6-77, Indiranagar, Ramanthapur, Uppal, M-M. District-500 013.
6. R-29 Arpula Sailu Yadav, S/o. Komraiah Yadav, Aged 38 years, Occ: Driver, R/o. Jampally Village, Bibinagar Mandal, Yadadri-Bhongir District-508 126.
7. R-30 Maddula Jayamma, W/o. M. Narsimha Reddy, Aged 61 years, Occ: Housewife, R/o. H.No. 10-9,Peerzadiguda Village, Medipally Mandal, M-M. District 500 039.
8. R-31 Mettu Devi Prasad, S/o. Late M. Sathaiah,Aged 53years, Occ: Employee, R/o. H.No. 2-1-271, Mamathanagar Colony, Nagole, L.B.Nagar, Hyderabad-500 068.
9. R-32 Gudelly Narayana, S/o. G. Narsaiah, Aged 70years, Occ: Service, R/o. H.No. 3-9/2, Vikrampuri, Habsiguda, Hyderabad - 500 007.
10. R-33 Kodam Swamy,S/o. Narsaiah, Aged 61 years, Occ: Business, R/o. Venkiryal Village, Bibinagar Mandal, Yadadri Bhongir District-508 126.
11. R-34 V.Vijay Mohan, S/o. V.Janardhan, Aged 35years, Occ: Business, R/o. H.No. 17-40, Jubilee Nagar, Achampet, Mahaboobnagar District. PIN No. 509 375.
12. R-35 V. Bhasker, S/o.V. Janardhan, Aged 37 years, Occ: Business, R/o. H.No. 17-40, Jubilee Nagar, Achampet, Mahaboobnagar District. PIN No. 509 375.
13. R-36 G. Roop Karan, S/o. Late G. Balaji, Aged 43years, Occ: Business, R/o. H.No. 2-36, Mallikarjuna Nagar, Peerjadiguda Village, Medipally Mandal, Medchal-Malkajgiri District-500 039,
14. R-37 G. Kamala Bai, W/o. Late G. Balaji, Aged 71 years, Occ: Housewife, R/o. H.No. 2-36, Mallikarjuna Nagar, Peerjadiguda Village, Medipally Mandal, Medchal-Malkajgiri District- 500 039.
15. R-38 K. Ankineedu, S/o. SriRamaiah, Aged 53 years, Occ: Business, R/o. H.No. 1-89/A, Srinagar Colony, Nacharam, Hyderabad-500076.
16. R-39 Vijaya Kumar, S/o. Narasimhulu, Aged 54 years, Occ: Business, R/o. H.No. 8-26/1, Hemanagar, Boduppal Village, Medipally Mandal, M-M. District - 500 092.
17. R-40 D.Venkataiah, S/o. D. Mallaiah, Aged 54 years, Occ: Govt.Employee, R/o. H.No. 2-3-603/49/140, New Patel Nagar, Amberpet, Hyderabad.
18. R-41 D.Lavanya, D/o. D. Venkataiah, W/o. D. Lingam, Aged 30 years, Occ: Teacher, R/o. Plot No.42, H.No. 3-16-103/C/2/1, Venkat Reddy Nagar, Amberpet, Hyderabad.
19. R-42 D. Bhanu Rekha, W/o. D.Bala Krishna, Aged 40 years, Occ: Housewife, R/o. Plot NO.413, Budha Nagar Colony, Uppal Depot, Peerzadiguda Village, Medipally Mandal, M-M. District. PIN No. 500 039.
20. R-44 Samala Sugunamma, W/o. S. Shankaraiah, Aged 63 years, Occ: Housewife, R/o. H.No. 9-82, Hanuman Nagar, Boduppal, Medipally Mandal, M-M. District-500 092.
21. R-45 A. Krishna Reddy, S/o. A. Srinivas Reddy, Aged 40years, Occ: Business, R/o. H.No. 3-70, Hanmapur Village, Bhuvanagiri Mandal, Yedadri-Bhongir District. PIN No. 508 116.
22. R-46 Shaik Khaja Bee, W/o. Shaik Nabi Sab, Aged 58 years, Occ: Housewife, R/o. H.No. 3-4-16/1, Rajendranagar Ramanthapur, Hyderabad-500013.
23. R-47 Gampa Chakrapani, S/o. Limbaiah, Aged 27 years, Occ: Business, R/o. H. No. 4-47, Devunipally Village, Kamareddy-503 112.
24. R-48 T.Srisailam Yadav, S/o. Yellaiah Yadav, Aged 46 years, Occ: Agriculture, R/o. H.No. 9-68/B, Hanuman Nagar, Boduppal Village, Medipally Mandal, Medchal-Malkajgiri District- 500 092.
25. R-54 Koppu Venkat Mohan, S/o. K. Kistaiah, Aged 50years, Occ: Business, R/o. H.No. 4-121/13, V.S.T.Colony, Nacharam, Kapra Municipality. M-M. District., Hyderabad -
26. R-55 Guduri Venu Gopal, S/o. G. Gangaram, Aged 38 years, Occ: Pvt. Employee, R/o. H.No. 5-88/6, X Road, Chalgal Village, Jagitial Mandal, Karimnagar District. PIN No. 505 327.
27. R-57 Balay Srinivas, S/o. Balay Veeresham, Aged 51 years, Occ: Agriculture, R/o. H.No. 6-88,Ramalayam Street, Unguturu, West Godavari District. PIN No. 534 411.
28. R-59 Solipuram Sathi Reddy, S/o. S. Padma Reddy, Aged 57years, Occ: Business, R/o. Pilot No.8, Budda Nagar, Peerzadiguda Village, Medipally Mandal, M-M. District-500 039.
29. R-60 Singireddy Srinivas Reddy, S/0.S. Yadi Reddy, Aged 42 years, Occ:Agriculture, R/o. H.No. 3-110, Boduppal Village, Medipally Mandal, M-M. District - 500 092.
30. R-62 Solipuram Sathi Reddy, S/o. S. Padma Reddy. Aged 57years, Occ: Business, R/o. Plot No.8, Buddanagar, Peerzadiguda Village, Medipally Mandal, M-M. District - 500 092.
31. R-65 Mohammed Khudrath Nawaz, S/o.Late AbdulAzeez, Aged about 47 years, Occ: Business, R/o. H.No. 17-1-218/C, LIGH Old Santosh Nagar, Hyderabad,
32. R-67 Masarath Jahan, S/o. Mohammed Abdul Majeed, D/o. Late Abdul Azeez, Aged 53 years, Occ: Housewife, R/o. H.No. 17-1-218/C, LIGH, Old Santoshnagar, Hyderabad - 500 059.
33. R-68 Mohammed Khudrath Namaz, S/o. Late Abdul Azeez, Aged about 47 years, Occ: Business, R/o. H.No.17-1-218/C, LIGH, Old Santoshnagar, Hyderabad -500 059.
34. R-69 Mohammed Abdul Majeed, S/o. Mohd. Abdul Hameed, Aged about 50 years, Occ: Pvt. Service, R/0. H.No.5-39, Indiranagar, Ramanthapur, Hyderabad - 500 013.
35. R-70 Mohd. Kaja Moinuddin, S/o. Late Kader Moinuddin, Aged 63 years, Occ: Govt..Service, R/o. H.No. 5-39, Ramanthapur, Hyderabad. PIN No. 500 013.
36. R-72 Dooseti Bal Reddy, S/o. Ram Reddy, Aged 54 years, Occ:Pvt. Employee, R/o.H.No. 9-79/1, Plot No.34, Udayanagar Colony,Boduppal, R.R.District. PIN No. 500 092.
37. R-73 A.Urmila, W/o. A. LaxmaReddy, Aged 55years, Occ: Household, R/o. Chandapally Village& Post, Atmakur Mandal, Nalgonda District-508 111.
38. R-74 B. Vijaya Laxmi, W/o. E. Narayan Goud, Aged about 40 years, Occ:Teacher, R/o. Plot No. 108C, Vengal Rao Nagar, Hyderabad - 500 038.
39. R-75 Syed Abdul Raheem, S/o. Syed Ishag, Aged 41 years, Occ: Business, R/o. H.No. 2-2-50/1, B.Rehatnagar, Amberpet, Hyderabad-
40. R-76 R. Thirumala Rao S/o. R. venkatesham, Aged 45 years, Occ: Govt. Service, R/o. H.No. 2-2-127/38/4, VijeyapuriColony, Uppal, Hyderabad - 500 039.
41. R-77 Puram Anil Kumar, S/o. Puram Vaikuntam, Aged 33 years, Occ: Employee, R/o. H.No. 3-4-6,.Green Market Road, Jammikunta, Karimnagar District. PIN No. 505 122.
42. R-80 Smt.A. Prasanna Laxmi, W/o. A. Prabhakar. Aged 33 years, Occ: Housewife, R/o. H.No. 1-4-56/1, Ramalayam, Paripally Street, Siddipet - 502 103.
43. R-82 Ch. Venkanna, S/o. Ch. Seethaiah, Aged 37 years, Oce: Business, R/o. Boduppal Village, Medipally Mandal, M-M. District - 500 092.

Please take notice that whereas the Petitioners / Plaintiffs filed petition /Application Under Order IX Rule 9 of C.P.C. vide I.A. No. 1697/2024 in O.S. No. 317/2022 on the file of Hon'ble I Addl. District Judge: Medchal-Malkajgiri District Court, At: Malkajgiri and the same is posted to 01-04-2025 for your notice. Hence, make it convenient to be present on the said date by 10.30 A.M. before the above said court in person or by a pleader, failing which said application will be heard and determined ex-parte.

(BY ORDER OF THE COURT)

P.SRINIVASA RAO
Advocate
Flat No. A-14, Ground Floor, Srinivasa Heights Apts,
Uppal, Hyderabad-39.Cell: 9346666438

దక్షిణాదికి నష్టం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యాన్ని నేటికీ సాధించనందున దానిని మరో పాతిక సంవత్సరాల పాటు కొనసాగించాలని తీర్మానం కోరింది.

జనాభా నియంత్రణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాల్లో జనాభా తగ్గిపోయిందని, ఇప్పుడు వాటిని శిక్షించడం సమంజసం కాదని తీర్మానం పేర్కొంది. సమావేశానికి హాజరైన రాష్ట్రాలకు చెందిన ఎంపీలతో కోర్ కమిటీని ఏర్పాటు చేయాలని, అది పార్లమెంటులో సమన్వయ వ్యూహాలు రూపొందించుకొని పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తుందని తెలిపింది. కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో ప్రధాని నరేంద్ర మోడీకి వినతిపత్రం సమర్పిస్తారు. జేఏసీ సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీలు తమ తమ శాసనసభలలో పునర్విభజన ప్రక్రియకు వ్యతిరేకంగా తీర్మానాలు చేసేం దుకు కృషి చేస్తాయి. సమన్వయ ప్రయత్నాల ద్వారా ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తాయి. పునర్విభజన కోసం చేసే ఏ ప్రయత్నమైనా ఫెడరలిజం, ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడి ఉండేదిగా ఉండాలని తీర్మానంలో స్పష్టం చేశారు. ముసాయిదా ప్రతిపాదనను డీఎంకే పార్లమెంటరీ పార్టీ నాయకురాలు కనిమొళి చదివి వినిపించారు. పునర్విభజన ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, అందులో అన్ని రాష్ట్రాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబం ధిత వ్యక్తులు భాగస్వాములు కావాలని ఆమె అన్నారు. ఈ సమావేశంలో కేరళ, తెలంగాణ, పంజాబ్ ముఖ్య మంత్రులు పినరయి విజయన్, ఎనుముల రేవంత్‌రెడ్డి, భగవత్ మాన్, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్‌లతో పాటు బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ (ఎం), సీపీఐ, బీజేడీ, ఆప్ పార్టీల నేతలు పాల్గొన్నారు.

బీజేపీది జనాభా జరిమానా విధానం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. 1971లో జనాభాను నియంత్రించాలని దేశం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు దాన్ని అమలు చేస్తే ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విఫలమయ్యాయని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థికవృద్ధిని సాధించాయి.. జీడీపీ, తలసరి ఆదాయం, వేగంగా ఉద్యోగాల కల్పన, మెరుగైన మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో మంచి ప్రగతి సాధించాయని చెప్పారు. దేశ ఖజానాకు మనం పెద్ద మొత్తంలో నిధులు ఇస్తూ తక్కువ మొత్తాన్ని పొందుతున్నామన్నారు. తమిళనాడు పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 29 పైసలే వెనక్కి వస్తుంటే... ఉత్తరప్రదేశ్‌కు రూపాయికి రూ.2.73, బీహార్ కు రూ.9.22, మధ్యప్రదేశ్‌కు రూ.2.79 వెనక్కి వెళు తున్నాయని తెలిపారు. అదే దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటకకు 14 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు వెనక్కి వస్తున్నాయని వివరించారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులు క్రమంగా తగ్గిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కేటాయింపుల్లోనూ ఉత్తరాది రాష్ట్రాలకే 60 నుంచి 65 శాతం నిధులు దక్కుతున్నాయని విమర్శించారు.

దక్షిణాది రాష్ట్రాల రాజకీయ కుదింపునకు దారితీసే పునర్విభజనను అంగీకరించబోమని సీఎం తేల్చిచెప్పారు. ప్రగతిని సాధిస్తున్న రాష్ట్రాలను ఈ ప్రక్రియ శిక్షిస్తోందనీ, ఇలాంటి అసమగ్రమైన పునర్విభజన ప్రక్రియ చేపట్టకుండా బీజేపీని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 1976లో రాజకీయ తేడాలు రాకుండా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పునర్విభజన చేపట్టిందని గుర్తుచేశారు. 2001లో ప్రధానమంత్రి వాజ్‌పేయీ నేతృత్వంలోని ప్రభుత్వం పునర్విభజన ప్రక్రియను అలానే ప్రారంభించిందని తెలిపారు. బీజేపీ ప్రతిపాదిస్తున్న జనాభా దామాషా పద్ధతిలో పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ గళం కోల్పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది వారిని ఉత్తరాది ద్వితీయ శ్రేణి పౌరులుగా తగ్గించి వేస్తుందని చెప్పారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు దేశంపై ఆధిపత్యం చెలాయిస్తాయన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ఈ విధానానికి వ్యతిరేకంగా దక్షిణాది ప్రజలు, పార్టీలు, నాయకులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రొరేటా విధానాన్ని పాటిస్తే సీట్ల మధ్య తేడా కేంద్ర ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయిస్తుంది.. ఒక్క సీటు కూడా తేడాను చూపుతుందన్నారు. ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర మన దేశంలో ఉందని గుర్తుచేశారు. కాబట్టి ప్రొరేటా విధానం కూడా దక్షిణాది రాజకీయ ప్రయోజనాలకు భంగం కలిగిస్తుందన్నారు.

"పార్లమెంట్ దేశానికి విధానపరమైన శాసనాలను రూపొందిస్తుందే తప్ప ప్రజలకు అవసరమైన చిన్న చిన్న సమస్యలపై నిర్ణయాలు చేయదు. ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలు స్థానిక సంస్థలు, రాష్ట్రాలు, శాసనసభ నియోజకవర్గాల పరిధిలోనే పరిష్కారమవుతాయి. జనాభా నియంత్రణకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే విధానానికి కేంద్రం స్వస్తి చెప్పాలి. దేశ నిర్మాణంలో 1975 నుంచి 2025 వరకు 50 ఏండ్ల పాటు మనం అందించిన సేవలకు మనల్ని అభినందించాలి. మంచి ప్రగతి సాధించిన దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ సీట్లలో మంచి వాటా ఇవ్వడం ద్వారా ఇతర రాష్ట్రాల ఆర్థిక వృద్ధి, సుపరిపాలనపై దృష్టి సారించేలా చేయాలి." అని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

శాసనసభలో తీర్మానం

పునర్విభజన ప్రక్రియపై తెలంగాణ రాష్ట్ర శాసనసభలో త్వరలోనే తీర్మానం ఆమోదిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేస్తున్నట్టే దక్షిణాది రాష్ట్రాల అసెంబ్లీల్లో తీర్మానాలు చేయాలని సహచర ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. దక్షిణ భారతదేశ పౌరుల గళాన్ని బలంగా, ఐక్యంగా మొత్తం భారతదేశానికి వినిపిద్దామని సూచించారు.



పునర్విభజనపై చెన్నైలో జరిగిన అఖిలపక్ష భేటీలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల నేతలు

ఈ సమావేశం చారిత్రాత్మకం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతే వాటి రాజకీయ శక్తి కూడా క్షీణిస్తుందని చెప్పారు. జాతి దృష్టిని ఆకర్షించేం దుకు అవసరమైన రాజకీయ బలం లేనందు వల్లనే న్యాయాన్ని కోరుతున్న రాష్ట్రాల అభిప్రా యాలను బేఖాతరు చేస్తున్నారని తెలి పారు. రాష్ట్రాలకు తగినంత రాజకీయ బలం లేక పోవడం వల్లనే కేంద్రం ఉదాసీనంగా వ్యవహరి స్తోందని, మణిపూర్‌లో గత రెండు సంవత్సరా లుగా కొనసాగుతున్న హింసాకాండే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. 'పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గితే అనేక అనర్థాలు జరుగుతాయి. కేంద్రం నుండి మనకు న్యాయంగా రావాల్సిన నిధుల కోసం పోరా డాల్సి వస్తుంది. మన అంగీకారంతో నిమిత్తం లేకుండా అవాంఛనీయ చట్టాలు చేస్తారు. మనల్ని అర్థం చేసుకోలేని వారు తీసుకునే నిర్ణయాలు మన ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. విద్యా ర్థులు అవకాశాలు కోల్పో తారు. రైతులకు మద్దతు లభించదు. మన సంప్రదాయాలు, గుర్తింపు, అభివృద్ధి ప్రమాదంలో పడతాయి. సామాజిక న్యాయం దెబ్బతిం టుంది. మహిళా సాధికారతకు ఎదురు దెబ్బలు తగులుతాయి. స్వదేశంలోనే రాజకీయంగా బలహీనులం అవుతాము. ఎస్సీలు, ఎస్టీలు నష్ట పోతారు' అని అన్నారు. తమ పోరాటం పునర్వి భజనకు వ్యతిరేకం కాదని స్పష్టం చేస్తూ న్యాయసమ్మతమైన, నిష్పాక్షిక మైన పునర్విభజనను తాము కోరుకుంటున్నా మని వివరించారు.

రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి ఉన్నప్పుడే దేశంలో సమాఖ్య స్ఫూర్తి కొనసాగుతుందని స్టాలిన్ అన్నారు. "రాష్ట్రాల హక్కులను బీజేపీ ఎప్పుడూ హరిస్తూనే ఉంటుందని, తమ ఉద్దేశాలను నెరవేర్చుకునేందుకు ఇప్పుడు పునర్విభజనను ముందుకు తెస్తోందని ఆరోపిం చారు. ఈ ముప్పును గుర్తించిన తమిళనాడు పునర్విభజనను వ్యతిరే కించడంలో అసాధారణ ఐక్యతను చాటుతోందని అంటూ దేశ ప్రజా స్వామ్యాన్ని, ఫెడరలిజాన్ని రక్షించేం దుకు ఇదే విధమైన ఐక్యతను చాటాలని జేఏసీ నేతలను కోరారు. న్యాయ సమ్మతమైన, నిష్పాక్షికమైన పున ర్విభజన చేపట్టే వరకూ పోరాటాన్ని కొనసాగిం చాలని పిలుపునిచ్చారు. 'ఏది ఏమైనా సరే. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్రాలన్నీ మన పార్లమెం టరీ ప్రాతినిధ్యం తగ్గిపోకుండా చూడాల్సిందే' అని స్పష్టం చేశారు. జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరిం చ కూడదని, జనాభాను నియంత్రిస్తున్న రాష్ట్రాల ను శిక్షించకుండా చూసుకోవాలని సూచించారు.

పునర్విభజనతో లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రా ల ప్రాతినిధ్యం తగ్గబోదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యను స్టాలిన్ ప్రస్తావిస్తూ ఆ హామీలో విశ్వసనీయత ఏముం దని ప్రశ్నించారు. ఆయన ఓ బహిరంగ సభలో ప్రకటన చేశారే తప్ప పార్లమెంటులో కాదని గుర్తుచేశారు. అమిత్ ప్రకటన రాజకీయ అస్పష్టతతో ఉన్నదని వ్యాఖ్యానించారు.

జనాభా విధానాన్ని అమలు చేయడమే నేరమా?

(మొదటి పేజీ తరువాయి)

సమర్థవంతంగా అమలు చేశాయని పినరయి తెలిపారు. ఆ లక్ష్యాన్ని సాధించి మరింత ముందుకు పోతున్నందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తోందని మండిపడ్డారు. 'ఇప్పుడు మీ జనాభా తక్కువగా ఉంది. కాబట్టి మీకు తక్కువ నిధులు, ప్రాతినిధ్యం సరిపోతాయి' అన్నట్లుగా వారి వైఖరి ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాగైనా పునర్విభజనను చేపట్టాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం భావిస్తున్నట్ల యితే అది జనాభా ప్రాతి పదికన కాకూడదని, దక్షి ణాది రాష్ట్రాలు పార్ల మెంటులో తమ దామాషా వాటా సీట్లను నిలుపు కునేలా చూడాలని సూచిం చారు. 'మన రాష్ట్రాలు నిష్పత్తి ఆధారంగా అద నపు సీట్లు పొందుతాయని కేంద్రం వాదిస్తోంది. అయితే ఈ నిష్పత్తి పంపిణీ అనేది ప్రస్తుత పార్లమెంట్ స్థానాల సంఖ్యను బట్టి జరుగుతుందా లేక జనసంఖ్యను బట్టి జరుగుతుందా అనే దానిపై కేంద్రం స్పష్టత ఇవ్వలేకపోతోంది' అని అన్నారు. జనాభా నియంత్రణ చర్యలను అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడానికి పునర్విభజనను ఓ మార్గంగా చూడరాదని పినరయి కోరారు. కేంద్రం నుండి రావాల్సిన పన్ను వాటాను తగ్గించడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలను కేంద్రం ఇప్పటికే శిక్షిస్తోందని ఆయన అన్నారు. 'పదవ ఆర్థిక కమిషన్ ఉన్నప్పుడు కేరళ వాటా 3.875 శాతం. ఇప్పుడు 15వ ఆర్థిక కమిషన్‌లో అది నామమాత్రంగా 1.925 శాతానికి పడిపోయింది. జనాభా నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయడం వల్ల ప్రజారోగ్యంపై ఖర్చు పెరిగింది. అయితే నిధులు బదిలీ చేసేటప్పుడు దీనిని ప్రత్యేకంగా పరిశీలించడం లేదు' అని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యం మరింత తగ్గిపోతే పన్నుల్లో వాటి వాటా కూడా మరింత క్షీణిస్తుందని పినరయి ఆందోళన వ్యక్తం చేశారు. 'మనం అసాధారణ పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. నిధులలో మనకు న్యాయసమ్మతంగా రావాల్సిన వాటా, దానిని డిమాండ్ చేయడం కోసం రాజకీయంగా మనం విప్పాల్సిన గళం...ఈ రెండూ తేలిపోతాయి' అని అన్నారు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలు సంఘటితంగా నిరసన తెలపాల్సిన అవసరం ఉన్నదని విజయన్ చెప్పారు.

అతిథులకు సత్కారం

సమావేశానికి హాజరైన నేతలను తమిళనాడు ఉత్పత్తులతో కూడిన గిఫ్ట్ హ్యాంపర్లతో సత్కరించారు. అందులో కాంచీపురం సిల్క్ చీర, పట్టమడై తివాచీలు, తోడా శాలువాలు, కన్యాకుమారి లవంగాలు, కోవిల్‌పట్టి కడలై మిఠాయి, ఊటీ వర్కీ (శాఖాహార స్నాక్), ఎరోడ్ పసుపు, కొడైకెనాల్ వెల్లుల్లి ఉన్నాయి. జేఏసీ భేటీకి వచ్చిన వారందరినీ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సాదరపూర్వకంగా ఆహ్వానించారు.

డీలిమిటేషన్‌పై హైదరాబాద్‌లో రెండో సదస్సు

- పునర్విభజనతో నష్టపోయే రాష్ట్రాల హక్కుల రక్షణకు భారీ బహిరంగ సభ
- జాతీయ స్థాయిలో సమన్వయం.. కార్యాచరణ అమలుకు ఢిల్లీలో కార్యాలయం

సీఎం రేవంత్‌రెడ్డి సూచనలకు సదస్సులో ఆమోదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాలతో పాటు నష్టపోయే ఇతర రాష్ట్రాల హక్కులను కాపాడుకునే క్రమంలో రెండో సదస్సుకు హైదరాబాద్ వేదిక కానుంది. పునర్విభజనకు సంబంధించి చెన్నైలో శనివారం నిర్వహించిన సదస్సు ఈ మేరకు తీర్మానించింది. సదస్సులో ప్రసంగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునర్విభజనతో నష్టపోనున్న రాష్ట్రాల ప్రజల అభిమతానికి అనుగుణంగా ఈ సదస్సును హైదరాబాద్ లో నిర్వహిస్తామనీ, అనంతరం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందుకు సదస్సులో పాల్గొన్నవారంతా మద్దతు తెలపడంతో పునర్వి భజన సదస్సు, సభకు హైదరాబాద్ వేదికగా మారనుంది. పునర్వి భజనపై దక్షిణాదితో పాటు నష్టపోయే ఇతర రాష్ట్రాల గళాన్ని బలంగా వినిపించేం దుకు ఆయా రాష్ట్రాల్లోని అన్ని పార్టీల ఎంపీలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలోనే అన్ని రాజకీయ పరమైన నిర్ణయాలు జరుగుతా యనీ, ఈ నేపథ్యంలో అక్కడ కార్యకలాపాలను ఎప్పటి కప్పుడు గమనిస్తూ, పరస్పరం సమన్వయం చేసుకుంటూ భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనకు ఎంపీలతో కూడిన కమిటీ పని చేయాలనీ, ఇందుకు ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఇందుకు సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రులు, నాయకులు అంగీకరించడంతో ఢిల్లీలో ఆ కార్యాలయం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.

సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా రేవంత్ రెడ్డి

నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి చరిత్ర, వర్తమాన పరిస్థితులతో పాటు జనాభా దామాషా, ప్రొరేట్ ప్రకారం పునర్విభజన జరిపితే దక్షిణాది రాష్ట్రాలు, పంజాబ్, ఒడిశా నష్టపోయే తీరును సీఎం రేవంత్ రెడ్డి వివరించడంతో సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ శ్రద్ధగా విన్నారు. నియోజకవర్గాల పునర్విభజన చేపట్టినా లోక్‌సభ సీట్లు పెంచకుండా శాసనసభ సీట్లు పెంచుకునే అవకాశం రాష్ట్రాలకు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించడం ప్రతి ఒక్కరిని ఆకర్షించింది. మహిళలకు 33 శాతం సీట్లు, ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపుపైనా సీఎం చేసిన సూచనలు చాలా అర్థవంతంగా ఉన్నాయని సదస్సులో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు అభిప్రాయపడ్డారు.

జనాభా ఆధారంగా సీట్ల పెరుగుదల జరిగితే..

దేశ సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీ లిమిటేషన్‌తో అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరగనుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనపై శనివారం చెన్నైలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. నిధులు కేంద్రీకృతం కావడంతో పాటు ఆర్థిక నియంతృత్వానికి దారితీస్తుందనీ, ఫలితంగా దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని అన్నారు. దేశానికి 36శాతం జీడీపీలో భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు కేంద్రంలోని మోడీ సర్కార్ చర్యల వల్ల నష్ట పోతాయని అన్నారు. డీలిమిటేషన్ అంశం కేవలం పార్లమెంట్ ప్రాతినిధ్యం తగ్గడానికి పరిమితం కాదనీ, ఆర్థికపరమైన వివక్షకు దారి తీస్తుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులన్ని ఉత్తరాదికే పరిమితవడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాల పునర్విభజన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమని వ్యాఖ్యానించారు. అస్తిత్వం కోసం, హక్కుల కోసం కొట్లాడడంలో తమిళనాడు ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందనీ, ఆ స్ఫూర్తితో కేంద్రంతో కలిసి కట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.

తమిళ ప్రజల నుంచి అనేకాంశాలు స్ఫూర్తిగా తీసుకుంటాం

కేసీఆర్ అధ్వర్యంలో 14 ఏండ్ల పాటు తెలంగాణ ఉద్యమం నడిపించాం. మెజార్టీ నియంతత్వం మందబలం ఉన్నప్పుడు జరిగే నష్టాలు మా తెలంగాణ ప్రజలకు తెలుసు.. తెలంగాణ ఉద్యమ కాలంలో ఢిల్లీలో ఉన్న మందబలంతో పాటు సమైక్య రాష్ట్రంలోని మెజార్టీ నాయకత్వం పైన పోరాటం చేసి 14 సంవత్సరాల అనంతరం తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చుకున్నాము. దీనివల్లనే 14 ఏండ్లు పట్టింది అనేక ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. తమిళనాడు ప్రజల నుంచి అనేక అంశాలు స్ఫూర్తిగా తీసుకుంటాం. అస్తిత్వం కోసం, హక్కుల కోసం కొట్లాడడంలో తమిళనాడు గొప్ప ఉత్తేజమిస్తుంది. ద్రవిడ ఉద్యమం సమైక్య దేశంలో తమ హక్కులు సాధించు కోవడానికి రాష్ట్రాలకు ఒక దిక్సూచి లెక్క పనిచేస్తుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.



కౌలు రైతులకూ

రైతు భరోసా వర్తింపజేయాలి

సీపీఐ శాసనసభ పక్షనేత కూనంనేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కౌలు రైతులకు రైతు భరోసా, రైతు భీమా వర్తింపజేయాలని సీపీఐ శాసనసభా పక్షనేత కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీలో వ్యయసాయం, ఆరోగ్యం. రవాణా పద్దులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ... రాష్ట్రంలో 22 లక్షల మంది కౌలు రైతులున్నారనీ, వారందరికి పట్టాదారు రైతుల మాదిరిగానే అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. వ్యవసాయానికి కేటాయింపులను మరో రూ.5వేల కోట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను పెంచాలని కోరారు. వైద్య సిబ్బంది, సౌకర్యాల లేమి వల్ల తన నియోజవర్గమైన కొత్తగూడెంలోని మాతా శిశు కేంద్రంలో ఇటీవల ఇద్దరు మహిళలు మృతి చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. నిమ్స్, గాంధీ, ఉస్మానియా దవాఖానలను మరింతగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు అందించడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అసంఘటిత రంగంలోని కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనాలు పెంచాలనీ, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కష్టాల్లో ఉన్న ఆర్టీసీని బతికించాలనీ, విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్లను రెగ్యులర్ చేయాలని కోరారు.

కాంట్రాక్ట్ నియామకాలపై పరిమితి ఎత్తివేత

యూజీసీ ప్రతిపాదనకు కేంద్రం ఓకే

విద్యాసంస్థల నాణ్యత, విద్యా స్వాతంత్ర్య స్ఫూర్తికి విఘాతం

ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల ఆక్షేపణ

న్యూఢిల్లీ : యూనివర్సిటీలు, కళాశాలలలో ఫ్యాకల్టీ సభ్యులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించు కోవడంపై అమలులో ఉన్న పది శాతం పరిమితిని రద్దు చేయాలన్న యూజీసీ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం సమర్థించింది. దీని ప్రకారం ఇకపై కాంట్రాక్ట్ అధ్యాపకుల నియామకంపై ఎలాంటి పరిమితులు ఉండవు. ఉన్నత విద్యా సంస్థలలో అధ్యాపకుల నియామకానికి సంబంధించిన నిబంధనలను యూజీసీ ఖరారు చేస్తోంది. జనవరిలో ముసాయిదా నిబంధనలను వెబ్‌సైటులో అప్‌లోడ్ చేసి సంబంధిత వ్యక్తులు, సంస్థల నుంచి అభిప్రాయాలు కోరింది.

ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం యూనివర్సిటీలు, కళాశాలలు తమ ఫ్యాకల్టీలో పది శాతం మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకోవచ్చు. అయితే ఈ పరిమితిని తొలగించాలని ముసాయిదా సూచించింది. విద్యా సంస్థలు తమకు ఇష్టం వచ్చిన విధంగా కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించుకునేందుకు అది వీలు కల్పిస్తోంది. కాగా యూజీసీ ప్రతిపాదనను ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నాయి. పరిమితిని ఎత్తివేస్తే ఉన్నత విద్యా సంస్థలలో పెద్ద ఎత్తున కాంట్రాక్ట్ అధ్యాపకుల నియామకానికి తలుపులు బార్లా తెరిచినట్టు అవుతుందని, దీనివల్ల విద్యా సంస్థల నాణ్యత దెబ్బతింటుందని, విద్యా స్వాతంత్ర్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుందని అవి ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

అయితే యూజీసీ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం గట్టిగా సమర్థిస్తోంది. రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలలో జాప్యం కారణంగా అనేక యూనివర్సిటీలు, కళాశాలలు ఫ్యాకల్టీ కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని విద్యా శాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ చెప్పారు. రెగ్యులర్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పుడు మాత్రమే విద్యా సంస్థలు కాంట్రాక్ట్ ప్రాతిపదికన అధ్యాపకులను నియమించుకుంటాయని, పరిమితిని తొలగించడంతో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేసుకునే అవకాశం కలుగుతుందని, విద్యార్థులకు నిరంతరాయంగా బోధన జరుగుతుందని ఆయన తెలిపారు.




మంత్రి కోమటిరెడ్డిపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు

స్పీకర్‌కు అందజేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై వారు సభా హక్కుల ఉల్లంఘన నోటీసును అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ చాంబర్‌లో కలిసి కోమటిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సమాధానమిస్తూ.. బీఆర్ఎస్ పాలనలో సీఆర్ఎస్ నిధులు రాలేదని, నల్లగొండ నియోజకవర్గ రోడ్లకు నిధులు కేటాయించలేదనీ, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ఎస్క్రో అకౌంట్ తెరవలేదని చెప్పడం ద్వారా సభను, సభ్యులను తప్పుదోవ పట్టించారని తెలిపారు. ఈ సందర్భంగా అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వ పాలనలో సీఆర్ఎఫ్ నిధులు వచ్చాయనీ, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ఎస్క్రో అకౌంట్ తెరిచామని గుర్తుచేశారు. నల్లగొండ నియోజకవర్గంలో రోడ్లకు పెద్దఎత్తున నిధులు కేటాయించామని చెప్పారు. ఇక ఈ మూడు అంశాలకు సంబంధించిన ఆధారాలు లేఖ ద్వారా స్పీకర్‌కు ఇచ్చామని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి ఉద్దేశపూర్వకంగా ఇచ్చిన సమాధానం పూర్తిగా అవాస్తవమనీ, ఉద్దేశపూర్వకంగా సభకు తప్పుడు సమాచారం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సభా గౌరవాన్ని తగ్గించడమే కాక సభ్యుల హక్కులకు భంగం కలిగించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద్ గౌడ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు.



రైతులను యాచకులుగా మార్చకండి

పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యాలు కల్పించండి : బీజేపీ సభ్యులు వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంక్షేమ పథకాలను భిక్షగా వేసి రైతులను యాచకులుగా మర్చొద్దని శాసనసభలో బీజేపీ సభ్యులు వెంకటరమణారెడ్డి ప్రభుత్వానికి సూచించారు. శనివారం అసెంబ్లీలో వ్యయసాయం, ఆరోగ్యం. రవాణా పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రైతులు విత్తనాలు వేసినప్పటి నుంచి పంటలు అమ్ముకునే వరకు ఎలాంటి గ్యారంటీ లేని జీవితం గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు భరోసా, రుణమాఫీ లాంటి సంక్షేమ పథకాలతో వారికి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తున్నారే తప్ప సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టడం, నాణ్యమైన విద్యుత్, సాగునీరు, గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యాలు కల్పిస్తేనే వారి జీవితాల్లో మార్పు వస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సిబ్బంది కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీతాలు సరిపోక సర్కార్ దవాఖానాల్లో పని చేసేందుకు డాక్టర్లు ముందుకు రావడం లేదనీ, యూజీసీ స్కేల్ ద్వారా భర్తీ చేయాలని సూచించారు. వైద్య శాఖ బడ్జెట్‌ను పెంచాలనీ, అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చెల్లుబాటయ్యేలా ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ హెల్త్ స్కీంను అమలు చేయాలని కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనీ, యూనియన్లను పునరుద్ధరించాలని కోరారు. సీఎంవో నుంచి కిందిస్థాయి వరకు వివిధ శాఖల్లో ఉద్యోగ విరమణ పొందిన వారిని ఎందుకు పొడిగిస్తున్నారని ప్రశ్నించారు.



కాకినాడలో జరిగిన సంఘటన చూస్తే, ఈ విద్యావ్యవస్థ ఎంతటి క్రూరత్వాన్ని ఇంజెక్ట్ చేస్తున్నదో బోధపడుతుంది. ఆ సంఘటన తలుచుకుంటేనే గుండెలన్నీ అవిసిపోతు న్నాయి. ఒకటో తరగతి, యూకేజీ చదువుతున్న ఇద్దరు పిల్లల్ని చేతులు, కాళ్లూ తాళ్లతో కట్టేసి, నీటి బకెట్‌లో తలలు ముంచి స్వయాన తండ్రే తన పిల్లల్ని దారుణంగా చంపేసాడు. తన పిల్లలు ఇతరులతో పోటీపడలేకపోతున్నారని, ప్రపంచంతో పోటీ పడలేక పోతున్నందుకు చంపేస్తున్నాననీ మరీ సూసైడ్ నోట్ రాసి చంపేశాడు. తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి చ దువుకున్నవాడే, ఓఎన్‌జీసీలో ఉద్యోగం. మరి చదువు ఏమిచ్చింది ఇతనికి? ఎదురీది బతకటమెలాగో నేర్పాలి కదా చదువు! ముక్కు పచ్చలారని పిల్లల్ని చంపడమేమిటి? ఎంత క్రూరత్వం నిండుతోంది మనుషుల్లో! అంత చిన్న పిల్లలు ఎవరితో పోటీపడాలి!

పోటీ!

'పోటీ అనేది ఆటవిక న్యాయం, సహకారం అనేది నాగరిక న్యాయం' అని అంటారు పీటర్ క్రొపొట్కిన్. కానీ అనాగరికంలోనూ, ఆటవికంలోనూ పరస్పర సహకారాలున్నాయి. అసలు ప్రకృతి పరిణామంలోనూ ఘర్షణ, సహకారం కలగలసే ఉంటాయి. సహకారంతోనే అభివృద్ధి అంతా జరిగింది. ఘర్షణ వేరు, పోటీ వేరు. పోటీతో అసూయలు, కోపాలు, ద్వేషాలు, శతృత్వాలు పెరగటానికి అవకాశాలున్న వ్యవస్థ మనది. పోటీ అనేది సముజ్జీల నడుమ, సమాన స్థాయిల మధ్య ఉండటం, అదీ అభివృద్ధి కోసం ఆరాటంగా ఉండాలే తప్ప, క్రూరత్వానికీ, నిస్సహాయితకు దారి తీయకూడదు. అందులోనూ ఈ పోటీలోకి డబ్బు ప్రభావం పెరిగిన తర్వాత గెలవటం, ఓడటం వ్యాపారంగా మారిపోయింది. పోటీలో ఓడిననాడు, పోటీపడలేనినాడు, మనల్ని మనం నిందించుకోవడం, అసమర్థునిగా చిత్రించుకోవడం పెరిగి ఒత్తిడికి గురయ్యి భవిష్యత్తునే ఛిద్రం చేసుకుంటున్నాము.

ముఖ్యంగా ఈ పోటీ విద్యారంగానికి పాకి, విద్యార్థుల తల్లిదండ్రుల పాలిట ఒక భయంకర ఉచ్చులా బిగుసుకుంటోంది. పిల్లలు అనేకానేక కారణాల, ప్రమేయాల వల్ల భిన్నమయిన స్థాయిలను కలిగి ఉంటారు. వేరు వేరు నైపుణ్యాలనూ, సృజనాత్మకతలను, దృష్టికోణాలను కలిగి ఉంటారు. కానీ నేడు మన విద్యా వ్యవస్థ ఒకే రకమైన మూస తరహా యాంత్రిక విజ్ఞానాన్ని అందించే కేంద్రంగా మారింది. ఇందులో పోటీపడి ఓడినవాడు, ఎందుకూ పనికిరాడనే భావాన్ని కలిగించడమూ ఈ విద్యావ్యవస్థ అందించిన ఆలోచనే. అందుకనే అనేకమంది ఐఐటీలు చదువుతున్న విద్యార్థులు, ఒత్తిడి భరించలేక తమను తామే హత్య చేసుకుంటున్నారు. లేదంటే హత్యలు చేసేవాళ్లుగా మారిపోతున్నారు. కాకినాడలో జరిగిన సంఘటన చూస్తే, ఈ విద్యావ్యవస్థ ఎంతటి క్రూరత్వాన్ని ఇంజెక్ట్ చేస్తున్నదో బోధపడుతుంది. ఆ సంఘటన తలుచుకుంటేనే గుండెలన్నీ అవిసిపోతున్నాయి. ఒకటో తరగతి, యూకేజీ చదువుతున్న ఇద్దరు పిల్లల్ని చేతులు, కాళ్లూ తాళ్లతో కట్టేసి, నీటి బకెట్‌లో తలలు ముంచి స్వయాన తండ్రే తన పిల్లల్ని దారుణంగా చంపేసాడు. తన పిల్లలు ఇతరులతో పోటీపడలేకపోతున్నారని, ప్రపంచంతో పోటీ పడలేక పోతున్నందుకు చంపేస్తున్నాననీ మరీ సూసైడ్ నోట్ రాసి చంపేశాడు. తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి చ దువుకున్నవాడే, ఓఎన్‌జీసీలో ఉద్యోగం. మరి చదువు ఏమిచ్చింది ఇతనికి? ఎదురీది బతకటమెలాగో నేర్పాలి కదా చదువు! ముక్కు పచ్చలారని పిల్లల్ని చంపడమేమిటి? ఎంత క్రూరత్వం నిండుతోంది మనుషుల్లో! అంత చిన్న పిల్లలు ఎవరితో పోటీపడాలి! ఎల్‌కేజీ నుండే ఐఐటీ కోచింగ్‌లకు అవకాశమిస్తున్న బడులూ, అందుకోసం మరీ పిల్లల్ని పంపుతున్న తల్లిదండ్రుల్ని మనం చూస్తూనే ఉన్నాం. ఈ రకమైన విధానం ఎందుకు పురుడుపోసుకుంది? విద్య, లాభనష్టాల వాణిజ్యమయ్యాక అందే ఆలోచనదే. డాలర్ కరెన్సీలు పోగుపడేసే మరలుగా మారిపోవడం తప్ప, మనుషులు మానవీయంగా వ్యవహరించడం ఆవిరయిపోతూనే ఉంది. పిల్లల, వారి వారి మానసిక స్థితులను బట్టి, అభిరుచులనుబట్టి ఎలాంటి శిక్షణలిప్పించాలన్న ఆలోచనలే లేని అశాస్త్రీయ విద్యా వ్యవస్థ మనది. పిల్లలు ఇలానే ఎదగాలన్న మూసధోరణి మనందరిలోనూ వేళ్లూనుకొని ఉంటోంది. సమాజ మానసిక స్థితీ అనారోగ్యమైపోయింది.



మొన్నీ మధ్య హైద్రాబాద్‌లో అప్పులయ్యాయని చదువుకున్న అధ్యాపకుడే, తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి, తానూ, తన భార్య ఆత్మహత్య చేసుకున్నారు. ఇలాంటి బలహీన మానసిక స్థితిలోకి నేటితరం ఎక్కువగా వెళ్లటం ఆందోళన కలిగించే విషయం. పిల్లలను, భార్యను చంపే అధికారం ఎవరిచ్చారు వీళ్లకి? ఈ చదువులు ఎంత అపసవ్య జ్ఞానాన్ని అందిస్తున్నాయి! మానసిక దౌర్భల్యం పెరిగిపోతున్నది. చిన్న చిన్న విషయాలకే ప్రాణాలు తీయటమో, ప్రాణాలు తీసుకోవటమో చేస్తున్నారు. ఇవన్నీ సామాజిక రుగ్మతలో భాగంగా జరుగుతు న్నాయి. నేటితరం మెదళ్లపై వచ్చిపడుతున్న సమాచారమూ, విషయమూ, దృశ్యమూ అన్నీ వ్యాపారాత్మక వ్యర్థ కాలుష్యాలతో నిండిపోతున్నది. అదే తిరిగి ప్రతిఫలిస్తున్నది.

ఇటీవల ఒక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులను కొట్టలేక, తిట్టలేక, చదువు, క్రమశిక్షణ నేర్పలేకపోతున్నామని బాధపడుతూ విద్యార్థులనే క్షమాపణ కోరుతూ సాష్టాంగ నమస్కారం చేశాడు. అంటే, విద్యార్థులను దండించే, తిట్టే అధికారం లేకుండా పోయిందని, అది లేకపోతే అధ్యయనం సాగదని బాధపడటంలో ఎంత అవగాహనా రాహిత్యం ఉందో అర్థమవుతుంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇలాంటి అశాస్త్రీయ ఆలోచనలతో విపరీత చర్యలకు పూనుకుంటున్నారు. ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా, స్వేచ్ఛగా పిల్లలు అభ్యసనం కొనసాగించగలిగితేనే నిజమైన మనుషులుగా, మానవీయతతో ఎదుగుతారు. ప్రేమైక సమాజానికి వారసులవుతారు. పోటీలోపడి కొట్టుకుపోతే బ్రతుకునే కోల్పోతారు. తల్లిదండ్రులూ ఆలోచన చేయండి!

సంపాదకీయం

అవాస్తవ వివాదం- ఓట్ల రాజకీయం



తెలకపల్లి రవి

ఛత్రపతి శంభాజీ నగర్ జిల్లాగా పేరు మారిన ఔరంగాబాద్ నుంచి ప్రసిద్ధమైన ఎల్లోరా గుహలకు వెళ్లే దారి మధ్యలో కాస్త సమయం వెచ్చిస్తే కనిపిస్తుంది ఖుల్దాబాద్. పిల్లల బొమ్మల దుకాణాలను దాటుకుని నడిస్తే సూఫీ సాధువు సయ్యద్ జియానుద్దీన్ షేర్జీ దర్గా. ఆ దర్గాలో ఉంటుంది 17వ శతాబ్దంలో భారతీయులను పాలించిన చక్రవర్తి ఔరంగజేబు సమాధి. పెద్ద హంగామా ఏమీ ఉండదు. తండ్రి షాజహాన్ తన అందాల ప్రేమకు జాపకార్థం మనోహరమైన తాజ్‌మహల్ నిర్మించాడు గానీ ఔరంగజేబు తన సమాధి చాలా సాదాసీదాగా ఆకాశానికి తెరచి ఉండేలా కట్టించాలని కోరుకున్నాడట. కాస్త మట్టి తడిపి ఒక మొక్క నాటమన్నాడు. ఆ తర్వాత కాలంలో లార్డ్ కర్జన్ అక్కడ పాలరాయి వేయించి జాలి పెట్టించాడు. ఇప్పుడు అక్కడ బారికేడ్లు పెట్టి పహారా పెంచారు. యాత్రీకులు వచ్చి చూడటం పూలను ఉంచడం జరుగుతూనే ఉంది. శివాజీ కుమారుడైన శంభాజీ రాజా వంశవారసుడుగా చెప్పుకునే బీజేపీ ఎంపీ ఉదయ రాజే భోస్లే ఇప్పుడు ఆ సమాధిని ధ్వంసం చేయాలంటున్నాడు గాని, నిజానికి ఏముందని ధ్వంసం చేస్తారని చార్మీ హరికిషన్ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' లో ప్రశ్నించారు. మోడీ మూడోసారి పాలనలో ఈ దేశ ప్రజలకు నాగపూర్‌లో హింసాకాండ ఆశ్చర్యంగా అనిపించక పోవచ్చు. రకరకాల రాజకీయ నేత లూ వ్యాఖ్యాతలు ఇలాంటివి చర్చ చేయడం బీజేపీకే లాభమని సిద్ధాంతం చెప్పొచ్చు. గాంధీ హత్యపై పాఠం ఇప్పుడేం అవసరమని విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల లోక్‌సభలోనే చెప్పారు. కానీ నాలుగువందల ఏళ్లనాటి ఔరంగజేబుపై మాత్రం ఉద్రేకాలు పెంచుకోవాలి మరి!

నాగపూర్ కేంద్రంగానే!

కర్ఫ్యూ దాకా వెళ్లిన నాగపూర్‌లో మళ్లీ పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఔరంగజేబుకు ఇప్పుడు ప్రాధా న్యత లేదని ఆరెస్సెస్ నాయకులొకరు బెంగళూరులో చేసిన వ్యాఖ్యను మీడియా ప్రముఖంగా ఇచ్చింది.అంటే తగు సమయంలో తీసుకుందామని ఆయన మాటల సంకేతం. ఛావా సినిమా భావోద్వేగాలు రగిలించడంతో ప్రజలు ఔరంగజేబుపై రెచ్చిపోయారని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ శాసనసభలో సూటిగానే చెప్పేశారు. ఫడ్నవీస్ నాగపూర్ పశ్చిమ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీదీ నాగపూర్ లోక్‌సభ నియోజకవర్గమే. ప్రస్తుతం అల్లర్లు చెలరేగిన చోటు ఆరెస్సెస్ జాతీయ కేంద్ర కార్యాలయమైన హెగ్డేవార్ భవన్‌కు దగ్గర్లోనే ఉంటుంది. "శంభాజీ మహారాజ్‌ను ఔరంగజేబును హింసించిన తీరును ఆ చిత్రం చాలా వివరంగా దృశ్యీకరించడం ప్రజాగ్రహాన్ని రగిలించిందని" ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దీని వెనక లోతైన పథకం ఉన్నట్టు కనిపిస్తుంది. 'ప్రజలు శాంతిభద్రతలను తమ చేతుల్లోకి తీసుకోకూడదు' అని ప్రకటించారు. సమతుల్యత లేకుండా ఒక వర్గాన్ని రెచ్చగొట్టడమే ధ్యేయంగా కాశ్మీర్ ఫైల్స్, ది కేరళ స్టోరీ, రజాకార్ వంటి చిత్రాలు పనిగట్టుకుని నెత్తినెత్తుకున్నదెవరు? మొత్తం మంత్రి వర్గం కట్టగట్టుకుని వెళ్లి ఛావా సినిమాను చూసి విపరీతమైన ప్రచారం కల్పించింది. రూ.500 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా ఎంతగా జనాన్ని ఉద్రేక పర చిందంటే గుర్రంపై ఒక వ్యక్తి హరహర మహాదేవ్ అని అరుస్తూ థియేటర్ లోకి దూసుకుపోయిన వీడియో వైరల్‌గా ప్రచారమైంది. ప్రేక్షకులు చాలా థియేటర్లలో రకరకాలైన విధ్వంసక చర్యలకు పాల్పడిన వార్తలు మహా రాష్ట్ర మీడియాలో ప్రసారమయ్యాయి. ప్రతి మరాఠీ వ్యక్తి ఈ కథ తెలుసుకోవాలి గనక తన పదేళ్ల కుమారుడిని ప్రత్యేకంగా తీసుకొచ్చినట్టు ఆ జిల్లాలోని ఒక డ్రైవర్ మీడియా వాళ్లతో చెప్పాడు.

ఈ డ్రైవర్ చెప్పింది బాగానే ఉంది గానీ ఏది గతం? ఏది ప్రస్తుతం? ప్రఖ్యాత చరిత్రకారిణి రోమిలా థాపర్ తాను రాసిన 750 పుటల గ్రంథానికి 'మన ముందున్న గతం'(ద పాస్ట్ బిఫోర్ అజ్) అని పేరుపెట్టారు. ముందున్న అనే పదానికి ఇక్కడ రెండర్థాలు తీసుకోవాలి. గడచిపోయిన అనీ, ఇప్పుడు ముందుకు తెస్తున్న అని. గతాన్ని ఎలా చూస్తాము అందులోంచి ఏది తీసుకుని ఎలా చెబుతామన్నది ప్రస్తుత పాలకవర్గాల ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుంది, ఔరంగజేబు క్రూర పాలకుడే గాక దేవాలయాలకు కూడా నిధులిచ్చినట్టు కూడా చరిత్ర ఆధారాలు చెబుతున్నాయనీ,ఈ చిత్రంలో ఔరంగజేబును పాక్షికంగా చిత్రించారనీ విమర్శించినందుకు సమాజ్ వాది పార్టీ ఎమ్మెల్యే అబూ అజ్మీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఔరంగజేబుకు అనుకూలంగా మాట్లాడే వారెవరినీ సహించేది లేదని ముఖ్యమంత్రి ఇతర మంత్రులు సభలో ప్రకటించారు. అతని సమాధిని తొలగించాలని భోస్లే చేస్తున్న వాదనలోని సెంటిమెంటుతో తామూ ఏకీభవిస్తామని కూడా ఫడ్నవీస్ చెప్పేశారు. కాకపోతే ఆ సమాధి పురావస్తుశాఖ(ఎఎస్ఐ) అధీనంలో ఉంది గనక చట్ట ప్రకారమే వ్యవహరించాల్సి ఉంటుందని సన్నాయి నొక్కులు నొక్కారు.

నష్టపోతున్నదెవరు?

ఈ అల్లర్ల సందర్భంగా పవిత్రమైన చద్దర్ తగలబెట్టిన ఘటనతో తమకేమీ సంబంధం లేదని వీహెచ్‌పీ ఖండిస్తున్నది. కానీ పోలీసులు మాత్రం తమ దగ్గర వీడియో ఫుటేజి ఉందంటున్నారు. స్థానికులు కూడా చద్దర్ దగ్ధం చేయడం చూశామంటున్నారు. కానీ ఖురాన్ సూక్తులు గల చద్దర్ కాల్చేశారనడం నిజం కాదని ముఖ్య మంత్రి ప్రకటించారు. 'ఔరంగజేబు దిష్టిబొమ్మలు తగలబెట్టుకుంటే మాకేమీ అభ్యంతరం లేదు. ఖురాన్ సూక్తులతో కూడిన చద్దర్‌ను టార్గెట్ చేయడమే తప్పు' అని స్థానిక ముస్లిం నాయకులు ఖండిస్తున్నారు. అదే ఆ వర్గాల్లో కూడా ఆగ్రహం పెరగడానికి కారణమైంది. ఖుల్దాబాద్ మొదటి నుంచి అన్ని మతాల వారూ ఎలాంటి తేడాలు లేకుండా కలసి మెలసి జీవిస్తున్నారని, చక్రవర్తి సమాధి సంరక్షణ చూసే నిస్సార్ అహ్మద్ మీడియాకు చెప్పారు. మతకలహాలు రగిలించేందుకు కొందరు దుండగులు ప్రయత్నించడం వల్లనే ఇదంతా జరుగుతున్నది.ఈ అల్లర్లలో ఎప్పుడూ పేదవాళ్లనూ ఉద్యోగాల్లేని యువకులను ముందుకు నెడుతుంటారు. చిచ్చుపెట్టేది ఒకరైతే గాయపడేవారు, నష్టపోయేవారు మాత్రం ఈ కుర్రాళ్లే అని ఆయన ఆవేదన చెందారు. పవిత్ర రంజాన్ మాసంలోనే ఇలా జరగడమే మరీ బాధ కలిగిస్తుందని వాపోయాడు. 'మొఘలుల చరిత్రను పూర్తిగా తుడిచేయాలని ఎవరైనా అనుకుంటే వారు భారతదేశ చరిత్రనే తిరగరాయవలసి వుంటుంది. అది చాలా ప్రమాదకరమైన పని' అని కూడా వ్యాఖ్యానించారు. ఈ సామాన్యుడి మాటలటుంచి గొప్ప చరిత్రకారులను



సంఘ్‌పరివార్ మొదటినుంచి ఔరంగజేబును తమ మత రాజకీయాలకు ఇంధనంగా వాడుకుంటున్నది. ఈ దేశం రాముడిదే గానీ ఔరంగజేబుది కాదని కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వంటివారు ప్రకటించారు. అసలు లౌకిక వాదులందరూ ఔరంగజేబుకే ఔలాద్(సంతతి) అనేది వారికి బాగా అలవాటైన, ఇష్టమైన దూషణ, విద్వేష రాజకీయాలకు ఎప్పుడూ ఒక బొమ్మ కావాలి. ఒక కథనం కావాలి. టిప్పుసుల్తాన్ నుంచి బాబర్, ఔరంగ జేబుల వరకూ ఆగర్భ శత్రువులుగా చిత్రించడం హిందూత్వ రాజకీయాస్త్రం మాత్రమే. దానికి చరిత్రలో కచ్చితమైన ఆధారాలేమీ లేవు. మతవాదులు చెబుతున్నట్టు భారతదేశంలో ముస్లిం లేదా ఇస్లాం చరిత్ర అంతా ఒకటి కాదు. ఆఫన్‌టర్క్, పర్షియా, పాయలుంటాయి. ఇస్లామిక్ చరిత్ర అంటూ ఏకఖండంగా ఉండదు. ఉన్నది కూడా భారతీయ సంప్రదాయ పద్ధతి మేళవించబడి ఉంటుంది.

అడిగినా గతం గురించి నిరాధారమైన ద్వేషంతో ప్రజల మధ్య మతం మంటలు పెట్టడం సరికాదంటారు.

చరిత్రలో ఉన్నదేంటి?

సంఘ్‌పరివార్ మొదటినుంచి ఔరంగజేబును తమ మత రాజకీయాలకు ఇంధనంగా వాడుకుంటున్నది. ఈ దేశం రాముడిదే గానీ ఔరంగజేబుది కాదని కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వంటివారు ప్రకటించారు. అసలు లౌకిక వాదులందరూ ఔరంగజేబుకే ఔలాద్(సంతతి) అనేది వారికి బాగా అలవాటైన, ఇష్టమైన దూషణ, విద్వేష రాజకీయాలకు ఎప్పుడూ ఒక బొమ్మ కావాలి. ఒక కథనం కావాలి. టిప్పుసుల్తాన్ నుంచి బాబర్, ఔరంగ జేబుల వరకూ ఆగర్భ శత్రువులుగా చిత్రించడం హిందూత్వ రాజకీయాస్త్రం మాత్రమే. దానికి చరిత్రలో కచ్చితమైన ఆధారాలేమీ లేవు. మతవాదులు చెబుతున్నట్టు భారతదేశంలో ముస్లిం లేదా ఇస్లాం చరిత్ర అంతా ఒకటి కాదు. ఆఫన్‌టర్క్, పర్షియా, పాయలుంటాయి. ఇస్లామిక్ చరిత్ర అంటూ ఏకఖండంగా ఉండదు. ఉన్నది కూడా భారతీయ సంప్రదాయ పద్ధతి మేళవించబడి ఉంటుంది.

హిందూ పడవ(సంవత్సరాది) తొలిరోజు ఉత్సవం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్చి 30న నాగపూర్ వస్తున్నారు. అక్కడ తొలిసారి ఒక ప్రధాని హెగ్డేవార్, గోల్వార్కర్ స్మృతి మ ందిర్‌ను సందర్శించనున్నాను. ఈ ఘర్షణలు ఆయన రాకకు ఆహ్వానం పలకడానికేనా? అని సందేహం కలుగుతుంది. రానున్న రెండేళ్లలో బీహార్, యూపీ, గుజరాత్‌లతో సహా కీలక రాష్ట్రాల ఎన్నికలు జరగనున్నాయి. ఔరంగజేబు వారసులు ఇప్పుడు రిక్షాలు తొక్కుతూ బతుకుతున్నారని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ లోక్‌సభ ఎన్నికల సమయంలోనే ఎగతాళి చేశారు. ఇక నేరుగా తమ శాసనసభ ఎన్నికలే వచ్చాక ఆయనలాంటి వారు మరెన్ని వివాదాలు ముందుకు తెస్తారో? చాలామంది దీన్ని మరో అయోధ్య వివాదంలా చూస్తున్నారంటే కారణమదే. త్వరలో రాబోయే ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సినిమా 'హరిహర వీరమల్లు' కూడా ఔరంగ్‌జేబ్‌పై కాషాయ తరహా పోరాటమేనట!

పదమూడో శతాబ్దంలో గియాసుద్దీన్ బాల్బన్(1255-65) కాలానికి సంబంధించి ఢిల్లీలో బయటపడిన ఒక హిందూ భక్తుడి శాసనం చూస్తే సుల్తాన్ బాల్బన్ పాలనలో విష్ణుమూర్తి హాయిగా పవళించాడని చెబుతున్నది. హర్యానాలో బయటపడిన నారాయణ రాతి శాసనం మహ్మద్ బిన్ తుగ్లక్‌ను భూమండలం మీద పాలకుల్లో రత్నం లాంటివాడని కీర్తిస్తున్నది. 1369 కాశ్మీర్ శాసనం ఒకటైతే రాజు షహాబుద్దీన్‌ను క్షత్రియ వారసుడుగా పాండవ గృహ నివాసిగా ప్రశంసిస్తున్నది. అసలు రాజులు ఎవరైనా దైవనిర్ణయం ప్రకారమే పాలి స్తారని కూడా ఆనాటి అనేక గ్రంథాలు శాసనాలు చెబుతున్నాయి. రాజులు, రాజ్యాల మధ్య యుద్ధాలు, రాజ్యం అణచివేత ఉన్నట్టే ముస్లింల పాలనలోనూ జరిగింది. కొందరిలో అది ఎక్కువగా ఉండొచ్చు కానీ బ్రిటిష్‌వారు హిందూ యుగం, ముస్లిం యుగం అని విభజించిన తర్వాతనే రెండు మతాల మధ్య విడిగా చూసే ధోరణి పెరిగింది.1808లో మృత్యుంజయ విద్యాలంకార రాసిన రజబలి అక్బర్‌ను పొగుడుతూ- ఔరంగజేబ్ దేవా లయాన్ని నాశనం చేయడంతో పాటు పోషించడమూ జరిగిందని చెబుతుంది. కానీ 1878లో వచ్చిన భోళా నాథ చక్రవర్తి భారతేశ్వర్ ఇతిహాసలో సుదీర్ఘమైన ముస్లిం పాలన వల్లనే హిందూసమాజం పతనమై విలువలు క్షీణించి పోయిందని, ఆ తర్వాత యవనులు(ఇంగ్లీషువారు) రాకతో పతనం మరీ తీవ్రమైందని రాస్తాడు. ఈ క్రమంలోనే వందేళ్ల కిందట ఆరెస్సెస్ పుట్టాక వారి మత రాజకీయాల కోసం ఔరంగజేబును ప్రత్యేకంగా ఎంచుకున్నారు. ఆయన జిజియా పన్ను(జుట్టుపై) వేయడం గురించి చెబుతుంటారు. కానీ అధికారం చేపట్టాక ఇరవై ఏళ్ల తర్వాత ఆయన ఈ పన్ను విధించడం జరగలేదనీ మతద్వేషమే కారణమైతే రెండు దశాబ్దాలు ఎందుకు నిరీక్షిస్తూ ఉండిపోయాడని చరిత్రకారులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని విషయాల్లో ఔరంగజేబు ఇతరుల కంటే మేలని కొందరు చెబుతున్నారు గానీ అదీ అవసరం లేని వాదనే, ఏదైనా గతమే.

ఎన్నికల నాటి పాచికే

నిజానికి బీజేపీ మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలోనే ఔరంగజేబును రంగంలోకి తెచ్చింది. కానీ విజయం సాధించిన తర్వాత దానికి సమస్యలు మరింత తీవ్రంగా ఎదురవుతున్నాయి. మహారాష్ట్రలో ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆత్మహత్యలు, తీవ్ర ఆర్థిక సమస్యల నుంచి దృష్టి మరలించడం కోసం పాలక కూటమి కావాలనే ఈ వందల ఏళ్లనాటి సమాధి వివాదాన్ని ప్రోత్సహించిందని 'హిందూ' పత్రిక సంపాదకీయంలో స్పష్టంగా విమర్శించింది. అసెంబ్లీ ఎన్నికల్లోనే బీజేపీ నేతలు ఔరంగాబాద్‌ను ఎన్నికల సమస్యగా చేసి ఓట్లు పొందారని గుర్తు చేసింది. హిందూ పడవ(సంవత్సరాది) తొలిరోజు ఉత్సవం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్చి 30న నాగపూర్ వస్తున్నారు. అక్కడ తొలిసారి ఒక ప్రధాని హెగ్గేవార్, గోల్వార్కర్ స్మృతి మందిర్‌ను సందర్శించ నున్నాను. ఈ ఘర్షణలు ఆయన రాకకు ఆహ్వానం పలకడానికేనా? అని సందేహం కలుగుతుంది. రానున్న రెండేళ్లలో బీహార్, యూపీ, గుజరాత్‌లతో సహా కీలక రాష్ట్రాల ఎన్నికలు జరగనున్నాయి. ఔరంగజేబు వారసులు ఇప్పుడు రిక్షాలు తొక్కుతూ బతుకుతున్నారని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ లోక్‌సభ ఎన్నికల సమయంలోనే ఎగతాళి చేశారు. ఇక నేరుగా తమ శాసనసభ ఎన్నికలే వచ్చాక ఆయనలాంటి వారు మరెన్ని వివాదాలు ముందుకు తెస్తారో? చాలామంది దీన్ని మరో అయోధ్య వివాదంలా చూస్తున్నారంటే కారణమదే. త్వరలో రాబోయే ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సినిమా 'హరిహర వీరమల్లు' కూడా ఔరంగ్‌జేబ్‌పై కాషాయ తరహా పోరాటమేనట!

భారతదేశం భగత్‌సింగ్‌కి బాకీపడింది...



కాడిగల్ల భాస్కర్
9491118822

భగత్‌సింగ్ భౌతికంగా కన్నుమూసి శతాబ్దం సమీపిస్తున్నా, ఆయన త్యాగం వెదజల్లిన పరిమళాలు ఈ దేశాన్ని తడుముతూనే ఉంటాయి. ఆయన భావాలు వాస్తవరూపం దాల్చితే తప్ప ఈ దేశానికి భవిష్యత్తు లేదు. గాంధీకి ముందు, తర్వాత స్వాతంత్ర్య సమరయోధుల బ్రిటిష్ వ్యతిరేక పోరాట లక్ష్యం స్వతంత్ర సాధనతో పరిసమాప్తి అయ్యింది. బ్రిటిష్ పాలన స్థానంలో భారతీయ ధనవంతుల పాలన పేద శ్రామిక వర్గ ప్రజలను మభ్యపెట్టడానికి, తద్వారా ధనవంతులకు సేవచేయటంలోనే తృప్తి చెందుతుంది కదా! పరాయిపాలన స్థానంలో సొంతపాలన గొప్ప విషయమే కానీ గడిచిన కాలంలో ప్రజల జీవితాలు భంగపడ్డాయి. పరాయివాడి పీడనే కాదు, సొంత దేశ పీడకుల విముక్తి కూడా జరగాలని కోరుకున్నాడు భగత్‌సింగ్. అందుకే ఆయన ఆలోచన మిగతా నాయకులకన్నా భిన్నం. అందుకే ఆయన జయంతులు, వర్ధంతులు ప్రభుత్వాలకు పెద్దగా పట్టవు.

భగత్‌సింగ్ అతిచిన్న వయస్సులో చూపిన దూరదృష్టి, తెగువ, భిన్నమైన ఆలోచన నాటి ప్రధాన స్రవంతి రాజకీయాలను బలంగా ప్రభావితం చేసింది. అయన లేవనెత్తేనాటికి కాంగ్రెస్ డొమినియన్ స్టేటస్ వద్దే ఆగిపోయింది. అయన లేవదీసిన సంపూర్ణ స్వతంత్రం కాంగ్రెసుకు సైతం అనివార్యతలోకి నెట్టింది. స్వతంత్రం ఈ దేశ మౌలిక సమస్యలకు మార్గం కావాలని కోరుకున్న అయన ఆశలు, ఆశయాలు సంపూర్తి కాలేదు. స్వతంత్రం సిద్ధించి ఎనిమిది దశాబ్దాలవుతున్నా అసమానతలు పోకపోగా మరింత పెరుగుతున్న పరిస్థితి ఉంది. దేశ సంపద పిడికెడుమంది చేతిలో కేంద్రీకృతమౌతున్నది. యువతకు ఉపాధి పగటికలగా మిగిలింది. వాళ్ల వాస్తవాలను తెలుసుకోకుండా వ్యసనపరులను చేస్తున్నవి ప్రభుత్వాలు. చిన్నచిన్న దేశాలు క్రీడల్లో దూసుకుపోతుంటే మన పాలకగణం వారిని వేధిస్తున్నది. ప్రజలకోసం పనిచేయటం కన్నా దేశ వనరులను కొద్దీ మందికి కట్టబెట్టే ప్రయివేటు ఏజెన్సీలా మారిపోయాయి ప్రభుత్వాలు. దేశంలో మహిళల భద్రత, గౌరవం అనుక్షణం మంటగలుస్తున్నా పాలకులకు పట్టడం లేదు. శాస్త్ర, సాంకేతికతలను శ్మశానానికి నెట్టి మూఢత్వాన్ని ఊరేగిస్తున్నారు. వ్యవసాయానికి ఉరేసి కార్మికవర్గాన్ని యథేచ్ఛగా దోపిడీ చేసేందుకు చట్టబద్ధం చేస్తున్నారు. మత ఉన్మాదాన్ని పాలకులు పశుపతాస్త్రంగా మలుచుకున్నారు. వారిని విభేదిస్తే దేశాన్నే అవమానపరుస్తున్నారనే స్థాయికి దిగ్గొట్టారు. దేశం కోసం పోరాడినవారు దేశ ద్రోహులయ్యారు, బ్రిటిష్ వారితో చేతులు కలిపినవారు దేశభక్తులయ్యారు. జాతీయజెండాను వ్యతిరేకించినవారు అపర దేశభక్తులై ఎవరు దేశభక్తులో సర్టిఫికెట్లు జారీజేస్తున్నారు.ముందుకు నడపాల్సిన అధికారం వెనక్కి లాగుతున్నది. ఇది ఈ దేశ ముఖచిత్రం. భగత్‌సింగ్ ఆశయాలు నెరవేరకపోగా నీరుగారుతున్నాయి. భగత్‌సింగ్ ఆశయాలు నెరవేర్చకుండా ఈ దేశ భవిష్యత్తులోఎలాంటి మార్పు ఉండదు.



భగత్‌సింగ్ సమూల మార్పువాది. అయన ఆశయాల సాధనకు, దేశాన్ని కొత్త ఆలోచనలోకి నెట్టడానికి తన ప్రాణాన్నే ఆయుధంగా వాడాడు. ఆయన ఆలోచనలో పరిపక్వత కోసం తీవ్రంగా అధ్యయనం చేశాడు. తాను పొందిన చైతన్యాన్ని ఆచరణలో మార్పునకు కృషిచేశాడు. తుపాకులు, బాంబులు విప్లవాన్ని సృష్టించవని, విప్లవం అనే కత్తి, ఆలోచనల అనే పదునుపెట్టే రాయిపై పదును పెట్టబడుతుందని నమ్మాడు. నేటికీ ఆయనను ఒక తీవ్రవాదిగా చూపించే కుత్సిత బుద్ధి దేశ పాలకుల్లో కనపడుతూనే ఉన్నది. అయన ప్రారంభించిన నవజవాన్ భారత్ సభ , హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌కు స్పష్టత అద్దాడు. హెచ్ఎస్ఆర్ఏగా మార్పు చేయడం ఆయన ఆలోచన విధానానికి సూచిక. ఆ విధానాన్ని వివిధ సందర్భాల్లో వ్యక్తం చేశాడు. ఆయనకు పడిన ఉరిశిక్షను తగ్గించడానికి తన తండ్రి చేసిన ప్రయత్నాన్ని తీవ్రంగా నిరసించాడు. సిద్ధాంతాలకన్నా తన జీవితం గొప్పది కాదన్నాడు. బ్రిటిష్ రాజ్యాన్ని కూలగొట్టాలనే సంకల్పం ఉన్నదని, దేశద్రోహ కుట్ర కేసు మోపారు.అది నేరమని భావిస్తే తమను ఉరి తీయటం కన్నా తుపాకీతో కాల్చమని ఉత్తరం రాశాడు. పురోగతి కోసం నిలబడే ఏ వ్యక్తి అయినా పాత విశ్వాసంలోని ప్రతి అంశాన్ని విమర్శించాలి, అవిశ్వాసం పెట్టాలి, సవాలు చేయాలి. ఇదే అయన ఆలోచన విధానం, ఎంతటి విప్లవాత్మకం? "ప్రజలు స్థిరపడిన విషయాల క్రమానికి అలవాటు పడతారు, మార్పు అనే ఆలోచనతో వణికిపోతారు. ఈ బద్ధకమైన స్ఫూర్తిని విప్లవాత్మక స్ఫూర్తితో భర్తీ చేయాలి" అనే భావన ఆయనలో సామాజిక స్థితిగతుల్ని అధ్యయనాన్ని ప్రతిబింబిస్తున్నది. "నా వేడితో బూడిదలోని ప్రతి చిన్న అణువు కూడా చలనంలో ఉన్నట్టు, జైలులో కూడా నేను స్వేచ్ఛగా ఉన్నాను. తత్వశాస్త్రం అనేది మానవ బలహీనత లేదా జ్ఞానం పరిమితి ఫలితం" అన్న అయన మాటలు తనలోని తాత్వికతకు అద్దం పడతాయి. ప్రభుత్వం పట్ల ప్రజల పోరాట పంథా విషయంలో అయన చెప్పిన మాటలకు ఎంత ప్రసంగికత ఉన్నదో! చెవిటివారు వినవలసి వస్తే, శబ్దం చాలా బిగ్గరగా ఉండాలన్నదే ఆ పంథా.

భగత్‌సింగ్ రాజీలేని దేశభక్త కుటుంబం నేపథ్యం కలవాడు. పంజాబ్‌ను బ్రిటీష్‌వారు స్వాధీనం చేసుకున్నాక వచ్చిన కరువు కాటకాలు, ఆంగ్లేయులు పెంచిన నీటితీరువ అనేక రేట్లు పెంచి భారాలు మోపినప్పుడు జరిగిన రైతాంగ పోరాటాలకు భగత్‌సింగ్ బాబాయ్ అజిత్‌సింగ్ నాయకత్వం వహించాడు. తీవ్ర జైలుశిక్ష అనంతరం ప్రవాసజీవితం గడిపాడు. నాన్న కిషన్ సింగ్ రైతాంగ పోరాటాలతో మమేకమైన వ్యక్తే. చిన్నతనంలోనే కార్తర్‌సింగ్ త్యాగాన్ని, ప్రతికూల పరిస్థితుల్లో నమ్మిన ఆశయం కోసం నిలబడిన గదర్ వారసత్వం పుణికిపుచ్చుకున్నాడు. కర్తార్ సింగ్ శరభకు భగత్‌సింగ్‌కి అనేక పోలికలు కనపడతాయి. కర్తర్‌సింగ్ శరభ మొదటి లాహోర్ కుట్ర కేసులో ఉరితీయబడితే, భగత్‌సింగ్ రెండో లాహోర్ కుట్ర కేసులో ఉరితీయబడ్డాడు. కామగటమరు ఘటన తర్వాత లేవదిద్దామనుకున్న రెండో సిపాయిల తిరుగుబాటు కోసం కర్తర్‌సింగ్ శరభ, సచీంద్రనాథ్ సన్యాల్, విష్ణుగణేష్ పింగళే, రస్బిహారీ బోస్ తదితరులతో కష్టకాలంలో సంబంధాలు పెట్టుకుని కృషిచేసినట్టే. కాకోరి ఘటన అనంతరం వెనుకపట్టుపట్టిన విప్లవ కార్యకరమాలను చంద్రశేఖర్ ఆజాద్, భగవతిచరణ్ వోహ్రా, జాతీనదాస్, శివవర్మ, సుఖదేవ్, రాజగురు తదితరులతో ముందుకు నడిపాడు. బాంబులు, యాక్షన్ ప్లాన్ల ఆరాధన నుండి హిందూస్థాన్ రిపబ్లిక్ ఆర్మీని హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోషియన్‌గా మార్పు చేశాడు. సోషలిస్ట్ విప్లవమే సమూలమార్పునకు అవసరం అనే దశకు చేర్చింది తన అధ్యయనం. కమ్యూనిస్టు నాయకులు బకునిన్, దోస్తొవ్స్కీ, మార్క్స్, లెనిన్‌లను అధ్యయనం చేశాడు. అతి పిన్న వయసులోనే గాంధీకున్న ప్రజాధరణను పొందగలిగాడు.

భగత్‌సింగ్‌పై బ్రిటీష్‌వారు మోపిన దేశద్రోహ కేసులు నేటికీ 'ఎలుకలకు' నచ్చని వాళ్లపై మోపుతూనే ఉన్నారు. పొద్దునే లేస్తే పక్కదేశంపై, పక్క మతస్తునిపై, పక్క కులస్తునిపై, పక్క భాషవాసిపై ద్వేషం నింపే పనిలో ప్రజలను నిమగ్నం చేస్తున్నారు. కానీ 'ఇంటివాడు' మోపుతున్న భారాలు, ఎగ్గొడుతున్న రుణాలు, కొల్లగొడుతున్న వనరులు కనిపించకుండా చేయటానికే ఇదంతా అనేది తెలుస్తూనే ఉంది. ఇప్పుడు మతం పేర గతం పేర ఉన్మాదంతో ప్రజల్ని మభ్యపెట్టే పనిలో ఉన్నారు ఏలికలు. అనేక సారూప్యతలు, పరిమితులు ఉండి ఒకేసారి స్వతంత్రం సాధించిన చైనా, ఇండియాలు అనేక రంగాల్లో పరస్పర అభిముఖంగా ప్రయాణం చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

(నేడు భగత్‌సింగ్ వర్ధంతి)

బ్రాండ్ "అంబాసిడర్"





జంధ్యాల రఘుబాబు
9849753298



నీవు అవినీతికి బ్రాండ్ అంబాసిడర్, వచ్చిన కొద్దిరోజులకే తెలిసిపోయింది నీ నిర్వాకం ఇలా సాగుతున్నాయి ప్రతిపక్ష నాయకుడి మాటలు. అసలు మాట తప్పడంలో, కుటుంబ పాలనకు మిమ్మల్ని మించిన బ్రాండ్ అంబాసిడర్లు ఎవరున్నారు? పదేండ్లు అవకాశమిస్తే ఆశ్రిత పక్షపాతంతో మీరెలా ప్రవర్తిస్తారో తెలీనివాళ్లెవరున్నారు? అన్నిరకాల అవకతవకలకు మీరే బ్రాండ్ అంబాసిడర్ ఘాటుగా అధికారపక్షం నుంచి జవాబు. ఈలోపల రెండు పిల్లుల మధ్య కోతిలా న్యాయం చెప్పినట్టు కనిపించే విధంగా మాట్లాడే ఇంకో పార్టీ నాయకుడు సమైక్య పాలనకు, దేశాన్ని ఒకే తాటిమీద నడిపే విషయంలో మేమే మాంచి బ్రాండ్ అంబాసిడర్ అనగానే అవతలనుండి అసలు సమాఖ్య విధానానికే మీరు తూట్లు పొడిచే మీరు సమైక్యంగా ఎలా నడుపుతున్నారో మాకు తెలుసునన్నాడు అధికారంలో ఉన్న నాయకుడు. మళ్ళీ ప్రతిపక్షనాయకుడు ప్రతినెలా ఢిల్లీ పోవడంలో, అధినాయకత్వానికి లొంగిపోయి ఉండడంలో మీరే బ్రాండ్ ... అనేసరికి అధికారంలో ఉన్న నాయకుడికి కోపం మితిమీరి పోయింది. దాన్ని నవ్వుగా మార్చి ఇంక ఊకోవయ్యా, అసలు మీ గుర్తే అంబాసిడర్ అంతకన్న ఏం చెప్పాలి? అందరూ చేతులతో బల్లలపై చప్పట్లు కొట్టారు.

అసలు అంబాసిడర్ అంటే ఏమిటి? ఎవరు? మొదలైన ప్రశ్నలు రావాలి. రాయబారిని అంబాసిడర్ అంటారని ఎక్కువమందికి చెపాల్సిన పనిలేదు. మామూలుగా తమతో మంచిగా ఉన్న లేదా చెడుగా లేని దేశాల్లో రాయబారులను పెడతారు మర్యాదపూర్వకంగా. ఒక్కోసారి ఇష్టంలేకున్నా పెడతారు అది వేరే విషయం. రెండు దేశాల మధ్య తగువేదైనా వచ్చినప్పుడు ఆ రాయబారిని వెనక్కి పంపుతారు. అదో అంతర్జాతీయ రాజకీయం. నీవు పంపేదేమి, మేమే వెనక్కి పిలుచుకుంటాము ఎక్చేంజ్ ఆఫర్ లాగా మీ రాయబారిని కూడా వెనక్కి పంపుతున్నాము అని సందేశం ఇవ్వొచ్చు కూడా. ఆ విధంగా ఈ రాయబారులు రాజకీయ పావుల్లాగా పనికొస్తారని చెప్పే పనే లేదు.

ఫలానా వస్తువు కాని, బట్టలు కాని ఇంకేవైనా కంపెనీ ఉత్పత్తులు కాని తమ వ్యాపారానికి ఒక బ్రాండ్ అంబాసిడర్ అంటే కొనేవారిని, కొనొద్దు అనుకున్న వారిని కూడా ప్రేరేపించి, ప్రభావితం చేసేవారే ఆ బ్రాండుల రాయబారులు. ఇది ఎండాకాలం శీతల పానీయాలు ఒక్కో హీరో ఒక్కోటి తాగుతాడు తెరమీద. తాగడమే కాదు ఓ సాహసం చేశాక తాగుతాడు, ఇదుంటే నాకేమీ పని లేదు అంటాడు. అసలు ఆ పానీయాల్లో పురుగుమందులు ఉన్నాయన్న విషయం చెప్పనే చెప్పడు. ఆరోగ్య పానీయాలూ అంతే మొత్తం డబ్బా పొడిలో గోధుమలు, కోక్ తప్ప ఏమీ ఉండవు అది తాగి తాను సిక్సర్లు, ఫోర్లు కొట్టినట్టు వందల వందల పరుగులు చేయడానికి అదే కారణమనీ చెబుతాడు. నా బలానికి కారణం ఈ ఘోస్ట్ అంటాడు. పక్కనున్న చిన్న పాప లేదా బాబు కూడా వెంటనే మన బలానికి అంటారు. ఆ లెక్కన ఆ కూల్ డ్రింక్సు, హెల్త్ డ్రింక్సు తాగినోళ్లు ఇప్పటికంతా ఏ సూపర్ మ్యానులో, స్పైడర్ మ్యానులో అయిపోవాలి. అలా కాలేదెందుకు? అన్న ప్రశ్న ఎంతమందికి వస్తే అంత మేలు. ఈ బ్రాండ్ అంబాసిడర్ల కథ తేలిపోతుంది.

ఇప్పుడు అమెరికా ప్రపంచానికంతా బ్రాండ్ రాయబారి అని ఒకాయన చెబుతాడు. ఇప్పుడు నాలో ఒక కొత్త అధ్యక్షుణ్ణి చూస్తారు అంటాడు. భారతదేశానికి నేనే ముఖచిత్రమని ఒకాయన, రెండు తెలుగు రాష్ట్రాలకు నేనే ఉమ్మడి ముఖచిత్రమని ఇంకొకాయన చెబుతారు. భజన శాఖామంత్రులుంటారు అన్ని చోట్లా వాళ్ల వెంటనే పొగిడేస్తారు వీళ్లని. మన మొదటి ఎంపిక ఈనాయకుండే అంటాడు. తాను రెండో ఎంపిక అని లోలోపల ఉండే అర్థం. సభల్లో, రాజకీయాల్లో ఇలాంటి వస్తు రాయబారులు అనేకమంది మనకు కనిపిస్తుంటారు. వాళ్ల వ్యాపారం వాళ్లది అని సరిపెట్టుకుంటాం కాని మన వ్యాపారానికి ఎవరు వస్తు రాయబారి అని మంచిపనులు చేసేటోళ్లు కూడా కాస్త ఆలోచిస్తే మంచిదేమో?

పెద్దపెద్ద జీతాలొచ్చే ఉద్యోగులుంటారు. వాళ్లు అన్నీ బ్రాండెడ్ వస్తువులే వాడతారు. వేలు వేలు పెట్టి అంగీలు, ప్యాంట్లు వేసుకుంటారు అలాగే కార్లు, సెల్లు ఫోనులు, టీవీలు, బైకులు, వాచీలు, పెన్నులు ఇంకా ఇంకా అనేకం వస్తు రాయబారులు చెప్పినవే కొంటారు. నిజంగా చెప్పాలంటే ఇలా ఖర్చుపెట్టేటోళ్లు మేనియా అనే ఓ ఉద్రేక మానసిక స్థితిలో ఉంటారు. అలాంటి వస్తువులు కొని ఇల్లంతా నింపేస్తారు. వీళ్ళ ఇంటికొచ్చిపోయినోళ్లంతా వెంటనే తమ ఇళ్లూ నింపేస్తారు. డబ్బు పెట్టలేనోళ్లు ఈ.ఎం.ఐ అనే నెలవారీ కంతులకు అలవాటైపోయి ఉంటారు. ఇలాంటి వాళ్లంతా ప్రపంచీకరణ అనే బ్రాండ్ రాయబారులని మనం అర్థం చేసుకోవాలి.

ఇప్పుడు దేశానికి, ప్రపంచానికి కావలసింది మామూలు ప్రజలకు, పేదోళ్లకు, ఏమీ లేనోళ్లకు సహాయం చేసే అంబాసిడర్లు.వాళ్లు వెంటనే రావలసిన, కావలసిన గడ్డు పరిస్థితిలో ఉన్నాము. భూగోళ వాతావరణం రోజురోజుకూ వేడెక్కిపోతోంది. దాన్ని చల్లగా చేసే కార్యక్ర మాలతో రాయబారులు కావాలి. దేశదేశాల్లో జరుగుతున్న యుద్ధాలకు వ్యతిరేకంగా పోరాడే రాయబారులు కావాలిప్పుడు. యువతకు ఉద్యోగాలు తెచ్చే రాయబారులు కావాలిప్పుడు. ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించడానికి ఎందరో మహానుభావులు చెప్పిన మాటల్ని ప్రచారం చేసి, నిజం చేసే ప్రపంచ రాయబారులు కావాలిప్పుడు. వాళ్లే నిజమైన ప్రపంచ ప్రజల బ్రాండ్ అంబాసిడర్లు.

పలు పద్దులకు శాసనసభ ఆమోదం

- లాభాల బాటలోకి ఆర్టీసీ
- అన్ని పంటలకు మద్దతు ధర
- పద్దులపై మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు
- సోమవారానికి సభ వాయిదా

వైద్యారోగ్యశాఖలో త్వరలో ఖాళీల భర్తీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి పలు పద్దులను శనివారం శాసనసభ ఆమోదించింది. వైద్యారోగ్యశాఖ, రవాణా, కార్మికశాఖ, వ్యవసాయం, సహకారశాఖ తదితర శాఖల పద్దులపై సభలో జరిగిన చర్చకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సమాధానమిచ్చారు. అనంతరం పద్దులను ఆమోదించడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను సోమవారానికి వాయిదా వేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, వైద్యారోగ్యశాఖలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్టు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ లో చికిత్సల ధరలను 22 శాతం పెంచడంతో పాటు 163 రకాల చికిత్సలను దాని పరిధిలోకి తెచ్చినట్టు తెలిపారు. అదనంగా రూ.487.29 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. నెట్ వర్క్ ఆస్పత్రులను పెంచినట్టు వెల్లడించారు. ఇప్పటికే 8 వేల పైగా ఖాళీలను భర్తీ చేయగా, మరో 6 వేల ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు. గతంలో కన్నా నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు కఠినతరంగా మారినా 8 మెడికల్ కాలేజీలకు అనుమతి తెచ్చుకున్నట్టు తెలిపారు. కొత్తగా 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారామెడికల్ కాలేజీలు ప్రారంభించినట్టు తెలిపారు. 27 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,700 కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందన్నారు. డయాలసిస్ రోగులకు శస్త్రచికిత్సల కోసం రూ.33 కోట్లతో 7 వాస్క్యులర్ సెంటర్లు, కొత్తగా 16 డయాలిసిస్ సెంటర్లకు మంజూరుతో పాటు 89 డయాలసిస్ మిషన్లను అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నష్టాల్లోంచి ఆర్టీసీని లాభాల బాటలోకి రాబోతుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పెండింగ్ బకాయిల చెల్లింపులు, కారుణ్య నియామకాలు తెలిపారు. డిపోలను ప్రయివేటీకరిస్తున్నారని చేస్తున్న ఆరోపణలు నిజం కాదనీ, 8 డిపోలను ఇ ఛార్జింగ్ కోసం ఎంపిక చేసినట్టు తెలిపారు. కొత్తగా 2 డిపోలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. బస్సుల సంఖ్యను పెంచుతామని హామీ ఇచ్చారు. రోడ్డు భద్రతా అవగాహనా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించినట్టు తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసం వేసిన కమిటీ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కార్మికశాఖకు సంబంధించిన పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ, కార్మికుల సంక్షేమం కోసం మూడు రకాల సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్మికులకు కనీస వేతనాల కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన రైతుబంధు ఇచ్చినట్టు తెలిపారు. వీటితో పాటు ఉచిత విద్యుత్, సన్నాలకు బోనస్, రైతుబీమా, రైతు రుణమాఫీ అమలు చేస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిలిపేసిన కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్టు వివరించారు. కనీస మద్ధతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి ఎరువుల సరఫరాకు ఇబ్బంది ఉన్నా.. మిగులు ఉన్న జిల్లాల నుంచి అవసరమైన జిల్లాలకు పంపించి రైతులకు ఇబ్బంది లేకుండా సేవలందించినట్టు తెలిపారు. అన్ని పంటలకు మద్ధతు ధరతో కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.

టెన్త్ పరీక్ష పేపర్ లీక్‌పై ఉన్నతాధికారుల సీరియస్

- పరీక్షా కేంద్రం విధుల నుంచి సీఎస్,డీవో తొలగింపు
- ఇన్విజిలేటర్ సస్పెన్షన్.. విద్యార్థిని డిబార్



నవతెలంగాణ-నకిరేకల్

నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగిన పదోతరగతి తెలుగు పరీక్ష పత్రం లీకేజీ వ్యవహారంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఈ లీకేజీకి సంబంధించి నకిరేకల్ మండల విద్యాధికారి ఎం.నాగయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.ఈ దర్యాప్తులో భాగంగా శని వారం పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రామ్మోహన్‌రెడ్డిని పరీక్షా కేంద్రం విధుల నుంచి తొలగించారు. ఇన్విజిలేటర్ సుధారాణిని సస్పెండ్ చేశారు. పరీక్షా కేంద్రం నుంచి ప్రశ్నాపత్రం లీకేజీకి సహకరించిన విద్యార్థినిని డిబార్ చేశారు. లీకేజీ వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారన్న విషయంపై దర్యాప్తు కొనసాగుతోంది. దీనికి సంబంధించి సుమారు 12 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం.

అసలేం జరిగిందంటే..

పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 8వ నెంబర్ పరీక్ష గది వద్ద ప్రహరీ గోడ దూకి ఓ వ్యక్తి కిటికీ వద్దకు వచ్చాడు. పరీక్ష రాస్తున్న విద్యార్థిని వద్ద పరీక్ష పత్రం మూడు పేజీలను సెల్ ఫోన్‌లో ఫొటో తీసి శాలిగౌరారం మండల సామాజిక మాధ్యమాలలో విడుదల చేశారు. ప్రశ్నలకు జవాబు చీటీ కాపీలను సిద్ధం చేసి లోపలికి పంపించేందుకు ప్రయత్నం చేయగా.. కొందరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో లీకేజీ వ్యవహారం బయటపడినట్టు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు మొదటగా శాలిగౌరారంలోనే ప్రశ్నాపత్రం లీకేజీ అయిందన్న తరహాలో దర్యాప్తు చేపట్టారు. కానీ అక్కడ ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఏమీ లేదని చెప్పారు. కానీ, నకిరేకల్ పట్టణంలోని గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్నాపత్రం లీకేజ్ అయిందన్న విషయాన్ని గుర్తించి రహస్యం గా దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో సీఎస్, డీఓలను పరీక్ష విధుల నుంచి తొలగించగా, ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారు. విద్యార్థినిని డిబార్ చేశారు. ఇంకా బాధ్యులైన వారిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేలకొరిగిన భారీ హోర్డింగ్

- కరెంటు స్తంభాలు ధ్వంసం
- సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి సమీపంలో ఘటన



నవతెలంగాణ - బంజారా హిల్స్

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి సమీపంలో భారీ హోర్డింగ్ కూలి నెలకొరగడంతో కరెంటు స్తంభాలు ధ్వంసమయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారిపై ఐరన్ రాడ్లతో ఏర్పాటు చేసిన సుమారు 200 అడుగుల ఎత్తుగల భారీ హోర్డింగ్ నెలకొరిగింది. దాంతో రెండు కరెంటు స్తంభాలు ధ్వంసం కాగా వైర్‌లు తెగి నెలపై పడ్డాయి. సీఎం నివాసానికి కూతవేటు దూరంలోనే జరిగిన ఈ ఘటనలో ఎవరికేమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎన్డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది అక్కడకు చేరుకుని వాటిని తొలగించారు.

డ్రయినేజీలో నవజాత శిశువు మృతదేహం

- మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-మియాపూర్

డ్రయినేజీలో నవజాత శిశువు మృతదేహం కొట్టుకొచ్చింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగుజూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ ఏరియాలోని మెడికవర్ ఉమెన్స్ అండ్ చైల్డ్ హాస్పిటల్ పక్కన గల బస్టాప్ ఎదుట ఉన్న డ్రయినేజీ వద్ద నవజాత శిశువు మృతదేహం కనిపించింది. ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది ఒకరు నమాజ్ కోసం వెళ్తుండగా గుర్తించి, తన ఆస్పత్రి డ్యూటీ డాక్టర్‌కు విషయం చెప్పాడు. డ్యూటీ డాక్టర్ ఘటనా స్థలానికి వెళ్లి ఆ మగ శిశువును పరిశీలించి, అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. వెంటనే మాదాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వర్షానికి డ్రైనేజీ నీటిలో శిశువు కొట్టుకొచ్చి ఆస్పత్రి బస్టాప్ ఎదుట చెత్తలో తట్టి ఆగినట్టు భావిస్తున్నారు. శిశువు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మొబిలిటీ వ్యాలీ ద్వారా వేల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ

- నాలుగు లక్షల మందికి ఉపాధి అవకాశాలు : మంత్రి శ్రీధర్‌బాబు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

వికారాబాద్ జిల్లాలోని ఎంకతల వద్ద మొబిలిటి వ్యాలీను ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం సంకల్పించిందనీ, దాని ద్వారా రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి నాలుగు లక్షల మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని శాసనసభా వ్యవహారాలు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. శనివారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు అనే అంశంపై కాంగ్రెస్ సభ్యులు తోట లక్ష్మీకాంతారావు, కసిరెడ్డి నారాయణరెడ్డి, రామచంద్రనాయక్, బీఆర్ఎస్ సభ్యులు సబితా ఇంద్రారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలిచ్చారు. టీ-ఐడీఈఏ పథకం కింద జనరల్ కేటగిరీ కోసం పెట్టుబడి మొత్తంపై 15 శాతం చొప్పున 20 లక్షలకు పరిమితం చేశామనీ, అయితే, మహిళా పారిశ్రామికవేత్తలు యజమానులైన సంస్థల కోసం అదనంగా 10 శాతం వరకు పెంచి రూ.30 లక్షలను సమకూర్చుతున్నామని చెప్పారు. వారికి స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీపై వంద శాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నామని తెలిపారు. పారిశ్రామిక ఎస్టేట్‌లు, పార్కులలో భూమి ధరలో 25 శాతం రాయితీని(రూ.10 లక్షల వరకు పరిమితం) ఇస్తున్నామని వివరించారు. పారిశ్రామిక వినియోగం కోసం భూమి మార్పిడి చార్జీలను 25 శాతానికి(రూ.10 లక్షలకు) పరిమితం చేశామని తెలిపారు. కోటిరూపాయల గరిష్ట పరిమితితో ఐఐడీఎఫ్ నుంచి మౌలిక సదుపాయాల వ్యయంతో 50 శాతంతోడ్పాటు ద్వారా పరిశ్రమల కోసం రోడ్లు, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని వివరించారు. టీజీ ఐపాస్ పోర్టల్‌లో లభ్యంగా ఉండే డాటా ప్రకారం తెలంగాణలో ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం 1,02,301 మందికి ఉపాధి కల్పనతో రూ.11137.70 కోట్ల పెట్టుబడితో 5626 యూనిట్ల అనుమతులు పొందాయని తెలిపారు. ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలనే రామచంద్రనాయక్ సూచనను పరిశీలిస్తామని హామీనిచ్చారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుదాం

- డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్
- భగత్‌సింగ్ స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు
- ఇబ్రహీంపట్నంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

యువత, విద్యార్థులు రక్తదానం చేసి అభాగ్యుల ప్రాణం కాపాడాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. భారత స్వాతంత్ర్య సమరయోధులు షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతిని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ఉరితాడును ముద్దాడిన యువకిశోరాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని తెలిపారు. కూడు, గుడ్డ, నీడ, విద్య, వైద్యం అందరికీ అందాలని పోరాటం చేశారన్నారు. వారి స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ పోరాడుతున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. విద్యారంగాన్ని కాషాయీకరించాలనే కుట్రలో భాగంగానే నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ.. ఉన్న ఉద్యోగాలను కూడా తీసుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో డ్రగ్స్, గంజాయి యువతను పట్టి పీడిస్తున్నాయని, వాటిని నిర్మూలించేందుకు అందరం కలిసికట్టుగా పోరాడాలని సూచించారు. బెట్టింగ్ యాప్స్ వల్ల అనేక మంది యువకులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, బెట్టింగ్ యాప్స్‌ను ప్రభుత్వం బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు పి.జగన్, బి.శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఆలంపల్లి జంగయ్య, మస్కు చరణ్, చెన్నమోని రాఘవేందర్, నాయకులు బోడా వంశీ మద్దెల, శ్రీకాంత్, విష్ణువకుమార్, వినయ్, గణేష్, యాదగిరి, భగత్ పాల్గొన్నారు.



షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలి

- కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల నేతల డిమాండ్
- ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా

నవతెలంగాణ - ముషీరాబాద్

రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలని, గత సంవత్సరం డిసెంబర్‌లో విడుదల చేసిన జీవో నెంబర్ 21, 22, 23, 24, 25ను గెజిట్ చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆల్ ట్రేడ్ యూనియన్ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కనీస వేతనాల చట్టం ప్రకారం ఐదేండ్లకొకసారి పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. కానీ 2006-2012 మధ్య కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో మాత్రమే జీఓలకు సవరణలు చేశారని, మళ్లీ ఇప్పటిదాకా షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించలేదని తెలిపారు. 2021 జూన్‌లో ఐదో షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌కు ఫైనల్ జీవోలు జారీ చేశారని, వాటిని వెంటనే గెజిట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు సలహామండలిలో అనేక సార్లు చర్చలు జరిపి అన్ని రకాల ప్రక్రియలు, లాంఛనాలు పూర్తి చేసుకొని కమిషనర్ కార్యాలయంలో 56వ షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తుది ప్రతిపాదనలను వెంటనే తెప్పించుకొని ఫైనల్ జీవోలను ఇచ్చి వాటికి కూడా గెజిట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రయివేటు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రంగాలలో కనీస వేతనం అన్ స్కిల్డ్ వర్కర్‌కు రూ.18,019, హైల్త్ స్కిల్డ్ వర్కర్‌కు రూ.39,837గా నిర్ణయించారని చెప్పారు. ప్రభుత్వం ఇంకా కాలయాపన చేస్తే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, జె.మల్లికార్జున్, ఎస్వీ, రమ, వి.ఎస్. రావు, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, పుప్పాల శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు జె.వెంకటేష్, కిషన్, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఎండీ యూసఫ్, రాష్ట్ర నాయకులు కిషన్, ఏసురత్నం, ఐఎఫ్‌టీయూ శివబాబు, నరేందర్, బీఆర్ఎస్ కేవీ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకులు అంజదాస్, రెబ్బరామారావు, టీయూసీఐ ఎస్ఎల్ పద్మ, కె. సూర్యం, ఐఎఫ్‌టీయూ నేతలు అనురాధ, ఎం.శ్రీనివాస్, బీఆర్‌డీయూ శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ ఏబీఆర్ మోహన్‌రావు, ఎంకె. బోస్, కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మెన్ కె.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సింగిల్‌గానే మళ్లీ అధికారంలోకొస్తుంది



- మాజీ సీఎం కేసీఆర్
- రామగుండం బీఆర్ఎస్ నాయకులతో సమావేశం

నవతెలంగాణ-మర్కుక్

రానున్న రోజుల్లో బీఆర్ఎస్ సింగిల్‌గానే మళ్లీ అధికారంలోకి వస్తుందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధి ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో పెద్దపల్లి జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెల్లం ఉన్న దగ్గర ఈగలు వస్తాయని, బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణలో ఇబ్బందులు లేవని అన్నారు. సిరిసంపదలు ఉన్న తెలంగాణాను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రం ఇప్పుడు సమస్యల వలయంలో చిక్కుకుందని చెప్పారు. ఆనాడు మోడీ తన మెడపై కత్తి పెట్టినా తెలంగాణ కోసం ఎక్కడా వెనుకడుగు వేయలేదని తెలిపారు. రామగుండంలో గెలిచిన ఎమ్మెల్యే ఓ సన్నాసి అని, ఏపీలో కూటమి లేకుంటే చంద్రబాబు గెలిచేవారు కాదని అన్నారు. ఆనాడు బలవంతంగా తెలంగాణను ఆంధ్రాలో కలిపారన్నారు. నేలపై ఎవరూ శాశ్వతం కాదని, అందరూ ఒక్కో కేసీఆర్‌లా తయారు కావాలని సూచించారు. తెలంగాణ హక్కుల కోసం పోరాడాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నోటికి వచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఒక్క హామీ కూడా నెరవేర్చడం లేదని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టకున్నా రైతుబంధు, కల్యాణ లక్ష్మీ ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొరుకంటి చందర్, సీనియర్ నాయకులు దాసరి ఉష, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మదాసు శ్రీనివాస్, మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి, మర్కుక్ మాజీ ఎంపీపీ తడ పాండు గౌడ్, జెడ్పీటీసీ యెంబరి రామచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి, జగదేవపూర్ పీఏసీఎస్ జగదేవపూర్ వైస్ చైర్మెన్ కమ్మరి బాలరాజు, బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ తదితరులున్నారు.

హరీశ్‌రావు వర్సెస్ మంత్రి తుమ్మల

- రైతు రుణమాఫీపై అసెంబ్లీలో మాటకు మాట
- వందశాతం రుణమాఫీ చేశామన్న మంత్రి
- మాట తప్పిన సర్కార్ ...హరీశ్
- బీఆర్ఎస్ వాకౌట్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు రుణమాఫీపై శాసనసభలో శనివారం కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. కాంగ్రెస్ సభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, గల్ఫ్ ప్రాంతాలకు ఉపాధికి వెళ్లిన వారి పేరు మీద పాస్ బుక్ ఉండటం, రుణం కుటుంబంలో ఇతరుల పేరు మీద ఉండటంతో రుణమాఫీ కావడం లేదని తెలిపారు. ఇలాంటి వారు ఎక్కువగా ఉత్తర తెలంగాణలో ఉన్నారని చెప్పారు. వీరికి రుణమాఫీ ఫలితం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యులు హరీశ్ రావు మాట్లాడుతూ, తాము మొదట్నుంచి వందశాతం రుణమాఫీ కాలేదని చెబుతున్నదే కాంగ్రెస్ సభ్యులు ఆది శ్రీనివాస్ కూడా చెప్పారన్నారు. దీనిపై ఆది శ్రీనివాస్ అభ్యంతరం తెలిపారు. తన మాటలను హరీశ్ రావు వక్రీకరించారని తెలిపారు. వంద శాతం రుణమాఫీ జరిగిందనీ, సాంకేతిక సమస్యలున్న చోట ఎదురైన ఇబ్బందులను తొలగించాలని తాను కోరినట్టు తెలిపారు. హరీశ్ రావు మాట్లాడుతూ తాను ప్రాతినిథ్యం వహిస్తున్న సిద్ధిపేట నియోజకవర్గంలో 11 వేల మందికి రుణమాఫీ జరగలేదనీ, ఆది శ్రీనివాస్ ప్రాతినిథ్యం వహిస్తున్న వేములవాడలో కూడా అందరికి కాలేదనీ, కావాలంటే జాబితా తెప్పించి ఇస్తానని సవాల్ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, రూ.2 లక్షలలోపు రుణమున్న వారందరికి రుణమాఫీ చేస్తామని మాటిచ్చామనీ, ఆ హామీ మేరకు అందరికి రుణమాఫీ చేసినట్టు స్పష్టం చేశారు. దీనిపై హరీశ్ రావు మాట్లాడుతూ, రూ.2 లక్షల కన్నా ఎక్కువగా రుణముంటే, ఆ ఎక్కువగా ఉన్న రుణం తీర్చుకున్న రైతులకు మిగిలిన రూ.2 లక్షలను ప్రభుత్వం మాఫీ చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట తప్పారనీ, రూ.2 లక్షలలోపు రుణమున్న వారిలో కూడా అందరికి రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ సర్కార్ మాట తప్పినందుకు నిరసనగా వాకౌట్ చేశారు.

డ్రైవర్లు, గన్‌మెన్లకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి

- అసెంబ్లీలో బీజేపీ సభ్యులు వెంకట రమణారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల డ్రైవర్లు, గన్‌మెన్లకు విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలని బీజేపీ సభ్యులు కాటేపల్లి వెంకట రమణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, గన్‌మెన్లు భోజనం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్లపైనే భోజనం చేస్తున్నారని చెప్పారు. ఇంకోవైపు ఎండలో ఉంటున్నారనీ, వానాకాలంలో తడుస్తున్నారని అన్నారు. వారికి విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలనీ, భోజనం చేసేందుకు ప్రత్యేక గది ఉండేలా చూడాలని కోరారు. రోడ్లపై ఉంటూ భోజనం చేస్తున్న ఫొటోలను ఆయన స్పీకర్‌కు పంపించారు.

పరిశీలిస్తాం : మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాప్రతినిధుల డ్రైవర్లు, గన్‌మెన్లకు విశ్రాంతి గదులను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు సమాధానమిచ్చారు.

వేములవాడ, సిరిసిల్లలో .. 26న బీసీ కమిషన్ పర్యటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేములవాడ, సిరిసిల్లలో 26న బీసీ కమిషన్ పర్యటించింది. తమ కులాల పేర్లను మార్చాలని వచ్చిన వివిధ అభ్యర్థనలు బీసీ కమిషన్ పరిశీలనలో ఉన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆయా కులాల సామాజిక జీవన స్థితిగతులను అధ్యయనం చేయడానికీ, వారి నివాస ప్రాంతాలను బీసీ కమిషన్ చైర్మెన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి సందర్శించనున్నారు. ఇందులో భాగంగా వేములవాడ, సిరిసిల్లలో పర్యటించి వంశరాజ్, దొమ్మర కులస్థుల నివాస ప్రాంతాలను కమిషన్ సందర్శించి అధ్యయనం చేయనుంది. అదేవిధంగా 27న జగిత్యాల, ధర్మపురిలలో పర్యటించి వంశరాజ్, దొమ్మర, వీరభద్రీయ కులాల వారిని కమిషన్ అధ్యయనం చేయనుంది.



రాష్ట్ర వ్యాప్తంగా దావత్ ఏ ఇఫ్తార్

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా దావత్ ఏ ఇఫ్తార్‌ను ఘనంగా నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం అసెంబ్లీలో ఇఫ్తార్ విందు, రంజాన్ పండుగ ఏర్పాట్లను ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి సమీక్షించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా నిర్వహించే ఈ కార్యక్రమాలకు ఎలాంటి నిధుల కొరతా లేదని తెలిపారు. ఆహారంలో నాణ్యత, ప్రోటోకాల్, సౌకర్యాల కల్పనలో అధికారులు ఎలాంటి రాజీ పడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇఫ్తార్ ఏర్పాట్లలో అధికారులు ఏమాత్రం అశ్రద్ధ వహించరాదన్నారు. చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా చూడాలని సూచించారు. లా అండ్ ఆర్డర్, విద్యుత్, మంచినీరు వంటి వాటికి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని కోరారు. ఏర్పాట్లలో ఎలాంటి అనుమానాలు, ఇబ్బందులు ఎదురైనా అధికారులు మొహమాట పడకుండా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లేదా తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఏర్పాట్లకు సంబంధించి ప్రభుత్వ సలహాదారు, ఏర్పాట్ల కమిటీ వైస్ చైర్మెన్ షబ్బీర్ అలీ రోజువారీ సమీక్ష చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. దావత్ ఏ ఇఫ్తార్‌కు కూడా ఘనంగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ మా ప్రభుత్వం దావత్ ఏ ఇఫ్తార్‌ను ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు. ఇందులో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ ప్రమాద సహాయక చర్యలకు రూ. 5 కోట్లు విడుదల

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాద సహాయక చర్యల కోసం రూ. 5 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు శనివారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్‌కుమార్ జీవో నెంబరు 11ను విడుదల చేశారు. ఈమేరకు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌కు నిధులను విత్‌డ్రా చేసి ఖర్చుపెట్టే అధికారాన్ని కల్పించారు.

స్టేట్ కమిటీ డిసైడ్ చేస్తే ఆ అధ్యక్షుడు రబ్బర్‌స్టాంప్

- ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఫ్రీహ్యాండ్ ఇస్తేనే బీజేపీ విస్తరణ
- గత అధ్యక్షుల గ్రూపులతోనే పార్టీకి తీవ్ర నష్టం : మీడియాతో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

త్వరలో బీజేపీ తెలంగాణ శాఖకు కొత్త అధ్యక్షుడు రాబోతున్నాడు..అతన్ని స్టేట్ కమిటీ నియమిస్తుందా? కేంద్ర కమిటీ ఫైనల్ చేస్తుందా? జాతీయ నాయకత్వం చేస్తే పార్టీ విస్తరణకు మంచి అవకాశముంటుంది. ఒకవేళ రాష్ట్ర నాయకత్వమే నియమిస్తే ఆ అధ్యక్షుడు రబ్బర్ స్టాంపుగానే ఉంటాడని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సొంతపార్టీపై మరోమారు ఎదురుదాడికి దిగారు. శనివారం మీడియాకు ఆయన సందేశాన్ని పంపారు. తాను చెప్పేది నచ్చినా..నచ్చకపోయినా పర్వాలేదన్నారు. సీనియర్ నేతలు, కార్యకర్తల మనస్సుల్లోని మాటలను బయట పెడుతున్నానని తెలిపారు. అనవసరంగా మీడియాకు మెసేజ్‌లు, వీడియో సందేశాలు పెట్టకుండా పార్టీ నాయకులకు చెప్పాలని కొందరు సూచిస్తున్నారని విమర్శించారు. అయితే, పార్టీ పెద్దల దృష్టికి ఎప్పుడో తీసుకెళ్లాననీ, వారు వినకపోవడం వల్లనే ప్రజల ముందు పెడుతున్నానని స్పష్టం చేశారు. గతంలో అధ్యక్షులుగా ఉన్నవారు ఎవరికివారుగా తమ గ్రూపులను ఏర్పాటు చేసుకుని పార్టీకి తీవ్ర నష్టం చేశారని ఘాటుగా విమర్శించారు. సీనియర్ బీజేపీ నేతలు, కార్యకర్తల కోసం జైలుకెళ్లిన వారిని కూడా పక్కన పెట్టేశారని వాపోయారు. కొత్త అధ్యక్షులు కూడా అలాగే గ్రూపిజం చేస్తే పార్టీ పరిస్థితి పాతముచ్చటలాగే ఉంటుందని స్పష్టం చేశారు. కొందరు సీనియర్ నేతలు బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీల చేతులు కట్టేయడం వల్లనే పార్టీకి ఈ దుస్థితి వచ్చిందని లోపాలను ఎత్తిచూపారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఫ్రీ హ్యాండ్ ఇస్తే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణకు కొత్తగా అధ్యక్ష లయ్యేవారు పాతవారి మాదిరిగా సీఎంలతో రహస్య సమావేశాలు పెట్టకూడదని హితవు పలికారు. బీజేపీ అంటేనే హిందుత్వ పార్టీ అనీ, ధర్మం గురించి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలని నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. సీనియర్ నేతలు, కార్యకర్తలను తొక్కే ధోరణిని మానుకోవాలని హితవు పలికారు.

ఎప్‌సెట్‌కు 1.75 లక్షల దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు 1,75,991 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కో కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 1,27,758 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 48,115 మంది రెండింటికీ 118 మంది కలిపి మొత్తం 1,75,991 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వచ్చేనెల నాలుగో తేదీ వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశముందని తెలిపారు. ఆలస్య రుసుంతో అదేనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వ్యాపారులను నమ్మించి బంగారం, డాలర్లతో పరార్

- దుండగుడి కోసం పోలీసుల గాలింపు
- గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-మియాపూర్

ఇద్దరు వ్యాపారులను తన మాయమాటలతో నమ్మించి వారి నుంచి బంగారం, డాలర్లు తీసుకుని ఓ దుండగుడు పరారయ్యాడు. అర కిలో బంగారం, 18 వేల అమెరికన్ (యూఎస్) డాలర్లు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులిద్దరూ పోలీసులను ఆశ్రయించారు. ఘటనపై కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నార్సింగి ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ ఆన్‌లైన్‌లో గోల్డ్ బిజినెస్ వ్యాపారం చేస్తుంటారు. నల్లగండ్లకు చెందిన రఫీ మనీ ఎక్స్ఛేంజ్ వ్యాపారం చేస్తుంటారు. వారిద్దరికీ స్టీఫెన్ అనే పేరుతో ఓ వ్యక్తి శుక్రవారం ఫోన్ చేశాడు. బంగారం, అమెరికన్ డాలర్లు కొంటానని చెప్పాడు. గచ్చిబౌలి సెంట్రో మాల్‌లో కలుద్దామని వారిని అక్కడికి రప్పించి మాల్ లోపల ఓ రూమ్‌కి తీసుకెళ్లాడు. అనంతరం వారి నుంచి గోల్డ్ బిస్కెట్లు, డాలర్లు తీసుకున్నాడు. వారిద్దరినీ అక్కడే ఉండమని, తాను వెళ్లి ఒక్క నిమిషంలో నగదు తెస్తానని చెప్పాడు. స్టీఫెన్ మాటలు నమ్మిన బాధితులిద్దరూ అక్కడే కూర్చుండిపోయారు. కానీ, అతను ఎంతకీ రాకపోవడంతో మాల్ మొత్తం వెతికారు. అయినా స్టీఫెన్ జాడ తెలియకపోవడంతో మోసపోయామని గుర్తించిన చంద్రశేఖర్, రఫీ గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి స్టీఫెన్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే, బాధిత వ్యాపారుల దగ్గర డాలర్లు ఎక్కడివనే దానిపై కూడా దర్యాప్తు వేగవంతం చేశారు.

వడగండ్లు.. ఈదురుగాలులు

రెండ్రోజులుగా అకాల వర్షాలకు నేలకొరిగిన పంటలు

- ఎగిరిపడ్డ ఇండ్ల పైకప్పులు
- పలు జిల్లాల్లో పంట నష్టం
- మరో రెండ్రోజులు అప్రమత్తంగా ఉండాలి: అధికారులు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి/విలేకరులు

రెండ్రోజుల కిందటి వరకు భూగర్భం నుంచి చుక్క నీరు రాక పంటలు ఎండి తీవ్ర నష్టం వాటిల్లితే.. రెండ్రోజులుగా పలు జిల్లాల్లో అకాల వర్షం, వడగండ్లు, ఈదురుగాలుల వల్ల ఉన్న పంటలు దెబ్బతింటున్నాయి. శుక్ర, శనివారం సాయంత్రం వడగండ్ల వర్షం పడింది. ఈదురుగాలులకు వరి, మామిడి, పూల తదితర పంటలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు కుప్పకూలాయి. శుక్రవారం నాటి వడగండ్ల నష్టాలను కొన్ని చోట్ల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అకాల వర్షాలు పడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న జిల్లాలో శని, ఆదివారాల్లో వడగండ్ల వాన కురవడంతో అన్నదాతలు అవస్థలు పడ్డారు. ఈదురుగాలులు, ఉరుములు,



మెరుపులతో కూడిన రాళ్ల వర్షం వల్ల పంటలు నేలకొరిగాయి. మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట, జన్నారం మండలాల్లో వర్ష ప్రభావం తీవ్రంగా ఉండగా మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి. కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, బెజ్జూర్, కౌటాల మండలాల్లోనూ వడగండ్ల వర్షం కడగండ్లను మిగిల్చింది. కాగజ్‌నగర్‌లో ఈదురుగాలులు, వడగండ్ల వర్షం బీభత్సం సృష్టించింది. గాలుల ధాటికి నౌగాంబస్తీలో షెడ్డుకూలి వృద్ధుడు దౌలత్(70) మృతిచెందాడు. పలు ఇండ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. మొక్కజొన్న, మిర్చి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శనివారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. రాళ్లు కూడా పడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరో రెండ్రోజులపాటు వడగండ్ల వానలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉమ్మడి రంగారెడ్డిలోని షాబాద్, నవాబుపేట మండలాల్లో వడగండ్ల వర్షం కురిసింది. ఆయా మండలాల్లో వరి, పూలు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. లింగారెడ్డిగూడలో ఓ ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. వికారాబాద్ జిల్లాలోని కుల్కచర్ల, నవాబుపేటలో శనివారం సాయంత్రం ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. నవాబుపేట్ మండల కేంద్రంలో రోడ్డుపై చెట్టు విరిగి పడడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. కడిచర్ల, మాదారం, మీనపల్లి కాలన్ గ్రామాల్లో వడగండ్లకు ఉల్లి, మామిడి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి

ఉమ్మడి మెదక్ జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షాలకు వరి, మొక్కజొన్న తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సిద్దిపేట జిల్లా రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి తీవ్ర పంట నష్టం కలిగింది. దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా సుమారుగా 125 ఎకరాల మొక్కజొన్న, 10 ఎకరాల వరి, 5 ఎకరాల పొద్దు తిరుగుడు పంటలు నేలకొరిగాయి. రాయపోల్ మండల వ్యాప్తంగా 35 ఎకరాల మొక్కజొన్న పంట, 2 ఎకరాల పొద్దుతిరుగుడు, మరికొంత వరి పంట నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని ఝరాసంగం, జహీరాబాద్, న్యాల్‌కల్, మునిపల్లి మండలాల్లో శనివారం సాయంత్రం వడగండ్ల వర్షం కురిసి మొక్కజొన్న, శనగ, ఉల్లిగడ్డ వరి పంటలు దెబ్బతిన్నాయి. గాలులకు జహీరాబాద్‌లో విద్యుత్ స్తంభాలు, వృక్షాలు నేలకొరిగాయి. సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో మొదలైన వాన గంటపాటు కురిసింది. భారీ వర్షానికి జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. మునిపల్లి మండలంలోని బుదేరా, మేళాసంఘం గ్రామాల్లో వడగండ్ల వాన దంచికొట్టింది.

జగిత్యాల, సిరిసిల్లలో భారీ నష్టం..

జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి, పెగడపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి, ధర్మపురి మండలాల్లో భారీ వర్షం కురిసింది. కోరుట్ల నియోజకవర్గం పరిధిలోని మల్లాపూర్, కోరుట్ల, ఇబ్రహీంటపట్నం, మేట్‌పల్లి మండలాల్లో ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. పెద్దపల్లి జిల్లాలోని జూలపల్లి మండలంలో రాళ్ల వర్షం కురవడంతో మొక్కజొన్న పంట నేలమట్టమయ్యాయి. మంథని, గోదావరి ఖని పట్టణాల్లో భారీ వర్షానికి కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎలిగేడు మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన అకాల వర్షంతో 209 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేల పాలైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో చందుర్తి, వీర్లపల్లి మండలాల పరిధిలో 125ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చందుర్తి మండలం లోని జోగాపూర్, రామరావుపల్లి, సనుగుల, కిష్టంపేట గ్రామాల్లో వరి పంట తీవ్రంగా దెబ్బతింది. వడగండ్లకు సుమారు 90ఎకరాల్లో వడ్లు నేలరాలినట్టు అధికారులు సర్వే చేసి అంచనా వేశారు. వీర్నపల్లి మండలం శాంతినగర్‌లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి జయ పరిశీలించి 35 ఎకరాల్లో వరి ధాన్యం నేల రాలిందన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 5,520.60 కోట్లు

- బీఆర్ఎస్ సర్కారు పెండింగ్‌లో పెట్టిపోయిందే రూ.4,351 కోట్లు
- దశలవారీగా చెల్లించుకుంటూ పోతున్నాం :సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5,520.60 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయనీ, అందులో బీఆర్ఎస్ సర్కారు పెండింగ్‌లో పెట్టిపోయిందే రూ.4,351 కోట్లు ఉన్నాయని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) వివరించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగొద్దనే నిర్ణయంతోనే కాలేజీల యాజమాన్యాలతో డిప్యూటీ సీఎం మాట్లాడారనీ, బకాయిలను దశలవారీగా చెల్లించుకుంటూ పోతున్నామని తెలిపారు. శనివారం శాసనసభలో ఫీజురీయింబర్స్‌మెంట్‌పై సీపీఐపక్ష నేత కూనంనేని సాంబశివరావు, బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, హరీశ్‌రావు, బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలిచ్చారు. పల్లారాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్నాయనీ, వాటిని దఫదఫాలుగా గ్రీన్‌ఛానల్‌ద్వారా క్లియర్ చేయాలని సర్కార్‌కు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వ హయాంలో ఫీజీరియింబర్స్‌మెంట్ బకాయిలున్న మాట వాస్తవమేనన్నారు. అయితే, 2014లో తాము అధికారంలోకి వచ్చిన సమయంలో తమకూ 1508 కోట్ల రూపాయలను కాంగ్రెస్ సర్కారు



వదిలిపెట్టిపోయిన విషయాన్ని లేవనెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్ల కాలంలో 18,500 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్స్ చెల్లించిన విషయాన్ని గుర్తుచేశారు. హరీశ్‌బాబు మాట్లాడుతూ..కాలేజీల యాజమాన్యాలు ఒకవైపు..పిల్లలు ఒకవైపు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభా దృష్టికి తీసుకొచ్చారు. సీపీఐ పక్ష నేత కూనంనేని మాట్లాడుతూ. .బకాయిలను ఎప్పటిలోగా చెల్లిస్తారనే దానిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. వీలైనంత త్వరగా విడుదల చేస్తే విద్యార్థులకు మేలు కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి తేకుండా చూడాలనీ, కలెక్టర్లు, ఆర్డీఓలు, విద్యాశాఖ అధికారులు కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడి ఒప్పించాలని సూచించారు. హరీశ్‌రావు మాట్లాడుతూ..ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తమ ప్రభుత్వం ఇవ్వలేదన్నట్టుగా మంత్రి మాట్లాడటం తగదన్నారు. తమ ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో, రైతుబంధును జూన్-జులై, నవంబర్ నెలల్లో ఒక పద్ధతి ప్రకారం విడుదల చేసేవారమనీ, దీనిద్వారా ఆర్థికవెసులుబాటు కలిగేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆలోచించాలని సూచించారు. పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాటిని వీలైనంత త్వరగా క్లియర్ చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఈఏడాది రైతు రుణమాఫీ కోసమే రూ.21 వేల కోట్లు వెచ్చించడం వల్ల కొంత ఇబ్బంది అయ్యిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. పిల్లలకు ఇబ్బందులు కావొద్దనే రూ.1200 కోట్లకు సంబంధించిన టోకెన్లను ఇప్పటికే జారీ చేశామనీ, నిధులు త్వరలోనే విడుదలవుతాయని హామీనిచ్చారు. పిల్లలను ఇబ్బందులకు గురిచేయొద్దని యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో పెట్టాలని తమ ప్రభుత్వానికేం లేదనీ, ఈసారి క్రమంగా క్లియర్ చేస్తామని భరోసానిచ్చారు.

మహిళా వికలాంగుల సాధికారతకు ప్రత్యేక పథకం ప్రవేశపెట్టాలి

హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు : ఎన్‌పీఆర్‌డీ సదస్సులో వక్తలు



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళా వికలాంగుల సాధికారత, స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'మహిళా వికలాంగుల సాధికారత-సంక్షేమం' అనే అంశంపై సి.సాయమ్మ అధ్యక్షతన హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు జరిగింది. మహిళా వికలాంగుల సాధికారత, సంక్షేమంపై తీర్మానాన్ని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టి.వరమ్మ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి మాట్లాడుతూ.. మహిళలు, మహిళా వికలాంగులపై వేధింపులు, లైంగిక దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల రక్షణకు రాజ్యాంగంలో ఉన్న అంశాలు అమలు కావడం లేదన్నారు. వైకల్యం ఉన్న పురుషులతో పోలిస్తే వైకల్యం ఉన్న మహిళల జీవితాలు మరింత దుర్భరంగా ఉన్నాయని చెప్పారు. జీవన నాణ్యత ఇప్పటికీ తక్కువగా ఉందని చెప్పారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల మంది మహిళా వికలాంగులున్నారని తెలిపారు. మహిళా వికలాంగుల్లో వివాహం కాని వారి సంఖ్య సాధారణ మహిళలతో పోల్చితే నాలుగు రెట్లు అధికంగా ఉందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ.. వికలాంగ మహిళల హక్కులు, రక్షణ కోసం ఎన్‌పీఆర్‌డీ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. మహిళా మానసిక వికలాంగులు 70 శాతం లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా వికలాంగులపై వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, వారిని వివాహం చేసుకున్న వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందిరా మహిళా శక్తి పథకం అమల్లో భాగంగా కోటి మంది మహిళలకు అందిస్తున్న పథకాల్లో 5శాతం మహిళా వికలాంగులకు కేటాయించాలని, రాజీవ్ యువ వికాసం పథకంలో నిరుద్యోగ మహిళా వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మెన్ పి.ఉమర్ ఖాన్, వీఆర్‌సీ మాజీ డైరెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ.. మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.కె సలీమ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణ జ్యోతి మాట్లాడుతూ.. సమాజంలో సామజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో నిర్ణయాలు చేసే స్థాయికి మహిళలు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేష్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ జె.రాజు, బి.స్వామి, నాగలక్ష్మి, యశోద, గంగాధర్, కాషాప్ప, దశరథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు శశికళ, సావిత్రి, ప్రకాష్, భుజంగారెడ్డి, చంద్రమోహన్, జయలక్ష్మి, రమేష్, సంతోష, బాలయ్య, నరసింహ,షాహీన్ బేగం,నగేష్,కవిత, భాగ్యలక్ష్మి, మంగమ్మ, ఉషా పాల్గొన్నారు.

మతవిద్వేషాలను రెచ్చగొట్టేందుకే చరిత్ర వక్రీకరణ

- రచయిత, ప్రొఫెసర్ రాంపునియాని విమర్శ
- చావా సినిమా అభూత కల్పన అంటూ వ్యాఖ్య

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేశంలో మతవిద్వేషాలను రెచ్చగొట్టేందుకే చరిత్రను వక్రీకరిస్తున్నారని ఐఐటీ బాంబే రిటైర్డ్ ప్రొఫెసర్, రచయిత రాంపునియాని విమర్శించారు. మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ సర్కారు ఔరంగజేబు సమాధిని తొలగించాలని చూస్తున్నదని అన్నారు. చావా సినిమా సైతం అభూతకల్పనలతో నిర్మించారని వ్యాఖ్యానించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'దేశమా..సమాధులా..ఏదీ ముఖ్యం' అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. దీనికి ఎస్‌వికె కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆంగ్ల ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాంపునియాని మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల ముందు నుంచే ఔరంగజేబు సమాధిని వివాదాస్పదం చేసేందుకు మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని వ్యాఖ్యానించారు. చావా సినిమా 126 నిమిషాల నిడివితో తీశారనీ, అందులో ఔరంగజేబు, శంభాజీ మహారాజుకు సంబంధించి కాల్పనిక కథలతో చరిత్రను తప్పుగా సమాజానికి చేరేలా చేశారని అన్నారు. బాబ్రీ మజీద్ వివాదాన్ని మళ్లీ ఈసందర్భంగా తవ్వితీసే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రజలను మతపరంగా రెచ్చగొట్టి రాజకీయపబ్బం గడుపుకోవాలనే ప్రయత్నాలను ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ ఆకృత్యాలను ఇక్కడ ప్రచారం చేసి మతమౌఢ్యాన్ని పెంచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీలపై విరుచుకుపడుతూ భయభ్రాంతులకు గురిచేయడాన్ని తప్పుబట్టారు. మహారాష్ట్రలో అనేక సమస్యలు ఉన్నాయనీ, వాటిని పక్కనబెట్టి మతపరమైన అంశాలను ప్రచారంలోకి తెస్తున్నారని వివరించారు. వ్యవసాయంతోపాటు రైతుల ఇబ్బందుల పరిష్కారాన్ని వదిలేసి ఔరంగజేబు సమాధిని చర్చనీయాంశం చేస్తున్నారని చెప్పారు. సమస్యల పరిష్కారం నుంచి దృష్టి మళ్లించడానికే ఇలా చేస్తున్నారని విమర్శించారు. రాచరిక కాలంలో ముస్లిం, హిందూ రాజులు చేసిందే ఔరంగజేబు చేశారని అన్నారు. ఆయన కూడా తండ్రి, సోదరులను హతమార్చి అధికారంలోకి వచ్చారని చెప్పారు. ఈ పని హిందూ రాజు అశోకుడు సైతం చేశారని అభిప్రాయపడ్డారు. ప్రత్యేకంగా ముస్లిం రాజు అనే చెప్పడంలోనే హిందువుల్లో వ్యతిరేకత పెంచే ఉద్దేశ్యం జరుగుతున్నదన్నారు. అయితే ఔరంగజేబు మతమార్పిడులకు ఎన్నడూ పాల్పడలేదన్నారు. అశోకుడు బౌద్ధమతం పుచ్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. రాజులు సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో గుడులు, మజీద్‌లు కూలగొట్టేవారన్నారు. ఇది అందరూ చేశారన్నారు. అదే సందర్భంలో 100 దేవాలయాల నిర్మాణాలకు ఔరంగజేబు ఆర్థిక సాయం చేశారని వివరించారు. ప్రపంచంలోనే అత్యధిక జీడీపీ 25 శాతం మేరకు ఔరంగజేబు పరిపాలన కాలంలో ఉండేదన్నారు. చరిత్రను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ఆయన దర్బార్‌లో 33 శాతం మంది హిందువులు ఉద్యోగులుగా పనిచేశారని చెప్పారు. రాజులందరికీ సామ్రాజ్య విస్తరణ ఉండేదని చెప్పారు. చరిత్రను వక్రీకరించొద్దన్నారు. హేతుబద్ధమైన చరిత్రను ప్రజలకు చెప్పాలని సూచించారు. శాస్త్రీయ అంశాలను ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం తాజా పరిస్థితుల్లో మరింత పెరిగిందని అభిప్రాయపడ్డారు.

రోడ్డు ప్రమాదంలో అడిషనల్ డీసీపీ మృతి

- రోడ్డు దాటుతుండగా ఢీకొట్టిన ఏపీ ఆర్టీసీ బస్సు
- మూడ్రోజుల కిందటే అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి..



(ఫైల్)

నవతెలంగాణ-హయత్ నగర్

వాకింగ్‌కు వెళ్లిన అడిషనల్ డీసీపీ రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మారెడ్డిపాలెంలోని మైత్రి కుటీర్‌లో నివాసముంటున్న అడిషనల్ డీసీపీ టీఎం. నందీశ్వర బాబ్జి(50) రోజూ మాదిరిగానే శనివారం వేకువజామున మార్నింగ్ నడకకు వెళ్లారు. హనుమాన్ దేవాలయం నుంచి రోడ్డు దాటుతుండగా ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వస్తున్న నూజివీడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ 39వీఏ 9563) అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దాంతో అతని తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. 1995 బ్యాచ్‌కు చెందిన బాబ్జి స్వస్థలం ఆంధ్రప్రదేశ్. రాచకొండ కమిషనరేట్‌లోని కంట్రోల్ రూమ్, షీ టీం ఏసీపీగా పనిచేశారు. మూడ్రోజుల కిందట అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు.

నేను ప్రభుత్వ భవనంలోనే ఉంటున్నా

- నాది నిరాడంబర జీవితం
- మీ లైఫ్‌స్టైల్ వేరు.. నాది వేరు :మంత్రి సీతక్క
- ఐదెకరాల్లో ఉన్న భవనంలో ఉంటున్నారు : కౌశిక్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తాను మంత్రి అయినందుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్మించిన ప్రభుత్వ భవనంలో ఉంటున్నానని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ధనసరి అనసూయ అన్నారు. మంత్రి సీతక్క ఈ మధ్య హైదరాబాద్‌కే పరిమితమయ్యారనీ, ములుగు జిల్లాలో పర్యటించడం లేదని బీఆర్ఎస్ సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. తిరిగితే రైతులు పడే ఇబ్బందులు తెలిసేవని అన్నారు. సన్నవడ్లకు పూర్తిస్థాయిలో బోనస్ ఇవ్వడం లేదన్నారు. కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆమె శనివారం అసెంబ్లీలో స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి లైఫ్‌స్టైల్ వేరు, తన లైఫ్ స్టైల్ వేరని అన్నారు. తాను నియోజకవర్గంలో తిరిగినట్టు ఆయన తిరగలేదని చెప్పారు. ప్రజలకు ఎవరు ఎక్కువ అందుబాటులో ఉంటారో తేల్చుకుందామని అన్నారు. సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదన్న వ్యాఖ్యలను ఖండించారు. హైదరాబాద్‌లో తిరిగే వారికి రైతులకు బోనస్ వస్తుందో? లేదో ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. బోనస్ ఇస్తామని చెప్పి బోగస్ చేసింది బీఆర్ఎస్ అని విమర్శించారు. వరి వేస్తే ఉరి అన్నారని గుర్తు చేశారు. సన్న వడ్లకు రూ.1,200 కోట్లు బోనస్ ఇచ్చిందన్నారు. దీనిపై కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ తన లైఫ్‌స్టైల్ వేరనీ, మంత్రి సీతక్క లైఫ్‌స్టైల్ వేరని అన్నారు. ఆమె ఐదెకరాల్లో ఉన్న భవనంలో ఉంటున్నారనీ, తాను 500 గజాల స్థలంలో ఉంటున్నానని వివరించారు. దీనిపై మంత్రి సీతక్క స్పందిస్తూ వైఎస్ నిర్మించిన ప్రభుత్వ భవనంలో ఉండడం తన అదృష్టమని అన్నారు. ఆ భవనంలో తాను అదనంగా ఏమైనా మరమ్మతులు చేయించుకుంటే వచ్చి చూడాలని కోరారు. మంత్రిగా ఉన్నందుకు ఆ భవనంలో నివాసముంటున్నాననీ, తమ స్థాయికి అది చాలా పెద్దదని అన్నారు. ఆ ఇంటికి వస్తే అన్ని విషయాలూ తెలుస్తాయన్నారు. తనది నిరాడంబర జీవితమనీ, తన కుమారుడు హన్మకొండలోనే ఉంటాడని వివరించారు. తన జీవన విధానం, ఆయన జీవన విధానం ప్రజలందరికీ తెలుసని అన్నారు. బీఆర్ఎస్ నాయకులను భోజనానికి ఆహ్వానిస్తున్నానని చెప్పారు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ భోజనానికి ఆహ్వానించలేదని అన్నారు. ఇదే అంశంపై శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ భవనంలో మంత్రి సీతక్క ఉంటున్నారని చెప్పారు. పాడి కౌశిక్‌రెడ్డి ఆదివాసీ మహిళ గురించి అలా మాట్లాడ్డం సరైంది కాదన్నారు. ఆయనకు బీఆర్ఎస్ నేర్పించే సంస్కృతి ఇదేనా?అని ప్రశ్నించారు. తాను మంత్రి సీతక్కను అవమానించలేదంటూ కౌశిక్‌రెడ్డి అన్నారు.

ప్రాథమిక సొసైటీలను ప్రక్షాళన చేయండి

కాంగ్రెస్ సభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రాథమిక సహకార సంఘాలను ప్రక్షాళన చేయాలని కాంగ్రెస్ సభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు సభ్యులు వివిధ అంశాలను లేవనెత్తారు. ధర్మపురి నియోజక వర్గంలోని పలు సొసైటీల్లో అక్రమాలు జరిగాయని ఆడిట్ నివేదిక వెలడించినా, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సభ్యులు శంకరయ్య మాట్లాడుతూ విజయ డైరీ రైతుల ఇన్సెంటివ్‌ను పెంచడంతో పాటు, వారికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సభ్యులు కె.రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మరో సభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న 400 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఒక్కరూ నీటి జలాలను కాపాడుకోవాలి

- వాటర్ వర్క్స్ డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథరావు



నవతెలంగాణ-అంబర్‌పేట

వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా వాటిని సంరక్షించుకోవాలని వాటర్ వర్క్స్ డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథరావు అన్నారు. శనివారం నల్లకుంట డివిజన్ పరిధిలోని వరల్డ్ వాటర్ డే సందర్భంగా విద్యార్థులు వాటర్ వర్క్స్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు ప్రకటిని నడిపించే శక్తి అనీ భవిష్యత్ తరాల కోసం దానిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. మనం రక్షించిన ప్రతి చుక్క స్థిరమైన భవిష్యత్తు వైపు ఒక అడుగు వేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో శివం వాటర్ వర్క్స్ మేనేజర్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



గన్ ఫౌండ్రీ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు సహకరించాలని కోరుతూ గోషామాల్ సర్కిల్-14 జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ దుబ్బాక లావణ్యకు వినతిపత్రం అందజేస్తున్న డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ వెంకట్ రమణ, నాయకులు ఓం ప్రకాష్ తదితరులు పాల్గొనానరు. నవతెలంగాణ -సుల్తాన్ బజార్

చిన్న పాటి వర్షానికే చీకటి..

- గంటల తరబడి విద్యుత్ కోతలు..
- బయట దోమలు.. లోపల ఉబ్బరం..
- నిద్ర లేమితో ప్రజలు ఇబ్బందులు..



నవతెలంగాణ - ధూల్ పేట్

చిన్న పాటి వర్షానికే చీకటి.. గంటల తరబడి కరెంట్ కోతలు.. బయట దోమలు.. లోపల ఉబ్బరం తో ప్రజలు అవస్థలు పడ్డారు. ఓ పక్క ప్రభుత్వం కరెంట్ కోతలు లేకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. జీయాగుడా, దుర్గ నగర్, వెంకటేశ్వర నగర్, జుమ్మెరత్ బజార్, పురాణ పూల్ ప్రాంతాలలో ఇది పరిస్థితి.

గంటల తరబడి..

గతరాత్రి కురిసిన వర్షానికి మధ్యరాత్రి సుమారు రెండు గంటల పాటు కరెంట్ కోత విధించారు. అసలే ఎండా కాలం కావడంతో ఇండ్లల్లో వేడిమి చేత ఉబ్బరంతో ప్రజలు సతమత మయ్యారు. గాలి కోసం ఇంటి డోరు తెరిస్తే దోమల దాడి చేయడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. తెల్లవారు జాము వరకు నిద్ర లేమితో చిన్న పిల్లల ఉన్న వారు, పెద్దలు అవస్థలు పడ్డారు. దోమల నివారించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అధికారుల నిర్లక్ష్యంతో సాయంత్రం అయిందంటే దోమల స్వైర విహారం చేస్తూ నిత్యం నరక యాతన చూపిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు రాత్రి కరెంట్ లేక పోవడం తో అటు దోమలు ఇటు ఉబ్బరం తో ఇబ్బం దులతో పడ్డారు. కరెంట్ లేకపోవడంతో ఆల్ అవుట్, గుడ్ నైట్ లు పనిచేయక.. దోమల బట్టి కాల్చేశారు. అయినా తప్పని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా కరెంట్ కోతలు నివారించేలా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

భగత్ సింగ్ ఆశయాలను భూజాలకెత్తుకుందాం

నవ సమాజాన్ని నిర్మిద్దాం

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్, టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు





నవతెలంగాణ - ముషీరాబాద్

భగత్ సింగ్ ఆశయాలను బుజాలకెత్తుకుందాం నవ సమాజాన్ని నిర్మిద్దామని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు.తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద భగత్ సింగ్ 94 వ వర్ధంతి సందర్భంగా బాల భగత్ సింగ్ లంతా చక్కటి వేషధారణతో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. భగత్ సింగ్ బాటలో బాలలం మేమంతా భావిపౌరులం ఉత్తుంగ తరంగాలం - ఉద్దండ పిండాలం కులం లేదు మతం వద్దు సమానత్వమే సరిహద్దుగా సాగుదాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ముఖ్య అతిథిగా ఎండీ అబ్బాస్ హాజరై మాట్లాడుతూ. నేటి బాలలే రేపటి భగత్ సింగ్‌లు కావాలని , వారి లోని ధీరత్వం, మానవత్వం, ఎనలేని ప్రేమతత్వం, సోదరత్వం మనమంతా పెంపొందించు కోవాలని సూచించారు. టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. త్యాగానికి వెరవని వారి వీరత్వం ఆశయంకోసం అంకితమై ప్రాణాన్ని తణ ప్రాయంగా అర్పించిన అమరత్వంవారిది అని భగత్ సింగ్ అంటే బాంబులు తుపాకులు కాదని భగత్ సింగ్ అంటే నిత్యం రగిలే చైతన్య మన్నారు .దేశం కోసం బలైన భగత్ సింగ్ బాట లో భావి తరాలే భవిష్యత్తును నిర్మించాలన్నారు. ఆయన త్యాగధనుడే కాదు శాస్త్రీయ ఆలోచనలతో ఈ దేశ ప్రజల విముక్తి సాధన కోసం సమగ్ర అధ్యయనం చేశారని చెప్పారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ అందరి చేత నినాదాలు పలికించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే హైదరాబాద్ కన్వీనర్ గుమ్మడి నరేష్ , రాజయ్య గౌడ్, ఉపాధ్యాయులు వరప్రసాద్ రెడ్డి, మహిళా టీచర్స్ రుక్మిణీ వసుంధర పాల్గొన్నారు.

ధైర్యసాహసం, నైతిక విలువలను కరాటే పెంపొందిస్తుంది

- ఈస్ట్ జోన్ డీసీపీ బి. బాలస్వామి



నవతెలంగాణ-అంబర్‌పేట

నిరుద్యోగ యువతకు ఉచితంగా కరాటే ట్రెనింగ్ కోర్సును అందించేందుకు జి.వి.ఆర్ కరాటే అకాడమీ చేపట్టిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఈస్ట్ జోన్ డీసీపీ బి. బాలస్వామి,అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ జె. నర్సయ్య జీ.వి.ఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్ గోపాల్ రెడ్డి ,అంబర్‌పేట ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ కరా టే కేవలం ఓ మార్షల్ ఆర్ట్ మాత్రమే కాకుండా, యువతలో క్రమశిక్షణ, ధైర్యసాహసం, నైతిక విలువలు పెంపొందించే సాధనమని పేర్కొన్నారు. మహిళల రక్షణ, యువత అభివృద్ధి, స్వీయరక్షణ నైపుణ్యాలను నేర్చుకోవడానికి కరాటే ముఖ్యమైన సాధనమని చెప్పారు, ఈ కోర్సు ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తా యని తెలిపారు.ఉచితంగా ఈ శిక్షణ అందిస్తుండటం అభినందనీయమని, యువత సద్వినియోగించుకోవాలని సూచించారు. అడిషనల్ డీసీపీ జె. నర్సయ్య మాట్లాడుతూ నిరుద్యోగ యువత కరాటేలో శిక్షణ పొందడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. నిర్వాహకులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.ఈ కోర్సు ఏడాది పాటు కొనసాగనుండగా, ఇందులో కరాటే శిక్షణతో పాటు ప్రాక్టికల్ ఫీల్డ్ ట్రెనింగ్, సమర్థమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, నైతికత, క్రమశిక్షణ అభివద్ధి, ఉద్యోగ అవకాశాల భరోసా వంటి అంశాలు ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ (పాస్/ఫెయిల్) విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొనే ఆసక్తిగలవా వారు , క్రీడా నేపథ్యం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. 19 నుంచి 24 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగిం చుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎస్. సోమేశ్వరరావు, రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి. లక్ష్మయ్య ,రాష్ట్ర డిగ్రీ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. బాలరాజు జీవిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్ గోపాల్ రెడ్డి, అకాడమీ సీనియర్ బ్లాక్ బెల్ట్ సుభాష్, అమత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాకతీయ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు..



నవతెలంగాణ - ధూల్‌పేట్

జియాగూడ కాకతీయ స్కూల్ విద్యార్థులు చదువు తో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చడం హర్షనీయమని ఛత్రపతి శివాజీ మహారాజ్ మరాఠ మండల్ రాష్ట్ర అధ్యక్షులు మదన్ జాదవ్, కూల్సుంపురా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ లు అన్నారు. జియాగూడ లోని ఎస్ఆర్ బ్యాంక్విట్ హాల్ లో ఉత్సవ 2025 వార్షికోత్సవం, ప్రీ ప్రైమరీ నుంచి ప్రైమరీకి వెళ్తున్న చిన్నారి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే పట్టాల పంపిణీ, ఫెయిర్ వెల్ పార్టీ కార్యక్రమాలు స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ వి.వికాస్ చంద్ర ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఇదె స్కూల్ కు చెందిన 9వి తరగతి చదువుతున్న వైష్ణవ్ క్వెస్ట్ జనరల్ నాలెడ్జ్ టాలెంట్ సెర్చ్ పోటీలలో రాష్ట్ర టాపర్‌గా నిలువడం అభినందనీయమన్నారు. అలాగే స్కూల్ ప్రిన్సిపాల్ వికాస్ చంద్ర వంద శాతం అటెండన్స్, బెస్ట్ డిసిప్లెన్, అకాడమీ టాపర్స్, సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న 150మంది విద్యార్థుల కు ప్రసంసాపత్రాలను అందజేశారు. చదువు తో పాటు అన్ని పోటీ రంగాల్లో శిక్షణలు ఇస్తున్నామన్నారు. చిన్నారుల నాటకం, విద్యార్థుల కరాటే, యోగ, నత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను స్కూల్ డైరెక్టర్ వికాస్ చంద్ర అందజేశారు. మదన్ జాదవ్, రాజేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపుతోనే భవిష్యత్తు..

- వెంగళ్‌రావ్ నగర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ బాలికల పాలి టెక్నిక్ కాలేజీలో జలమండలి ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు
- జ్యోతిప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించిన ఎండీ అశోక్ రెడ్డి
- ప్రతి వాననీటి బొట్టును ఒడిసిపట్టి, భవిష్యత్తు తరాలకు అందించాలని సందేశం
- అవసరాలకు మించి జలవనరులను వినియోగించడం వల్లే దుస్థితి అన్న ఎండీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచంలో జీవకోటికి ఆక్సిజన్ తర్వాత అంతటి విలువైంది నీరు మాత్రమేనని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. ఆక్సిజన్ లేకపోతే ఒక నిమిషం కంటే ఎక్కువ సేపు బతకలేమని, అదే నీరు లేకపోతే ఒకట్రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు బతకడం కష్టమని చెప్పారు. నీరు అనేది విలాసవంతమైనది (లగ్జరీ) కాదని.. అది అత్యవసరమైనది (నెసెసిటీ) అని చెప్పారు. అందుకు ఇంతటి ప్రాముఖ్యమైన నీటిని వధా చేయకూడదని వివరించారు. జలమండలి ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వెంగళ్ రావు నగర్ లోని దుర్గాబాయ్ దేశ్ ముఖ్ బాలికల పాలిటెక్నిక్ కళాశాల వేదికగా జరిగిన ఈ వేడుకలకు ఎండీ అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. కోటి 30 లక్షలు కలిగిన హైదరాబాద్‌కు రోజూ తాగునీరు సరఫరా చేయడం పెద్ద సవాలుతో కూడుకున్న పని అన్నారు. పెద్ద పంపులు, భారీ పైపుల ద్వారా నగర పౌరులకు జలమండలి నీటి సరఫరా చేస్తోందని తెలిపారు. హైదరాబాద్ నగరంలో తగినంత స్థాయిలో భూగర్భ జలాలు లేకపోవడం వల్లే, 150 కిలోమీటర్ల నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఇక్కడ భూగర్భ జలాలు సరిపడా ఉంటే అంత శ్రమ పడే అవసరం లేదని చెప్పారు. నగరంలో తాగునీటికి ఇంత డిమాండ్ ఏర్పడడానికి కారణం, అవసరానికి మించి నీటిని వినియోగించడమే అన్నారు. 13 లక్షల కనెక్షన్లలో కేవలం 42 వేల గృహాలే ట్యాంకర్ బుక్ చేసుకుంటున్నారని తెలిపారు. అందులో 500 మంది 75 రోజుల్లో 31 వేల ట్యాంకర్లు బుక్ చేసినట్లు చెప్పారు. 22 వేల మంది 90 శాతం ట్యాంకర్లను అంటే 2.84 లక్షల ట్యాంకర్లను బుక్ చేస్తున్నారన్నారు. దీంతో వారి గృహాల్లో సర్వే చేస్తే, ఇంకుడు గుంతలు లేనట్లు గుర్తించామన్నారు. అదే వారి ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు ఉంటే ఈ దుస్థితి రాకపోయేదన్నారు. వారందరికీ ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా నోటీసులు జారీ చేశామని చెప్పారు. నీటిని పొదుపుగా వాడుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. తాగునీటి ప్రాముఖ్యాన్ని గుర్తించి వాన నీటిని ఒడిసి పట్టి సహజ వనరుల్ని భవిష్యత్తు తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.

10 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు

జల సంరక్షణ, నీటి పొదుపు అంశాలపై నేటి నుంచి 10 రోజుల పాటు జలమండలి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన ప్రచార రథాన్ని ఎండీ అశోక్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. బోర్డు పరిధిలోని అన్ని డివిజన్లలో ఈ అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించనున్నారు. ఈ రోజే ఆయా డివిజన్లలో అవగాహన కార్యక్రమాల్ని ప్రారంభించారు. తర్వాత నీటి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజయం సాధించిన విజేతలకు ఎండీ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్ ప్రవీణ్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్, ఇంకుడు గుంతల నిర్మాణ ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ, గాంధీగ్యాన్ ప్రతిష్ఠాన్ (ఎన్జీవో) చైర్మెన్ రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్ రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజంలో సేవా దృక్పథం మరింత పెరగాలి...

- ఎమ్మెల్సీ కోదండరాం
- పేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ....



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

సమాజంలో సేవా దృక్పథం మరింత పెరగాల్సిన అవసరం ఉందని, దాని ద్వారా దేశంలో పేదలకు అండగా ఉండే అవకాశం ఉంటుందని ఎమ్మెల్సీ కోదండరాం అభిప్రాయపడ్డారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని అల్. హజ్ సయ్యద్ మథర్ సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఎంజే మార్కెట్ లోని టీజేఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన రంజాన్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ట్రస్ట్ చైర్మెన్ సయ్యద్ ఇమామ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అందరూ స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తత పరచాలని సూచించారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా దేవుడు సహాయం చేసిన వారిని ఆశీర్వదిస్తాడని అభిప్రాయపడ్డారు. ట్రస్ట్ చైర్మెన్ సయ్యద్ ఇమామ్ మాట్లాడుతూ పేద ముస్లింలకు సహాయం అందించడం సంతోషాన్ని స్తుందన్నారు. గత మూడేండ్లుగా నిర్వహిస్తున్న రంజాన్ కిట్ల పంపిణీకి టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ. కోదండరాం అండదండలు అందిస్తున్నారని, ఆయనకు పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య మాట్లాడుతూ.. కరోనాకాలం నుంచి ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. టీజేఎస్ నగరంలోని వివిధ బస్తీలలో పేదలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శంకర్రావు, బైరి రమేష్, పల్లె వినయ్ , యువజన జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సలీం పాష,గ్రేటర్ హైదరాబాద్, అధ్యక్షులు ఎం నరసయ్య ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, బీసీ జన సమితి అధ్యక్షుడు జస్వంత్ కుమార్, ట్రస్ట్ చైర్మన్ ఇమామ్, లీగల్ సెల్ కన్వీనర్ ఇస్మాయిల్, నగర ఉపాధ్యక్షులు మధు జయపాల్ రెడ్డి, లక్ష్మణ్, నగర నాయకులు మెరుగు శ్రీనివాస్ యాదవ్, రసూల్, రమేష్, సుధాకర్, భాష, మాణిక్యం, నాగభూషణం, జోరుద్దీన్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ బస్తీలకు చెందిన పేద ముస్లిం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంజాన్ కిట్లను అందుకున్నారు.

చిన్నపిల్లలకు టీకాలు తప్పనిసరి

- నయాపూల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎంకే పార్వతి



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

వ్యాధుల నుంచి కాపాడేందుకు టీకాలు తప్పనిసరి తీసుకోవాలని నయాపూల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం కే పార్వతి అన్నారు. శనివారం పిల్లలకు టీకాలు అందించిన అనంతరం మాట్లాడారు. పుట్టిన గంటలోపు టీకా బీసీజీ పోలియో చుక్కల మందుతో పాటు వ్యాక్సిన్ కూడా అందిస్తామన్నారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకునే ముందుజాగ్రత్తలలో టీకా ఒకటి అని.. బాల్యంలో టీకా తీసుకోవడం వల్ల పెద్దయ్యాక ఆ వ్యాధిని దరిచేరకుండా చూసుకోవచ్చు అన్నారు. బీసీజీ టీకా తీసుకోవడం వల్ల టీబీ దరిచేరదన్నారు. హెపటైటిస్ బి టీకా తీసుకోవడం వల్ల కాలేయాలనికి సంబంధించిన ఇన్ ఫెక్షన్ రాదన్నారు.ఓరల్ పోలియో చుక్కలు (వ్యాక్సిన్) తీసుకోవడం వల్ల పోలియో కు గురికాకుండా ఉంటామన్నారు. పెంటావాలెంట్ టీకా ఐదు యాంటీజెన్‌ల కలయికతో రూపొందించిన వ్యాక్సిన్ పెంటావాలెంట్ టీకా అన్నారు. డిఫ్తీరియా, పెర్టుసిస్, టెటానస్, హెపటైటిస్ బి హేమోఫిలస్, ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి. దగ్గు, తుమ్ముల ద్వారా వ్యాపించే డిఫ్తీరియా అనే వైరస్ పిల్లల ముక్కు, గొంతుపై ప్రభావం చూపుతుందని చెప్పారు. చిన్నపిల్లల గుండె, కిడ్నీ, కాలేయం దెబ్బ తింటాయని తెలిపారు. ఈ ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడేందుకు సాయపడడంతో పాటు హెపటైటిస్ బి వ్యాక్సిన్ ప్రభావాన్ని కూడా పెంచుతుందన్నారు. మూడు విడతలుగా అందించే ఈ డోసులలో ఫస్ట్ డోసును బిడ్డ ఆరు వారాల వయసు లోపు వేయించాలని, పది వారాల్లో మరో డోసు, పద్నాలుగు వారాలలో మూడో డోసును ఇప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. రోటావైరస్ టీకారోటా వైరస్ వేగంగా వ్యాప్తి చెందే వైరస్ అన్నారు. పార్క్ లేదా డేకేర్ సెంటర్ వంటిచోట్ల పిల్లలు ఆడుకునేటప్పుడు సోకే ప్రమాదం ఎక్కువ అని.. దీని వల్ల జ్వరం, తిమ్మిర్లు, వాంతులు విరేచనాలు సంభవించవచ్చు అని చెప్పారు. పెంటావాలెంట్ వ్యాక్సిన్ లాగానే రోటావైరస్ వ్యాక్సిన్ పిల్లలకు అందిస్తున్నామన్నారు. బిడ్డకు పది వారాల వయసులో ఒకటి, 14 వారాల వయసులో మరొకటి వేయించాలి అన్నారు.న్యుమోకాకల్ కంజుగేట్ వ్యాక్సిన్ న్యుమోనియా సహా పలు ప్రమాదకర వ్యాధుల బారి నుంచి కాపాడేందుకు పిల్లలకు ఇచ్చే వ్యాక్సిన్ అని.. దీనినే పీసీవీ వ్యాక్సిన్ అంటుంటారని తెలిపారు. 6 వారాల వయసులో తొలి డోసును, 14 వారాల వయసులో రెండో డోసును వేయించాలి అన్నారు.మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్

మీజిల్స్ - రూబెల్లా (ఎంఆర్) వ్యాక్సిన్ ను రెండు మోతాదులలో ఇస్తారని చెప్పారు.. జపనీస్ ఎన్ సెఫాలిటిస్ వ్యాక్సిన్(జేఈ, పి సి వి-బి, ఎఫ్ఐపీవీ) తొమ్మిది నెలల నుంచి 12 నెలల లోపు ఇస్తామన్నారు.విటమిన్ ఏ లోపం పిల్లల్లో అంధత్వ నివారణకు తొమ్మిది నెలలు నిండిన తర్వాత ఈ టీకా తొలి డోసు అందిస్తామని తెలిపారు. చిన్నపిల్లల తల్లిదండ్రులు టీకాలను తప్పనిసరిగా తమ పిల్లలకు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సంగీత, సువర్ణ ,పద్మ, ఆశ వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దోమల పై 'డ్రోన్ ఆపరేషన్'

- డ్రోన్ ద్వారా రసాయనం పిచికారీ..

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

మూసీ పరివాహక ప్రాంతాలలో రోజురోజుకు తీవ్రమవుతున్న దోమల సమస్యను నివారించడానికి జీహెచ్ఎంసీ గోషామహల్ ఎంటమాలజీ సీనియర్ ఆఫీసర్ కె రజిని ఆధ్వర్యంలో ఇసామియా బజార్ చాదర్‌ఘాట్ మూసీ పరివాహ ప్రాంతంలో దోమల ఉత్పత్తిని నివారించడానికి యాంటీ లార్వా డ్రోన్ ఆపరేషన్‌ను గన్ ఫౌండ్రి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మూసీ నది పరిసర ప్రాంతాలలో డ్రోన్‌ల ద్వారా రసాయనాలు పిచికారీ ద్వారా దోమలను నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సీనియర్ ఆఫీసర్ రజిని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ ఉద్యమ స్ఫూర్తితో..

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎదురించాలి

- సీపీఐ(ఎం) ఉప్పుగూడ డివిజన్ మీసాల లక్ష్మమ్మ

నవతెలంగాణ - ధూల్ పేట్

భగత్ సింగ్ ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎదురించాలని సీపీఐ(ఎం) ఉప్పుగూడ డివిజన్ మీసాల లక్ష్మమ్మ అన్నారు. భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉప్పుగూడ డివిజన్ అరుంధతి నగర్ బస్తీలో స్థానిక బస్తీ ప్రజల సమక్షంలో షహీద్ భగత్ సింగ్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్థానిక జిల్లా కమిటీ నాయకులతో కలిసి భగత్ సింగ్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరఆమె మాట్లాడుతూ.. భగత్‌సింగ్ ఆశయాలు చాలా గొప్పవని, ఆయన ఆశయ సాధనలో ఈనాటి యువజనులు ముందుకు వెళ్లాలని కోరారు. యువత ప్రజా జీవితానికి సంబంధించిన విషయాలలో జోక్యం చేసుకోకుండా మత్తులో జోగుతున్నారన్నారు. యువత బీర్లు, బిర్యానీలకు అమ్ముడు పోతూ స్వార్థపరుల చేతుల్లో ఆయుధాలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అది జాతికి భారతదేశ సమగ్రతకు ముప్పుగా వాటిల్లుతున్నదన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు ఎల్ కోటయ్యా మాట్లాడుతూ.. షహీద్ భగత్ సింగ్ యువకు లకు ఆదర్శమని ఆయన ఆదర్శాలను తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. దీంతో ప్రజల మీద భారాలను తగ్గించడం పై ప్రజల పక్షాన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర ధరలను తగ్గించే విధంగా ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవాలన్నారు. ఇప్పటికే కేంద్రంలో ఉన్న ప్రభు త్వం రాజ్యాంగాన్ని మార్చటానికి చేస్తున్న కుట్ర పూరిత ప్రయత్నాలను అడ్డు కోవాలని యువతకు పిలుపునిచ్చారు. ఉప్పుగూడ అరుంధతి నగర్ బస్తీ వాసులు స్వరూప, లక్ష్మమ్మ, కష్ణ, గాయత్రి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం : సీఐటీయూ

నవతెలంగాణ - ధూల్ పేట్

అసంఘటిత రంగ కార్మికులు, ఆటో , భవన నిర్మాణం , హామాలి , బీడీ , తోపుడు బండ్ల కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన మహాధర్నా అడ్డుకుని అరెస్ట్ లు చేయడాన్ని సీఐటీయూ గోషామహల్ జోన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. గోషామహల్ నియోజకవర్గం సిద్ధంబర్ బజార్ , గోల్ మసీదు చౌరస్తా లో అరెస్టులను నిరసిస్తూ శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించిన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ గోషామహల్ జోన్ కన్వీనర్ కె.జంంగయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై చేపట్టే ధర్నాకు కాంగ్రెస్ ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ నాయకులను అక్రమంగా అరెస్టులు చేసి హైదరాబాద్‌కు రాకుండా అడ్డుకొని కార్మిక పోరాటాలను అనచివేయాలని చూడటం సరికాదన్నారు. అసంఘటిత రంగ కార్మికులు సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హామాలి యూనియన్ నాయకులు, ఆర్ సాయిలు ,పి. కుర్మయ్య , సత్యనారాయణ ,సిద్దులు , తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ)జిల్లా అధ్యక్షులు తుపాకీ ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు నెమ్మాది గోపాల్ , ట్రాన్స్‌పోర్ట్ హమాలి యూనియన్ నాయకులు వెంకటేష్ ,బీమ్ , నారాయణ ,గోవర్ధన్ రెడ్డి ,జోన్ నాయకులు భీమయ్య ,అశోక్ , వెంకటప్ప , రవి , తదితరులు పాల్గొన్నారు.





గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మాజీ సీఎం కే.చంద్రశేఖర్ రావును కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా దూసరి లావణ్య దంపతులకు కేసీఆర్ వివాహ శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-అంబర్‌పేట

యువతి అదృశ్యం



నవతెలంగాణ- మేడ్చల్

కంపెనీలో విధుల కోసం వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ సింగనీయా చాక్లెట్ కంపెనీలో భాజన్ సా 19 ఏండ్ల కుమార్తె ఛాయాకంతి సా గత నెల రోజులుగా పనిచేస్తోంది. కాగా శనివారం సైతం కంపెనీకి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి ఉదయం 8గంటల ప్రాంతంలో ఆమె వెళ్లి సాయంత్రం అయినా తిరిగి రాలేదు.దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చెరువు కట్టపై కంపచెట్లు, పిచ్చి మొక్కల తొలగింపు..



నవతెలంగాణ - చర్లపల్లి

నాచారం డివిజన్ లోని హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువు కట్టపై విపరీతంగా పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలతో మట్టి కుప్పలతో కట్ట పూర్తిగా చీకటిమయం అయిపోయింది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాకింగ్ వెళ్లే వారికి, అలాగే ఈ చెరువు కట్ట మీది నుంచి చిల్కానగర్ వెళ్లే వారు తీవ్ర ఇబ్బ ందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయమై అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసిన స్పందించక పోవడంతో శనివారం నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ తన సొంత ఖర్చులతో మట్టి కుప్పలు, పిచ్చి మొక్కలను కంపచెట్లను తొలగించే పనులను చేపట్టారు. ఈ పనులను బీఆర్ఎస్ నాయకులు విట్టల్ యాదవ్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, పరమేష్, రాజు తదితరులు

సానుభూతి తప్ప...

పనులు మాత్రం చేయరా..?



- ఉప్పల్-నారాపల్లి ఫ్లై ఓవర్ గురించి ఎంపీ ఈటల ఎందుకు మాట్లాడట్లేదు
- సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర

నవతెలంగాణ-బోడుప్పల్

బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై సానుభూతి తప్ప... పనులు మాత్రం చేయట్లేదని సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం విమర్శించారు. ఉప్పల్-నారాపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చెంగిచర్ల చౌరస్తా నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ ఈ ప్రాజెక్టు పూర్తిచేసేందుకు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పర్యవేక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యమే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తోందని చెప్పారు.ఎంపీ ఈటల రాజేందర్ ఫ్లైఓవర్ గురించి ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయకపోతే రాబోయే రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



మా భూమి కబ్జా చేసి మాపైనే కేసులా..?



- కొర్రెములలో 10 గుంటలు కబ్జా చేసిన రియల్ వ్యాపార సంస్థ
- విలేకరుల సమావేశంలో బాధితులు

నవతెలంగాణ-ఘట్కేసర్

రియల్ వ్యాపార సంస్థ నిర్వాహకులు తమ భూమినే కబ్జాచేసి తమపై కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపిం చారు. శనివారం కొర్రెము లలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ పూర్వీకులు గత 60 ఏండ్ల క్రితం కొర్రెములు రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 402, 396. 395, 34, 387లలోని 11 ఎకరాల 2 గుంటల భూమిని కొనుగోలు చేశారని తెలిపారు. అప్పటి నుంచి తాము వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్టు చెప్పా రు. 11 ఎకరాలు 2 గుంటల భూమి పార్టీషన్ కాలేదని, జాయింట్ పట్టాగానే ఉన్నా అందరం కలిసి వరిసాగు చేసుకున్నామన్నారు. జాయింట్ పార్టీషన్‌లోని ఇద్దరు మెట్టు సత్తయ్య 1 ఎకరం 7 గుంటలు, ముంత మల్లేష్ 1 ఎకరం 3 గుంటల భూమిని మణిదీప రియల్ వ్యాపార సంస్థకు విక్రయించారని తెలిపారు. సదరు వ్యాపార సంస్థ మొత్తం 2 ఎకరాల 10 గుంటలు కొనుగోలు చేసి ఇంకా 10 గుంటలను కబ్జా చేసి ప్రహరీ నిర్మాణం చేసుకుం టున్నదని ఆరోపించారు. అదేంటని అడిగితే కేసులు పెడుతు న్నారని వాపోయారు. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో నుంచి రోడ్డు వేసుకున్నారని, డ పోని వాగును సైతం పూడ్చుతున్నారని తెలిపారు. ఇట్టి విషయాలపై జిల్లా కలెక్టర్. తహసీల్దారు, మున్సి పల్ కమిషనర్‌లకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి డప్పోనివాగును. ప్రభుత్వ భూమిని కాపాడి, కబ్జాచేసిన 10 గుంటల భూమిని తమకు ఇప్పించాలని వేడుకున్నారు.



జోనల్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కాప్రా/చర్లపల్లి/ఉప్పల్

ఈస్ట్ జోన్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను శనివారం వారి కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను జోనల్ కమిషనర్ దష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి నిధులు శాంక్షన్ చేయాల్సిందిగా, అలాగే వేసవిని దృష్టిలో ఉంచుకుని బాక్స్ డ్రయినేజీ పనులను చేయాలన్నారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వీలైనంత త్వరగా నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తానని హామీనిచ్చారు. ఇదిలా ఉండగా మల్లాపూర్ డివిజన్ పరిధిలో పలు అభివద్ధి పనులకు సంబంధించి మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి జోనల్ కమిషనర్‌ను వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్ కాలనీలో బెల్ కంపెనీ ప్రహరీ గోడ వరకు బాక్స్ డ్రైన్ ఏర్పాటుకు, ఎస్వీ నగర్, బాబానగర్, మల్లికార్జున్ నగర్ కాలనీలల్లో సీసీరోడ్డు అభివద్ధి పనుల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, చిలుక నగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, పార్టీ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి నిరుపేదకూ ఇందిరమ్మ ఇల్లు

- కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ -శామీర్ పేట

అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం శామీర్‌పేట మండలంలోని పొన్నాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పార్టీ శ్రేణులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని పేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం పొన్నాల గ్రామంలో ప్రారంభిం చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ , మేడ్చల్ జిల్లా గ్రంథాలయం చైర్మెన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి ,మేడ్చల్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, శామీర్ పేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాష్కీ శంకర్ గౌడ్, పొన్నాల మాజీ ఉపసర్పంచ్ మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం రమేష్, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ సంస్మరణ కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఎస్ఆర్‌డీజీ స్కూల్ ఆవరణలో భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా శనివారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. భగత్ సింగ్ స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి చివరకు ఉరికంబానికి వేలాడినప్పటికీ నేటికీ ప్రజల గుండెల్లో సజీవంగా నిలిచారని చెప్పారు. భగత్ సింగ్ కోరుకున్న సమ సమాజం నేటికీ రాలేదని దానికోసం అందరం పోరాడాలని చెప్పారు. సావిత్రిబాయి పూలే అకాడమీ వ్యవస్థాపకులు కర్రె మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని విజ్ఞానం సంపాదించడం కోసం పట్టుదలతో చదవాలని చెప్పారు. ముఖ్యంగా మూఢనమ్మకాలను వదిలేసి ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. సామాజిక ఉద్యమ నేత జయరాజ్ , పూలే అంబేద్కర్ స్ఫూర్తి గ్రూపు నాయకులు గద్దల నరసింహారావు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు భగత్ సింగ్ వేషధారణతో అందరికీ ఇంక్విలాబ్ జిందాబాద్ అని చెప్పారు. భగత్ సింగ్ వేషధారణ చేసిన విద్యార్థులకు భగత్ సింగ్ పుస్తకాలు, ప్రశంసా పత్రాలు అందించారు. గౌరీ నందన్ విద్యార్థికి కర్రే మల్లేశం, జశ్విన్ విద్యార్థికి గద్దల నరసింహారావు బహుమతి ప్రదానం చేశారు. స్కూల్ వైస్ ప్రిన్సిపల్ జయశ్రీ వందన సమర్పణ చేశారు. చివరగా విద్యార్థులందరూ భగత్ సింగ్‌కు నివాళులర్పించారు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు జయశ్రీ, ధనలక్ష్మి, స్రవంతి, రచన,మౌనిక, సంధ్య సరిత, జ్యోతి, ప్రవీణ్, లక్ష్మీ, ఉమాదేవి వందలాది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్ లైన్ గేమ్స్, బెట్టింగ్, డ్రగ్స్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావు

నవతెలంగాణ-నేరేడ్ మెట్

ఆన్ లైన్ గేమ్స్, బెట్టింగ్, డ్రగ్స్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ నేరేడ్‌మెట్ డివిజన్ పీఎస్ లో శనివారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఏసీపీ మహేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్ లైన్ గేమ్స్ ఆడి యువత, పిల్లలు డబ్బులు పడగొట్టుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఐపీఎల్ బెట్టింగ్, ఫోన్ యాప్స్ ద్వారా తీవ్ర ఇబ్బందులు అవుతున్నారని చెప్పారు. సీఐ, నాయకులు వెంకటేష్ యాదవ్ బి కే శ్రీనివాస్ చంద్రశేఖర్, ఎస్ఆర్ ప్రసాద్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, వినోద్ యాదవ్, పిట్టల నాగరాజు ధర్మేష్ యాదవ్ పంజా శ్రీనివాస్ యాదవ్, సంపత్ గౌడ్, కపిల్, యాది, సిరిగిరి రాజు యూసీఫ్ ఆశా, బాలరాజు యాదవ్, శ్రీకాంత్ ముదిరాజ్, ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శికి శుభాకాంక్షలు

నవతెలంగాణ - చర్లపల్లి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జాన్ వెస్లీని దళిత జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బొజ్జ యాదగిరి నేతత్వంలో శనివారం హైదరాబాద్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండె సంపత్, ప్రధాన కార్యదర్శి పిడిశెట్టి చంద్రమౌళి, కార్యదర్శి భావండ్లపల్లి గంగాధర్, డీజేఎస్ రాష్ట్ర నాయకులు, ఎదునూరి సంపత్, అశోక్, గంధమాల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో సత్తా చాటాలి

- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- రాంపల్లిలో వాలీ బాల్ క్రీడలు ప్రారంభం



నవతెలంగాణ-కీసర

యువకులు క్రీడల్లో పాల్గొన్ని సత్తా చాటాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు.శనివారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో వాలీ బాల్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మాజీ మార్కెటింగ్ డైరెక్టర్ గండి అంజయ్య గౌడ్ , బీఆర్ఎస్ నాగారం మున్సిపల్ అధ్యక్షుడు తెల్ల శ్రీధర్ ,మాజీ కౌన్సిలర్ కౌకుంట్ల అనంత్ రెడ్డి , బీఆర్ ఎస్ నాయకులు వరకాల పెంటయ్య గౌడ్ ,కంసాని మల్లారెడ్డి ,శంకర్ రెడ్డి ,రామకృష్ణారెడ్డి ,ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.



కట్టమైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ -శామీర్ పేట

శామీర్‌పేట కట్టమైసమ్మ అమ్మవారిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు బీఆర్ఎస్ శామీర్ పేట మండల అధ్యక్షులు సరసం మోహన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు బి నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు వంగ వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తోంది

- కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్
- నాగారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-కీసర

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనికాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంద కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణలకు చట్టబద్ధత కల్పించిన సందర్భంగా నాగారంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభి షేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి కృషి చేస్తున్నదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్, చెవేళ్ల డిక్లరేషన్ లో భాగంగా బీసీ బిల్లుకు చట్టబద్ధత, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో రేవంత్ రెడ్డి సర్కారు పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల కుమార్, దమ్మాయిగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు ముప్పు రామారావు,వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్ రెడ్డి, కీసర మండల్ అధ్యక్షులు కోళ్ల కృష్ణ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఈగ శ్వేత, నాగారం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, దమ్మైగూడ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మెన్ నరేందర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మకు అజయ్, మేడ్చల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర రాహుల్ యాదవ్, నాగారం, దమ్మైగూడ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రవణ్ రెడ్డి,అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఓయో



- జీవీఎస్ గ్రాండ్ ఓయో హొటల్‌ను సీజ్ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ డిమాండ్

నవతెలంగాణ-కాప్రా

మైనర్లను నిబంధనలకు విరుద్ధంగా ఓయో హొటల్‌కు అనుమతించి అసాంఘిక కార్యకలాపాలను ప్రేరేపిస్తున్న ఈసీఐఎల్, కమాలనగర్‌లోని జీవీఎస్ గ్రాండ్ ఓయో హొటల్‌ను సీజ్ చేసి, యాజమాన్యం పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం అఖిల భారత యువజన సమాఖ్య మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హొటల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘిస్తూ జీవీఎస్ గ్రాండ్ హొటల్ యాజమాన్యం కాసులకు కక్కుర్తి పడి మైనర్‌లను హొటల్‌లోకి అనుమతించిందని ఆరోపిం చారు. రెండు రోజుల క్రితం సదరు హొటల్‌లో ఇద్దరు మైనర్లను అనుమతించడం, వారిపై లైంగిక వేధింపులు జరగడంతో తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు వారిని రెస్క్యూ చేశారన్నారు. లైంగిక దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారన్నారు. అదే విధంగా ఓయో హొటళ్లలో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా జరుగుతున్నా, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఈ విషయం పై స్పందించి తగు కఠిన చర్యలకు ఆదేశించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా, హైదరాబాద్ వ్యాప్తంగా ఓయో హొటళ్ల పేరిట విచ్చలవిడిగా రెసిడెన్షియల్ ప్రజా జనావాసాల మధ్య పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, వీటికి జీహెచ్ఎంసీ యంత్రాంగం ఏమి అనుమతులు ఇస్తుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల చుట్టు పక్కల ఉన్న ఓయో హొటళ్లను మూసివేయాలని కోరారు. మహిళలు, విద్యార్థినులకు పూర్తి భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందన్నారు. ప్రజా శ్రేయస్సు కోరుకునే సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తక్షణమే ఓయో హొటల్స్‌లో జరుగుతున్న అన్ని రకాల కార్యకలాపాలపై దష్టి సారించి, ముమ్మర విస్తత తనిఖీలు చేపట్టాలని, లేకుంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. భారత జాతీయ మహిళా సమాఖ్య ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షురాలు రజినీ, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి గిరి బాబు, ఉపాధ్యక్షుడు శేఖర్, రవి, కుమార్, సోహైల్, ఏఐఎస్ఎఫ్ నేతలు సతీష్ కుమార్, మహేష్‌ప్రదీప్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల పరిశీలన

నవతెలంగాణ-కాప్రా

మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలనగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ శనివారం పరిశీలించారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేసి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ఆర్గనైజర్ సెక్రెటరీ మురళీకష్ణ, గణేష్, సదానందం గుప్తా, నారాయణ, రాజేశ్వరరావు, రామకృష్ణ, మధు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికను డంపింగ్ యార్డుగా మార్చడంపై నిరసన

- ఎంపీ ఈటల రాజేందర్ సంఘీభావం
- పై అధికారులతో చర్చించి అక్రమ నిర్మాణాలు ఆపుతాం : డిప్యూటీ కమిషనర్



నవతెలంగాణ-అల్వాల్

మచ్చ బొల్లారం హిందూ స్మశాన వాటికను డంపింగ్ యార్డుగా మార్చడం, అక్రమ నిర్మాణాలు చేపట్టడాన్ని నిరసిస్తూ ప్రజలు చేపట్టిన దీక్ష 7వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు ఎంపీ రాజేందర్ సంఘీభావం తెలిపారు. దివంగత సామల వెంకట్ రెడ్డి హిందూ స్మశాన వాటిక కోసం 15 ఎకరాలు, ముస్లిం సోదరుల ఖబర్‌స్థాన్ కోసం 5 ఎకరాలు విరాళంగా ఇచ్చారు. అయితే, ప్రస్తుతం హిందూ స్మశాన వాటికను డంపింగ్ యార్డుగా మార్చి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు ఫిర్యాదు చేయగా ఆయన విచారణ జరిపి డంపింగ్ యార్డు, అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలని, ఇది హిందూ స్మశాన వాటిక అని, ఇక్కడ ఇతర కార్యక్రమాలు చేపట్టకూడదని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి నివేదిక ఇచ్చారు. అయినప్ప టికీ, మచ్చ బొల్లారం డివిజన్‌తో పాటు బోయిన్‌పల్లి, కొంపల్లి, అల్వాల్, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి రోజుకు 350-400 వాహనాల్లో చెత్తను ఇక్కడ డంప్ చేస్తున్నారని తెలుస్తోంది. చెత్తతో పాటు హొటళ్లు, ఆస్పత్రుల వ్యర్థాలను కూడా వేయడంతో ప్రజలు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే స్పందించి అల్వాల్ డిప్యూటీ కమిషనర్‌ను పిలిచి అక్రమ నిర్మాణాలను ఆపాలని సూచించారు. పై అధికారులతో చర్చించి డంపింగ్, అక్రమ నిర్మాణాలను ఆపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు ఉదయ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పడాల సుధాకర్, రాజశేఖర్ రెడ్డి, కవిత పుష్ప, వీరేందర్, దయాసాగర్ రావు, శ్రీనివాసరావు, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకలకు మేయర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-నిజాంపేట్

మహిళా దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌ను నిర్వాహకులు శనివారం ఆహ్వానించారు. నేడు నిజాంపేట్‌లోని సప్తపది గార్డెన్స్‌లో పెద్ద ఎత్తున ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీగా కార్యక్రమాలు ఉంటాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి వైశ్య సంఘం, ఐ.వీ.ఎఫ్ ప్రెసిడెంట్ నవీన్ కుమార్, మేడ్చల్ జిల్లా వైశ్య మహిళా విభాగం ప్రెసిడెంట్ కవిత, సభ్యులు సౌమ్య, మౌనిక, సురేష్, వినయ్ తదితరులున్నారు.

కుత్బుల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ పనులను ప్రారంభించాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శనివారం జరిగిన చర్చలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులపై బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ..... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం 20 ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందన్నారు. దానికి సంబంధించి హెచ్ఎండిఏ పరిధిలో ఉండగా.. ఇప్పటికే జీవో కూడా విడుదల చేయడం జరిగిందని తెలిపారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ పనులను చేపట్టాలి.

చిన్న వర్షానికే రోడ్లపై నిలిచిన వరదనీరు

- నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించే ప్రజా ప్రతినిధుల ఆదేశాలు బేఖాతార్





నవతెలంగాణ-కూకట్‌పల్లి

చిరు వర్షానికే రోడ్లన్నీ జలమయమవుతుండడంతో కాంట్రాక్టర్లు ప్రజా ప్రతినిధుల ఆదేశాలు ఆచరిస్తున్నారా అనే అను మానం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి కురి సిన వర్షానికి కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని, మైత్రి నగర్, ప్రశాంత్ నగర్, సాయి బాబా నగర్ వంటి పలు ప్రాంతా ల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో ప్రతి డివిజన్‌లో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణంపై డివిజన్‌లకు చెందిన ప్రజా ప్రతి నిధులు అధికారులకు, రోడ్డు కాంట్రాక్టర్లకు, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించే ఉంటారు కాదా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి లెవెల్ చూసుకుని రోడ్ల మీద వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకుని రోడ్డు నిర్మాణం చేపట్టాలి అంటూ.. అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తూ ఉంటారు. కానీ వారి ఆదేశాలను కాంట్రాక్టర్లు ఏ స్థాయిలో అనుసరిస్తున్నారు..! చిన్న చిన్న వర్షాలు కురవగానే రోడ్లు జలమయమవడంతో ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. కాబట్టి ప్రజా ప్రతినిధుల ఆదేశాలను అధికారులు, కాంట్రాక్టర్లు ఆచరిస్తున్నారా లేక గాలికొదిలేస్తున్నారా అని గమనించాల్సిన బాధ్యత, ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులపై ఉంది. సరైన పద్ధతిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

రేపు జాబ్‌మేళా

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరే ట్‌లోని జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించను న్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ జాబ్‌మేళా నిర్వహించను న్నట్టు తెలిపారు. అర్హత గల వారు ఎంప్లాయి మెంట్ కోసం (జాబ్ సీకర్) ఆప్షన్‌లో www.employement.telangana.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని ఎంప్లాయిమెంట్ కార్డు పొంద గలరు అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9100014250, 738680924, 986656 5024 నెంబర్లను సంప్రదించగలరు అని తెలిపారు.

జాబ్‌మేళాలో పాల్గొనే కంపెనీ వివరాలు ఇలా..

కంపెనీ పేరు	జాబ్ పోస్టులు	అర్హత	జీతం
హెచ్-1 హెచ్ఆర్	1.సేల్స్ ఎగ్జిక్యూటివ్	పది, ఏదీ డిగ్రీ	రూ.16కె-రూ.18 కె
సొల్యూషన్స్	2.కమిస్ 1,2,3	డిప్లొమా ఇన్	రూ.15కె-రూ.25కె
హెూటల్ మేనేజ్‌మెంట్ ప్రయివేటు లిమిటెడ్	3.టెక్నీషియన్స్	ఐటీఐ ఎలక్ట్రిషన్	రూ.16కె-రూ.19కె

ఇంజినీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్



నవతెలంగాణ-మేడ్చల్

మైసమ్మగూడలో సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు శుక్ర, శనివారం రోజమ్మ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్‌ను ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రతిభ తక్కడేపల్లి 5th చెస్ బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్షిప్ ఇన్ ఇటలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులని ఉదేశించి మాట్లాడుతూ జీవితంలో ఎదైనా సాధించాలి అనుకుంటే ప్రతిరోజు సాధన అవసరమన్నారు. తాను మార్షల్ ఆర్ట్స్ సాధన చేసే సమయంలో నాలుగు సంవత్సరాల నా తల్లిదండ్రులకు తెలియకుండా పట్టుదలతో సాధన చేసి సాధించానని తెలిపారు. అనంతరం అకడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని వివిధ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులను అభినందించారు. చదువుతోపాటు విద్యార్థులకు క్రీడల ఆవశ్యకత, క్రీడల ద్వారా విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అలవాడతాయని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ టివి రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రోజమ్మ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సంవత్సరం 800 మంది విద్యార్థులు వివిధ కాలేజీల నుంచి పాల్గొన్నారు. పోటీలో రన్నర్స్‌ను విన్నర్సును అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వివిధ కళాశాల నుండి వచ్చిన విద్యార్థులను ప్రోత్సహించిన వారి పీడీలను అభినందించారు. ఈ క్రీడల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక పరిపక్వత పెరుగుతుందని తెలిపారు. అనంతరం రన్నర్స్‌కు విన్నర్స్‌కు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ బాలా రెడ్డి, సెక్రటరీ టివి.రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా.ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, పిఆర్ఓ రవి సుధాకర్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ డా.వెంకట నారాయణ, స్వరూప రాణి, రవీంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానలో మెడికల్ ఆఫీసర్ల భర్తీకి ఇంటర్వ్యూ

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోనిబస్తీ దవాఖానల్లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్స్ పోస్టులను కాంట్రాక్ట్ పద్దతిలో భర్తీ చేయుటకు వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరీ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించవచ్చు అని తెలిపారు. ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం కింద మల్టీజోన్-2 పరిధిలో 8 మెడికల్ ఆఫీసర్ల భర్తీకి ఇది వర్తిస్తుందని తెలిపారు. అభ్యర్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసి టీఎస్ మెడికల్ కౌన్సిల్‌లో నమోదు చేసుకుని ఉండాలని తెలిపారు. వయోపరిమితి 18 నుంచి 44 ఏండ్లు ఉండాలనీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీఎస్ (నాక్ క్రీమీ లేయర్)కి 5 ఏండ్లు, ఎక్స్ సర్వీస్ మెన్/ఉమెన్‌కు 5 ఏండ్లు, ఓసీ, బీసీ (నాట్ బిలాంగ్స్ టు నాక్ క్రీమీ లేయర్)కి 3 ఏండ్లు, శారీరక వైకల్యంతో బాధపడేవారికి (సదరం సర్టిఫికెట్) 10 ఏండ్ల వయోపరిమితి సడలింపు వర్తించనుందని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు ఫోటోను జతచేసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయము (DM& HO), Integrated District Offices Complex, 1st Floor, F1 - Anthaipally - 500078 నందు 24.03. 2025 తేదీన ఉదయం 11.00 AM -1.00 PM వరకు వాక్-ఇన్ ఇంటర్వ్యూకి హాజరు కావచ్చు. దరఖాస్తు ఫారం, ఇతర సమాచారం కోసం https://medchal-malkajgiri. telangana.gov.in వెబ్‌సైట్ సందర్శించగలరు.

కీర్తనను పరామర్శించిన ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యుత్ షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కీర్తనను, కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ శని వారం పరామర్శించారు. మూడు రోజుల క్రితం జనసేన నాయకుడు బండారి వెంకటేష్ కుమార్తె కీర్తన కరెంటు షాక్ వలన చికిత్స పొందుతున్న విషయము తెలుసు కొన్న ప్రేమ కుమార్ వెంకటేష్ నివాసమునకు వెళ్లి కీర్తన కుటుంబ సభ్యులకు మనోధైర్యమును తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కలికినీడి ప్రసాద్, నాగేశ్వరరావు (నాగు) పులగం సుబ్బు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ





నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు చేతుల మీదుగా, కూకట్‌పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయినపల్లి డివిజన్‌కు చెందిన ఎండీ.ఇర్ఫాన్ (తండ్రి లేట్ మెహబూబ్) ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు అయిన రూపాయలు డెబ్బై ఐదు వేల చెక్కును అందజేశారు.

ఆంజనేయ స్వామి విగ్రహానికి మర్యాద వారి విరాళం..

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆంజనేయ స్వామి వారి విగ్రహం కోసం, కూకట్‌పల్లి వాస్తవ్యులు మర్యాద అశోక్ రమాదేవి దంపతులు, లక్ష రూపాయలు విరాళాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మెన్ తులసి రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులు ప్రారంభం



నవతెలంగాణ-నిజాంపేట్

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లో గత కొంతకాలంగా అపరిష్కృతంగా మిగిలిన డ్రయినేజీ పనులను ఎట్టకేలకు అధికారులు ప్రారంభించారు. కొన్ని నెలలుగా స్థానిక 6,7 బ్లాకుల నుంచి వైయస్సార్ బొమ్మ తెలుగు తల్లి విగ్రహం వరకు డ్రయినేజీ లైన్లు పొంగి పొరలడంతో స్థానిక ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉండేది. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు రామచంద్రనాయక్, నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకు వెళ్లారు. ఆయన అధికారులతో మాట్లాడి పనులను చేపట్టేటట్టు చేశారు. గత సంవత్సరం జూన్ మాసంలో అనుమతి పొందిన రోడ్డు, డ్రయినేజీ పనులను కూడా గత కార్పొరేషన్ కార్పొరేటర్లు నిర్లక్ష్యంగా పనిచేయకుండా వదిలేసినట్టు స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు కాలనీలో భూగర్భ డ్రయినేజీ పనులు, సీసీ రోడ్డు పనులు చేపట్టడం తో బస్తీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డ్రయినేజీ సమస్య పరిష్కారమే లక్ష్యంగా..



- పీఏసీ చైర్మెన్ అరెకెపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

భూగర్భ డ్రయినేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నమని పీఏసీ చైర్మెన్ అరికెపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని, మొగులమ్మ బస్తీ కాలనీలో రూ. 35 లక్షల అంచనా వ్యయంతో, నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రయినేజీ పైప్ లైన్ నిర్మాణ పనులకు, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, జలమండలి అధికారులతో కలిసి, ముఖ్యఅతిథిగా పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పలు కాలనీలలో ప్రజల నుంచి వచ్చిన వినతులు మా కార్పొరేటర్లు, మా దృష్టికి తీసుకువచ్చారన్నారు. సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో, శనివారం మొగులమ్మ బస్తీ కాలనీలో శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని తెలియ చేశారు. ఏ చిన్న సమస్య అయినా తన దృష్టికి తీసుకు వస్తే తప్పకుండా పరిష్కరిస్తామని తెలిపారు. ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే తన ప్రథమ లక్ష్యం అని తెలిపారు ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ ఝాన్సీ, నాయకులు కార్యకర్తలు, కాలనీ వాసులు, తదితరులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భద్రత సంరక్షణలో సెక్యూరిటీ గార్డుల విధులు భేష్..


- సీఐ. నరసింహ రాజు



నవతెలంగాణ-బాలానగర్

భద్రత సంరక్షణలో సెక్యూరిటీ గార్డుల విధులు భేష్ అని సీఐ. నరసింహ రాజు అన్నారు. బాలానగర్‌లోని ఎస్ఎంఆర్ వినయ్ క్యాపిటల్ భవనంలో యాక్షన్ గ్రూప్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనరేట్ బాలానగర్ పోలీస్ స్టేషన్ వ్యక్తులు, ఆస్తుల సంరక్షణ కోసం చేపట్టేటువంటి భద్రతాపరమైన చర్యలు చేపట్టడాన్నే సెక్యూరిటీ గార్డ్ అనే పదానికి అర్థం వస్తుందని తెలిపారు. భద్రతాపరమైన విషయాల్లో అన్ని హంగులలో శిక్షణ పొందుతూ సంస్థలకు చేస్తున్న సేవల ద్వారా యాక్షన్ గ్రూప్ మరింత ముందుకు సాగాలని వారిని అభినందించారు. పోలీసులకు సెక్యూరిటీ గార్డ్ వ్యవస్థకు చాలా దగ్గరి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు, ఫేక్ న్యూడ్ వీడియో కాల్స్, పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. డ్రగ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా యాక్షన్ ఫోర్స్ సెక్యూరిటీ సంస్థ చైర్మెన్ సుభానీ అబ్దుల్ మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డులు గానే ఉద్యోగాలు కాదు సెక్యూరిటీ గార్డుల పైన ఉన్నత ఉద్యోగాలు సైతం ఉన్నాయని, లక్షల్లో జీతాలు అందివ్వడం జరుగుతుందన్నారు. ఫైర్ సేఫ్టీ యంత్రాలను ఎలా వాడాలో తప్పకుండా శిక్షణ తీసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రాత్రి వేళలో విధుల నిర్వహణలో సెక్యూరిటీ గార్డులు నిద్ర పోకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఫోర్స్ సెక్యూరిటీ సంస్థ డైరెక్టర్ అబ్దుల్ యూసుఫ్, బాలానగర్ ఎస్సై మహమ్మద్ హాజీ మియా, సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జలమండలి అధికారులను సత్కరించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా.. ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ డివిజన్ పరిధిలోని, జల మండలి కార్యాలయంలో ఉన్న అధికారులు జి.ఎం ప్రభాకర్, డి.జి.ఎం నాగప్రియ, మేనేజర్ ఝాన్సీ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌లను శాలు వాతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మంచి నీటిని వృధా పోకుండా కాపాడుకోవాలని తెలిపారు. అవసరమైతే ప్రతి బస్తీలోని ఇంటింటికి వెళ్లి నీటిని వృధా చేయకుండా, ప్రజల్లో అవగాహన తీసుకు వస్తామన్నారు. అలాగే ప్రతి బస్తీలోను ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని, వర్షపు నీటిని వృధా అవ్వకుండా చూడాలన్నారు. ప్రతి ఇంటికి నిత్యం మంచి నీటి సరఫరా అందిస్తున్న అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, జిల్లా గణేష్, షౌకత్ అలీ మున్నా, యాదగిరి, జల మండలి సిబ్బంది తదితరులు ఉన్నారు.

మంత్రికి వినతి పత్రం అందజేత..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కొరకై రూ.10 కోట్ల నిధులు మంజూరు చెయ్యాలని మంత్రికి వినతి పత్రం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అందజేశారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో చాలా కాలనీలు అండర్ గ్రౌండ్ డ్రయినేజీ , సీసీ రోడ్డు సమస్యలతో సతమతమౌతున్నమని కొంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్‌లు మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుని కలిశారు. కొంపల్లి మున్సిపాలిటీలో పీఎంఆర్ ఎంక్లేవ్ నుంచి పామ్ మీడోస్ వరకు, శాంతినగర్ కాలనీ వయ ఆపర్ణ పామ్ గ్రోవ్ సెప్టిక్ ట్యాంక్ వరకు అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, మైకసా స్టెర్లింగ్ రోడ్డు నుంచి అవని గార్డెన్స్ రోడ్డు వరకు మరియు నోములస్ నిర్వన నుంచి ఆపర్ణ పామ్ డ్రయినేజీ లైన్, జయాభేరి కాలనీలో ఓల్డ్ గోడౌన్ రోడ్డు నుంచి సెంట్రల్ పార్క్ వరకు డ్రయినేజీ లైన్, సీసీ రోడ్లు, ఊరచెరువు సుందరికరణ అభివృద్ధి పనుల కోసం రూ.10 కోట్ల నిధులు వెంటనే మంజూరు చెయ్యాలని కోరారు. మంత్రి స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల ప్రాముఖ్యత విలువైనది



- ఎస్‌పీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఇంకుడు గుంతల ప్రాధాన్యత ఎంతో విలువైందని ప్రతి ఒక్కరు నీటిబొట్టును ఆదా చేయాలని ఎస్.పి.ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి చిత్తరమ్మ దేవి నగర్‌లో ట్రస్టు ఆధ్వర్యంలో 10 ఇంకుడు గుంతలకు స్థానికులతో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన ప్రతి నీటి బొట్టును ఆదా చేసి రేపటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని తెలిపారు. సమస్త జీవకోటికి నీరే ప్రాణదార అని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరు ఇంటి ముందు ఇంకుడు గుంత తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని జగద్గిరిగుట్ట, సూరారం, గండి మైసమ్మనిజాంపేట, ప్రగతి నగర్ ప్రాంతాలలో 1200 ఫీట్ల బోర్లు వేసిన నీరు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన పూర్వీకులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేటప్పుడు నీరు కావాలంటే రెండు అడుగులు తవ్వి నీటిని ఉపయోగించుకునే వారిని ప్రస్తుతం మానవుని నిర్లక్ష్యంతో నేడు పాతాళానికి పోయాయని అన్నారు. ప్రతి నీటి బొట్టు ఒడిసి పట్టు అని నివాసులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఆమోదించడం హర్షణీయం



- కుత్బుల్లాపూర్ ముదిరాజ్ యువజన కమిటీ అధ్యక్షులు ఉదయ్ గంజి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదించడం హర్షణీయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ముదిరాజ్ యువజన కమిటీ అధ్యక్షులు ఉదయ్ గంజి తోపాటు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం బీసీల మొదటి పోరాట విజయం అని ఆయన అన్నారు. శనివారం చింతల్ డివిజన్ పరిధి హెచ్ఎంటీ కాలనీలోని నల్ల పోచమ్మ ఆలయ ఆవరణలో ముదిరాజ్ యువజన కమిటీ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో కమిటీల నిర్మాణం, పోరాటయోధుడు పండుగ సాయన్న ముదిరాజ్, జాతిపిత కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్‌ల విగ్రహాల ఆవిష్కరణ, ముదిరాజుల కమిటీ హాల్, భవన నిర్మాణం కోసం యూత్ కమిటీలో చర్చించారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు రామకృష్ణ ముదిరాజ్, కమిటీ ప్రతినిధులు ఆంజనేయులు ముదిరాజ్, వేణు ముదిరాజ్, మధు ముదిరాజ్, కోట సందీప్ ముదిరాజ్, పొల్కం విగ్నేష్ ముదిరాజ్, ప్రదీప్ ముదిరాజ్, శరత్ ముదిరాజ్,మన్నే అరవింద్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో పని చేస్తుంది. కావున ప్రభుత్వ భూమిని కాపాడి కార్యాలయం కోసం ఉపయోగించాలని ఆకుల సతీష్ అన్నారు. కుత్బుల్లాపూర్ మండలంలో సర్వే నం.251లో అక్రమ నిర్మాణాల గురించి కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్, అరుణ్ రావు, చందు తదితరులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సర్వే నం. 251 ప్రభుత్వ భూమి కాగా, ఇటీవలి కాలంలో రెండు గదులు నిర్మించబడి నట్టు సమాచారం. ఈ నిర్మాణాలు సర్వే నం.251లో జరిగాయా లేక 250లోనివ అన్నది స్పష్టత లేకపోవడంతో, సంబంధిత అధికారులకు స్థల సర్వే చేసి, హద్దులు నిర్ణయించి, 35 గుంటల ప్రభుత్వ భూమి కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై అధికారులు స్పందించి, సర్వే నం.251లో సమగ్ర సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూమిని గుర్తించనున్నట్టు హామీ ఇచ్చారన్నారు.

ఆస్తులు సీజ్ చేసే వరకు నిర్లక్ష్యం చేయకండి

- డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రజలందరూ ప్రభుత్వం ఇచ్చిన వన్ టైం సెటిల్మెంట్ స్కీంను వాడుకోవాలని, సకాలంలో పెండింగ్ ప్రాపర్టీ టాక్స్ చెల్లించాలని, ఆస్తులు సీజ్ చేసే వరకు నిర్లక్ష్యం చేయవద్దని, సకాలంలో ప్రాపర్టీ టాక్స్ డ్యూస్ చెల్లించని డిఫాల్టర్స్ యొక్క ప్రాపర్టీ సీజ్ చేయబడుతుందని యూసుఫ్ గూడా జీహెచ్ఎంసీ సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా ఆస్తి పన్ను చెల్లించే వారికి అవకాశం ఇవ్వబడిందని తెలియజేశారు.

మంచినీటి కేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహమత్ నగర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో స్వరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచి నీటి కేంద్రాన్ని, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో అనేకమంది దాతలు ముందుకు వచ్చి మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వరం ఫౌండేషన్ ఇన్‌చార్జి స్వాతి, ప్రభుత్వం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

నీరు వృథా కాకుండా చూసుకోవాలి

- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

భవిష్యత్తులో నీటి సమస్యలను ఎదుర్కొనడంలో అందరిదీ బాధ్యత ఉందని, నీటి సద్వినియోగం, దాని వృథా కాకుండా చూసుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. మన దైనందిన జీవితాల్లో నీటి విలువను గుర్తించి, దాన్ని రక్షించడంలో భాగస్వాములమవుదాం అని ప్రజలను కోరారు. నగరంలోని నీటి రీసైక్లింగ్ పథకాలు, వర్షపు నీటి నిల్వలు, నీటి పొదుపు చర్యల గురించి వివరించారు. ఇప్పటికే అమలు చేస్తున్న ప్రాజెక్టులు, వాటి ప్రాధాన్యత, ప్రజల భాగస్వామ్యంతో అవి మరింత విజయవంతం అవుతాయని ఆమె చెప్పారు. రేన్ వాటర్ హార్వెస్టింగ్ పద్ధతులను ప్రోత్సహించాలి. ప్రభుత్వం చేపట్టిన పథకాల కోసం సహకరించాల్సిందిగా, భవిష్యత్తు తరాల కోసం నీటి రక్షణ బాధ్యతగా భావించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గేట్‌లో 'జి.నారాయణమ్మ' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



జి. శివ తేజస్విని

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జీ.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జీఎన్ఐటీఎస్)లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఆరుగురు చివరి సంవత్సరం విద్యార్థులు గేట్ 2025 పరీక్షలో అద్భుతమైన అఖిల భారత ర్యాంకులను (ఏఐఆర్) సాధించి తమ విద్యా ప్రతిభను ప్రదర్శించారు. వారిలో జి. శివ తేజస్విని 506 వ ర్యాంకుతో అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచారు, ఇది సంస్థకు గర్వకారణంగా మారింది. ఇతర విజయవంతమైన విద్యార్థులు కసం అనూహ్య AIR3103, చేతన లహరి పాలూరు (AIR5105), గోపు సత్విక (AIR 8050), అనిమల్ల అలేఖ్య (AIR 9109), లిఖిత రెడ్డి (AIR9109)గా ఉన్నారు. మార్చి 19న విడుదలైన ఫలితాలు ఈ విద్యార్థుల కృషిని, అంకితభావాన్ని, జీఎన్ఐటీఎస్ నిర్వహిస్తున్న ఉన్నత విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తున్నాయి. కళాశాల అధ్యాపకులు మరియు నిర్వహణ మండలి, ఈ ఆరుగురు విద్యార్థులను హృదయ పూర్వకంగా అభినందిస్తూ, వారి భవిష్యత్ విద్యా మరియు వృత్తి లక్ష్యాలలో విజయం సాధించాలని కోరుకున్నారు.

ఘనంగా ముగిసిన డుసీమస్ 2025



నవతెలంగాణ-ఓయూ

ఓయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా విద్యార్థుల ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న డుసీమస్ 2025 ముగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో ఘనంగా విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజాయ్ పాల్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్, అడ్వొకేట్ జనరల్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఎ. సుదర్శన్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా ఆడిషినల్ అడ్వొకేట్ జనరల్ ఫర్ ధ స్టేట్ ఆఫ్ తెలుగు మొహ్మద్ ఇమ్రాన్ ఖాన్‌లు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఓయూ న్యాయ విద్యార్థులు నేడు దేశంలో వివిధ న్యాయ పరమైన సేవాలు అందజేస్తున్నారు. ఇక్కడ విద్యాను అభ్యసిస్తున్న, అభ్యశించిన విద్యార్థులు ఎన్నో రంగాల్లో రాణిస్తున్నట్టు చెప్పారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ. పూర్వ విద్యార్థి రామచందర్ రావు, న్యాయ కళాశాల ప్రొపెసర్స్ ప్రొ. జిబి.రెడ్డి , ప్రొ. వెంకటేశ్వర్లు, ప్రొ. రాం ప్రసాద్, ప్రొ. విజయ లక్ష్మీ ప్రొ. రాధిక, ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు.

డిలిమిటేషన్ అన్ని రాష్ట్రాల సమ్మతితో జరగాలి

- ఏఐసీసీ సభ్యులు డా. కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

డిలిమిటేషన్ కారణంగా రాష్ట్రాల మధ్య ఆర్థిక, రాజకీయ అసమానతకి దారితీస్తుందని, పునర్విభజనతో పార్లమెంటు సీట్లు దక్షిణానికి తగ్గి, దీని కారణంగా కేంద్రం నుంచి వచ్చే వనరులు కూడా తగ్గుతాయని కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి డా.కోట నీలిమ అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆహ్వానం మేరకు శనివారం చెన్నైలో సంయుక్త కార్యాచరణ సంఘం (జేఏసీ) తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తమిళనాడుతో పాటు తెలంగాణ, కేరళ, ఒడిసా, పంజాబ్, కర్ణాటక, ఢిల్లీకి చెందిన 20కి పైగా పార్టీలు సమావేశంలో పాల్గొన్నాయి. సున్నితమైన ఈ సమస్యను న్యాయపరంగా, రాజకీయంగా పరిష్కరించాలని, పార్లమెంటు సీట్ల సంఖ్యను తగ్గించడాన్ని తాము ఒప్పుకోబోమని వక్తలు తీర్మానించారు. 2026 తర్వాత డిలిమిటేషన్ ఉంటుందని మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. 1972లో డిలిమిటేషన్ చేసిన అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ వాటిని పెంచకుండానే, డిలిమిటేషన్ చేపట్టారని గుర్తుచేశారు. ఇదే పంథాను మాజీ ప్రధానమంత్రి వాజ్ పేయి కూడా అనుసరించారని పేర్కొన్నారు. ఆర్థిక అసమానత విషయంలో కేంద్రానికి, తెలంగాణ ఒక్కరూపాయి పన్ను చెల్లిస్తే దాని బదులుగా కేవలం నలభైరెండు పైసలే తిరిగివస్తోందని అలాగే దక్షిణాది మిగతా రాష్ట్రాల్లోనూ అదే వివక్ష ఉందనీ అన్నారు. అయితే, ఉత్తర రాష్ట్రాలకు మాత్రం రెంట్టింపు లేదా ఆపైన తిరుగు రొఖం ఇస్తున్నట్లు డా.నీలిమ అన్నారు. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం కాదా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశంలో ప్రశ్నించడాన్ని డా.నీలిమ సమర్ధించారు. మొత్తంగా, డిలిమిటేషన్ కారణంగా పలురాష్ట్రాల్లో సీట్లసంఖ్య పెరగడం, తగ్గడం జరుగుతోందని కేంద్రం గుర్తుంచుకోవాలని డా.నీలిమ పేర్కొన్నారు.

డివిజన్‌లోని అన్ని సమస్యలు పరిష్కరిస్తా..



- కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గ, రహమత్‌నగర్‌లో హౌసింగ్ సొసైటీ వారితో శనివారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తన కార్యాలయంలో సమావేశం అయ్యారు. బస్తీలో నెలకొన్న వివిధ అంశాలపై చర్చించారు. ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకోని వెళ్లి పరిష్కరిస్తామని కార్పొరేటర్ హౌసింగ్ సొసైటీ వారికి హామీ ఇచ్చారు. అనంతరం కార్పొరేటర్‌కి సొసైటీ సభ్యులు సన్మానం చేశారు.

నగరాభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేద్దాం

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- స్టాండింగ్ కమిటీకి నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానించిన మేయర్, కమిషనర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజోపయోగ మైన నిర్ణయాలు తీసుకుని నగర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేద్దామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్టాండింగ్ కమిటీ సభ్యులను కోరారు. శనివారం సాయంత్రం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన స్టాండింగ్ కమిటి సభ్యులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి అభినందనలు తెలుపుతూ సభ్యులందరిని శాలువలతో సన్మానించారు. అనంతరం అధికారులు, స్టాండింగ్ కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. స్టాండింగ్ కమిటికి అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. స్టాండింగ్ కమిటీ పాలసీ నిర్ణయాల కమిటీ అని, నిర్మాణాత్మక, ప్రజోపయోగ మైన నిర్ణయాలు తీసుకుని నగర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో కమిటీ సమావేశాలను నిర్వహించుకుని అన్ని అంశాలను సమగ్రంగా చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని అన్నారు. స్టాండింగ్ కమిటీ నిబంధనల గురించి సభ్యులకు వివరించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా రాష్ట ప్రభుత్వం జీహెచ్ఎంసీకి పెద్దయెత్తున నిధులను మంజూరు చేస్తున్నదని, హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా అభివద్ది చేయుటకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకు రాష్ట ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, మహాలక్ష్మి రమన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, సీ.ఎన్.రెడ్డి, వి.జగదీశ్వర్ గౌడ్, బురుగడ్డ పుష్ప నగేష్ పాల్గొన్నారు. అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, వేణుగోపాల్, పంకజ, గీతా రాధిక, రఘుప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు, సుభద్ర దేవి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, సీసీపీ శ్రీనివాస్, సి.ఇ రత్నాకర్, చీఫ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ ఉమా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం...

- భూగర్భ జలాలను కాపాడుకుందాం
- హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నీటిని పొదుపుగా వాడుకుందామని, భూగర్భ జలాలను కాపాడుకుందామని హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం నేపథ్యంలో మనందరం నీటి గురించి మాట్లాడుకోవాల్సిన అవసరముందున్నారు. అందరం ఒక సంకల్పం తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. నీటిని పొదుపుగా వాడుకుందాం వచ్చే తరాలకు అవకాశమిద్దామని తెలిపారు. అనవసరంగా నీటిని దుర్వినియోగం చేయొద్దన్నారు. గ్రౌండ్ వాటర్ పడిపోతున్న సందర్భంగా గ్రౌండ్ వాటర్ కాపాడుకునే ప్రయత్నాలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తీసుకుంటున్న కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలన్నారు. రాష్ట వ్యాప్తంగా నీటిని ప్రతి చుక్కను పొదుపు చేసుకుంటూ కాపాడుకోవాలన్నారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అందరూ స్ఫూర్తిదాయక కార్యక్రమాలు నిర్వహించారలని, ముఖ్యంగా నీటిని పొదుపు చేసే చర్యలు తీసుకోవాలని, ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మనం ఒక సంకల్పం తీసుకొని ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర అభివృద్ధిపై రాష్ట ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం బంజారాహిల్స్ డివిజన్ ఎమ్మెల్యే కాలనీలో రూ. 1.71 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ప్లాట్ నెం. 160/ఎ నుంచి ఒమెగా ఆస్పత్రి వరకు రూ. 1.21 కోట్ల వ్యయంతో మురుగు నీటి పైప్ లైన్‌ను పున:నిర్మాణం, రూ. 22లక్షల వ్యయంతో ఎమ్మెల్యే కాలనీ గల జీహెచ్ఎంసీ పార్కు నుంచి ఎమ్మెల్యే కాలనీ రోడ్ 12 వరకు మురుగు నీటి లీకేజీ, ఓవర్ ఫ్లో నివారణకు ప్రధాన సీవరేజ్ పైప్ లైన్ ఏర్పాటుకు, రూ. 28 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే కాలనీ ఫ్లాట్ నెం 11మా నుండి 2బి వరకు మురుగు నీరు నిల్వకుండా సీవరేజ్ స్థానంలో 300 ఎం.ఎం ఆర్.సి.సి ఎన్.పి.ఎస్ శివరేజ్ లైన్ వేయుటకు మేయర్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మురునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మురునీటి నిల్వలు, ఓవర్ ఫ్లో, లీకేజీల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన మురుగునీటి వ్యవస్థ అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీ.ఎం హరిశంకర్, మేనేజర్ రాంబాబు, జీహెచ్ఎంసీ ఈఈ విజయ్ కుమార్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

యువత కోసం గాయత్రి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన క్లాసీ క్లోసెట్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌ను శనివారం మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసిన వెరైటీ డ్రెస్సులు, జ్యూవెల్లరీ, హోం మేడ్ వంటకాలు, ఆర్గానిక్ కూరగాయలు, పండ్లతో 66 స్టాల్స్‌ను అన్నింటిని ఆయన తిరిగి పరిశీలించారు. అనంతరం స్టాల్స్ నిర్వాహకులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీలో ప్రత్యేక ఆకర్షణగా కనిపించాలనే ఆలోచనతో యువతీయువకులు ఉన్నారని పేర్కొన్నారు. డ్రెస్సులు, జ్యూవెల్లరీ, చెప్పులు, షూస్ వంటివి కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరుస్తారని తెలిపారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్‌లో తమకు కావాల్సిన ఫ్యాషన్‌కు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసే వారి సంఖ్య భారీగా పెరిగిందని చెప్పారు. అన్ని రకాల ఫ్యాషన్ ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులో ఉండే విధంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసిన నిహారిక, వినీషాలను తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు.

డా. సుబ్రహ్మణ్యంకు సర్వీస్ అబోవ్ సెల్ఫ్ అవార్డు



నవతెలంగాణ-బంజారాహిల్స్

పాలియేటివ్ కేర్ రంగంలో అవిశ్రాంత కృషికి గుర్తింపుగా, రోటరీ ఇంటర్నేషనల్ అత్యున్నత 'సర్వీస్ అబోవ్ సెల్ఫ్ అవార్డు'ను బంజారాహిల్స్ రోటరీ క్లబ్ వారు ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ చేతుల మీదుగా వైద్యులు సుబ్రహ్మణ్యంకు ప్రదానం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఈ పురస్కారాన్ని 150 వ్యక్తులకు మాత్రమే ఇవ్వబడుతుందని రోటరీ క్లబ్ వారు అన్నారు. ఈ రంగంలో వారి వారి కృషి ఆదర్శప్రాయమైన మానవతా సేవా 'సర్వీస్ అబోవ్ సెల్ఫ్' అనే నినాదానికి అంకితభావాన్ని గుర్తిస్తుంది. రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌తో అనుబంధించబడిన అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, హైదరాబాద్‌లో ఒక ప్రత్యేక పాలియేటివ్ కేర్ సెంటర్ అయిన స్పార్ష్ హాస్పిస్‌ను స్థాపించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అతని నిబద్ధత మరియు నిస్వార్థ సేవ స్పార్ష్ హాస్పిస్‌ను లెక్కలేనన్ని కుటుంబాలకు ఆశాకిరణంగా మార్చాయి. రోటరీ క్లబ్, తన కృషికి నిదర్శనంగా సమాజానికి ఆయన చేసిన అత్యుత్తమ సహకారాన్ని గుర్తింపుగా ఇవ్వటం పట్లసుబ్రహ్మణ్యం తన బాధ్యత మరింత పెరిగిందని హర్షం వ్యక్తం చేశారు.

రెక్టల్ క్యాన్సర్‌పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు





నవతెలంగాణ-బంజారాహిల్స్

రెక్టల్ క్యాన్సర్ అంటే పెద్ద పేగు చివరి భాగంలో ఉండే రెక్టంకు ఏర్పడే క్యాన్సర్‌కు సంబంధించినది. ఆధునిక చికిత్స పద్ధతులపై బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లోని రేడియేషన్ ఆంకాలజీ విభాగం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని శనివారం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలోని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో రెక్టల్ క్యాన్సర్ ‌‌కు సంబంధించిన అంశాలతో పాటూ ఈ క్యాన్సర్ చికిత్సకై ఇటీవల అందుబాటులోనికి వచ్చిన టీయన్‌టీ థెరపీపై BIACH&RI వైద్యులు అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ సీఈఓ డా.కె సీఈఓ కృష్ణయ్య, అసోసియేట్ డైరెక్టర్ అకడమిక్స్ కల్పనా రఘునాథ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. సందర్భంగా డా.కృష్ణయ్య మాట్లాడుతూ.. గత 25 ఏండ్లుగా హాస్పిటల్ ఆర్జించిన విజ్ఞాన సంపదను ఇతరులతో పంచుకోవడమనే కార్యక్రమాన్ని BIACH&RI నిరంతరాయంగా కొనసాగిస్తోందని తెలిపారు. తద్వారా క్యాన్సర్‌కు సంబంధించిన అంశాలపై వైద్యులకు అవగాహన కలిపించడమే కాకుండా త్వరితగతిన వ్యాధిని మొదట్లోనే గుర్తించే సామర్థ్యాన్ని వైద్యులు కలిగి ఉంటారని అన్నారు. బసవతారకం ఇండో అమెరికన క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డా హీనా కౌశర్, డా అరవింద్, డా మాధురి, డా కృష్ణ మోహన్ డా.రంజిత్‌లు వివిధ అంశాలపై ప్రసంగించారు. చివరగా హాస్పిటల్ వైద్య బృందం నిర్వహించిన ప్యానల్ డిస్కషన్‌లో కార్యక్రమానికి హాజరైన వారు అడిగిన పలు ప్రశ్నలకు, లేవనెత్తిన సందేహాలకు నిపుణులైన రేడియేషన్ అంకాలజీ వైద్యులు సమాధానమిచ్చారు.

ఈ కార్యక్రమాలలో ఏండీ,డా.టియస్ రావు,హెచ్ ఓ డి, డా.జి.దిలీప్ కుమార్, BIACH&RI లతో పాటూ హాస్పిటల్ వైద్యులు, తెలంగాణా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామి వారికి వస్త్రాలను సమర్పించడం ఎంతో సంతోషం



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

సీతారాముల వారి కళ్యాణం సందర్భంగా ప్రతి ఏడాది వస్త్రాలను సమర్పించడం ఎంతో సంతోషాదాయకమని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను అఖిల భారత చేనేత కళా వైభవం సభ్యులు కలిశారు. వస్త్రాల తయారీ కోసం ఉపయోగించే ధారాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ ధారాలకు సికింద్రాబాద్‌లోని గణేష్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భద్రాచలం తీసుకెళ్లనున్నట్టు వివరించారు. భద్రాచలం ఆలయ ఆవరణలో ఎంతో నిష్ఠతో ఈ నెల 25వ తేదీ నుంచి రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడులకు వస్త్రాలను మగ్గంపై నేయడం జరుగుతుందని వివరించారు. మగ్గంపై నేసిన పోచంపల్లి వస్త్రాలను ఏప్రిల్ 6 వ తేదీన భద్రాచలంలో నిర్వహించే కళ్యాణంలో సీతారాములకు అలంకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ జయరాజ్, సభ్యులు రాపోలు గణేష్, సురేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డిబేట్‌లో బహుమతులు సాధించిన ఓయూ విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

ప్రపంచ జల దినత్సవం సందర్భంగా శనివారం సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో వాటర్ ఫర్ పీస్ అనే అంశంపై డిబేట్ నిర్వహించారు. ప్రతి కాలేజ్ నుంచి ఐదు మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నీటి పరిరక్షణ కోసం అవగాహన కల్పించడానికి ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఓయూ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు పాల్గొని బహుమతులు సాంధించారు. కె. పూజ, సాహితి చేరిపల్లి, తేజస్వి, సిల్వేరు శ్రీవర్షిణి, ప్రవల్లికకు సర్టిఫికెట్‌లతో పాటు బహుమతి పొందారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. రమేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. శ్రీను నాయక్ అభినందించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు పలు పోటీ పరీక్షల్లో పాల్గొని విజయం సాధించలని దానికి తమ తోడ్పాటు ఉంటుందన్నారు.

కోర్టు వివాదం పరిష్కరించి ఆస్తి పన్ను వసూలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

14 ఏండ్లుగా కోర్టు వివాదంలో ఉన్న ఇంటి యజమానితో మాట్లాడి, 40 లక్షలు ఆస్తి పన్నును యూసుఫ్ గూడా జీహెచ్ఎంసీ సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, ఏఎంసీలు బాలరాజ్, కమల్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌లు వసూలు చేశారు.

సర్క్యులర్‌కు వ్యతిరేకంగా ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు



- ఓయూ విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-ఓయూ

ఓయూలో అప్రజాస్వామికంగా ఇచ్చిన సర్కులర్‌ను వెనక్కి తీసుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హామిలు నేరవేర్చమంటే నేడు ఓయూ పరిధిలోని వివిధ హాస్టల్లో విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేరని ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓయూ వీసీ, రిజిస్ట్రార్, పరిపాలన అధికారులు విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి మేము సమ్మతంగా లేమని గత రెండు నెలలుగా విద్యార్థులను కలవడం లేదు, సమస్యలను పరిష్కరించడం లేదు వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ఓయూలో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతూ ఓయూ పరిపాలన భవనం చుట్టూ తిరుగుతూ సమస్యల పరిష్కరించాలని ముఖ్యంగా 2017, 2018 బ్యాచ్ పీహెచ్డీ గడువును పెంచాలని, ఇటీవల విడుదల చేసిన పీహెచ్డీ అడ్మిషన్ల నోటిఫికేషన్‌లో ఖాళీలను పెంచాలని, వికలాంగుల విద్యార్థుల మెస్ సమస్య పరిష్కరించాలని, గ్రంథాలయంలో పరిశుభ్రమైన వాటర్, యూనివర్సిటీ మెస్‌లలో నాణ్యమైన భోజనం పెట్టాలని విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తున్న వారు అన్నారు. ఈ సందర్భంలో ప్రస్తుత వీసీ ప్రొ. కుమార్ సమస్యలు పరిష్కరించకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ ఓయూలో పోలీసు రాజ్యం నడిపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు అత్యధిక నిధులు కేటాయించి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యా అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి కేవలం 7.5శాతం బడ్జెట్‌లో నిధులు కేటాయించి విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని అన్నారు. ఈ సర్కులర్ వెంటనే వెనక్కి తీసుకోవాలని విద్యార్థి సంఘాలుగా గత వారం రోజులుగా శాంతియుతంగా ఓయూ విద్యార్థులను, ప్రొఫెసర్లను, నాన్ టీచింగ్, స్టాఫ్ వర్కర్లను అందరిని ఐక్యం చేస్తూ ఉద్యమాలు నిర్వహిస్తుంటే సర్కులర్ను వెనక్కి తీసుకోకుండా వందల మంది పోలీసులతో ఓయూను పోలీస్ క్యాంపుగా మార్చి హాస్టల్ లోకి వచ్చి, లైబ్రరీలోకి వచ్చి, క్లాస్ రూమ్ తరగతిలోకి వచ్చి ఎక్కడికక్కడ విద్యార్థులను అరెస్టు చేస్తున్నారు. తక్షణమే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి సర్కులర్ వెనక్కి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరే కంగా ఓయూలో విద్యార్థులు కలుపుకొని పోరాటాలు చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శిలు జంగయ్య, బొల్లు నాగరాజు యాదవ్, బీఆర్ఎస్వీ ఓయూ నాయకులు ఏల్సుకొండ రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ ఓయూ సహాయ కార్యదర్శి ఉప్పల ఉదయ్ కుమార్, భగత్, బీఆర్ఎస్వీ ఓయూ నాయకులు సాయి గౌడ్ వున్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే..



నవతెలంగాణ- జూబ్లీహిల్స్/ అమీర్పేట్

సనత్‌నగర్‌లోని డీఎస్ఎం కాలనీలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో, మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింలు ఎంతో పవిత్రంగా గొప్పగా రంజాన్‌ను జరుపుకుంటారని అన్నారు. రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఐక్యతను చాటుతాయని చెప్పారు. ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అదేవిధంగా రంజాన్ మాసం సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఈ ఇఫ్తార్ విందులో రహీం, ఖలీల్, జమీర్, నోమాన్, అబ్రార్, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తలో పేలిన రసాయనాలు.. ఒకరు మృతి..



నవతెలంగాణ-కాప్రా/ చర్లపల్లి

చెత్తలో రసాయనాలు పేలడంతో చెత్త తొలగిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్‌మెట్ డిఫెన్స్ కాలనీ చెందిన లేబర్ సాడక్ నాగరాజు (37) శనివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో కుషాయిగూడ మార్కెట్ వెనుక లైన్ లోని ఒక భవనం వద్ద తన పనిలో భాగంగా చెత్త తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో చెత్తలోని కొన్ని రసాయనాలు పేలి, ఆ వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సబ్ ఇన్‌స్పెక్టర్ సాయిలు తెలిపారు.

ఓయూలో రిబ్బన్లు ధరించి భారత రాజ్యాంగ పీఠిక పఠనం

- వామపక్ష విద్యార్థి సంఘాలు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల భావ ప్రకటన స్వేచ్ఛ, పోరాడే హక్కులను హరిస్తున్న సర్క్యులర్ వ్యతిరేకిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి భారత రాజ్యాంగ పీఠికను పఠనం చేశారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 19(ఏ)ద్వారా భావ ప్రకటన స్వేచ్ఛ హక్కును హామీ ఇచ్చినప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం-యూనివర్సిటీ యాజమాన్యం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్బంధ క్యాంపులుగా మార్చుతుంది. ఇలాంటి సర్క్యులర్‌ను రాష్ట్రంలోని ప్రజలందరూ వ్యతిరేకించాలి. విద్యార్థుల పట్ల నిరంకుశంక వ్యవహరిస్తూ ఎలాంటి అనుమతి లేకుండా వర్సిటీలో ప్రవేశిస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీసుల తీరును, యూనివర్సిటీ పాలనలో వారి జోక్యాన్ని ఖండిస్తు న్నాము. విద్యార్థులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలి. సర్క్యులర్‌ను వెనక్కి తీసుకొని ఎడల అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తాము అంటు హెచ్చరించారు. 23న, ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహి స్తున్నాము. సాయంత్రం ఆర్ట్స్ కళాశాల ముందు ధి లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్ మూవీ ప్రదర్శన ఉంటుంది. దీన్ని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎల్ మూర్తి, ఓయూ అధ్యక్షులు ఉదయ్, ఎఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి సత్య, సహాయ కార్యదర్శి ఉదయ్, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు మహేష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అనిల్, పీడీఎస్‌యూ(వి) రాష్ట్ర కార్యదర్శి విజయ్ పీడీఎస్‌యూ హైదరాబాద్ అధ్యక్షులు మంద నవీన్, కార్యదర్శి శ్రీనివాస్, పీఎస్‌యూ కార్యదర్శి కోట ఆనందరావు, ఓయూ నాయకులు ఆసిఫ్, అజయ్, సతీష్, మౌనిక, జేష్, రవి, జన్నీ, గౌతమ్ పాల్గొన్నారు.

అడిషనల్ డీసీపీకి నివాళులు అర్పించిన సీపీ



నవతెలంగాణ-హయత్ నగర్

రోడ్డు ప్రమాదంలో శనివారం తెల్లవారుజామున అడిషనల్ డీసీపీ టీఎం నందీశ్వర బాబ్జి (56) మృతిచెందారు. రాచకొండ పోలీస్ కమీషనర్ డా సుదీర్ బాబు అంబర్ పేట్ లోని లక్ష్మా రెడ్డి పాలెం వద్ద వున్న ఆయన భౌతిక కాయం వద్దకు వచ్చి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, హయత్ నగర్ ఇన్స్ పెక్టర్ నాగరాజు గౌడ్‌లు వున్నారు.

నిమ్స్ టెండర్ నోటిఫికేషన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్‌లో కొనుగోలుకు టెండర్లను రేట్ కాంట్రాక్టు ద్వారా టెండర్లను ఆహ్వానిస్తోంది. ఇందులో సర్జికల్, జనరల్ ఐటెమ్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు, సివిల్ వర్క్స్ మెటీరియల్, ఇతర వస్తువులు ఉంటాయి. దరఖాస్తులను ఏప్రిల్ 12వ తేది 3గంటల వరకు సమర్పించాల్సి ఉంటుంది. ఆస్పత్రి పాత భవనం మూడో అంతస్తులోని సర్జికల్ స్టోర్స్‌లో దరఖాస్తులు అందించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం ఞఞఞ.అఱఎ.వఉబ.అఅ సందర్శించాల్సి ఉంటుంది.

ఇంకుడు గుంతులు అవసరం

- కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్ డివిజన్‌లో వసంత విహార్ కాలనీలో శనివారం ఇంకుడు గుంతలను పరిశీలించి ఇంకుడు గుంతులు అవసరం అన్నారు. ఇంకుండు గుంతలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి ఇసుక, కంకర, వేసి వర్షపు నీరు, భూగర్భంలోకి వెళ్లేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కార్పొరేటర్ తెలిపారు. రానున్న రోజుల్లో వర్షపు నీరు భూమిలోకి సాఫీగా వెళ్లేందుకు ఇంకుండు గుంతలను నిర్మించుకోవాలని నీటి సంరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. ప్రతి నీటి బిందువు-మన ఆత్మబంధువు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం రజినీకాంత్, ఏఈ శ్రీలత, బీజేపీ నాయకుల సంజయ్ పటేల్, రంగ రవి, హేమంత్ పటేల్, పాల్గొన్నారు.

ఏప్రిల్ 14 లోపు జీవో 317 పై ప్రభుత్వం స్పందించాలి

- జీవో 317 బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయుల జేఏసీ ప్రతినిధులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్రంలోని 317 జీవో బాధిత ఉద్యోగులకు స్థానికత పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని జీవో 317 బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయుల జేఏసీ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. డాక్టర్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14లోపు తమ స్థానికత అంశంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, ఏప్రిల్ 24న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతామని పోస్టర్‌లు ఆవిష్కరిస్తూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 30 ప్రభుత్వ విభాగాల్లోని 10వేల మంది బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో జేఏసీ చైర్మెన్ టి.విజయ్ కుమార్, సెక్రెటరీ జనరల్ నాగేశ్వర్ రావు, కన్వీనర్ పి.మధుసూదన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల సర్దుబాటు పేరిట హడావూడిగా జీవో 317 తెచ్చి తమ జీవితాలను చీకటిమయం చేసిందని వాపోయారు. కాంగ్రెస్ అధికారం లోకొచ్చిన 48 గంటల్లోనే జీవో 317 బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తానని అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కేంద్రానికి లేఖ రాసి కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి సహకారంతో 317 జీవో బాధిత ఉద్యోగులకు రెండు, మూడు నెలల్లోనే న్యాయం చేస్తామని గత ఏడాది డిసెంబర్ 19న శాసనమండలిలో మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి ముందడుగు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న ఆశతో కాంగ్రెస్‌ను గెలిపించామన్నారు. తమ సమస్య పరిష్కారం కాదన్న ఆవేదనతో ఇప్పటికే చాలా మంది బాధిత ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవు తున్నారని, ఈ మధ్యనే మంచిర్యాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకొన్నారని తెలిపారు. తమ బాధలు విన్నవించడానికి సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్ మెంట్ ఇవ్వాలని, తమకు స్థానికత కల్పించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేఏసీ సెక్రెటరీ పి. సందీప్, కోశాధికారి ఎం. వినోద, చాముండేశ్వరి, ఆనంద్ కుమార్, కె.మల్లేశ్, శ్రీనివాస్ రెడ్డి తది తరులు పాల్గొన్నారు.

సిల్వర్ జ్యువెలరీని అందుబాటు ధరల్లో అందించాలి

- సినీ నటి నిధి అగర్వాల్



నవతెలంగాణ-బంజారాహిల్స్

పంజగుట్టలో ఎకాధి, లగ్జరీ సిల్వర్ జ్యువెలరీ బ్రాండ్స్‌నూ శనివారం ఎకాధి బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ నటి నిధి అగర్వాల్ హాజరై ప్రారంభించారు. ఆమె ప్రత్యేకమైన సిల్వర్ జ్యువెలరీ అనుభవన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లగ్జరీ సిల్వర్ జ్యువెలరీను అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో ఎకాధిని స్థాపించడం శుభ పరిణామం అన్నారు.

ఎకాధి ప్రత్యేకత ఏమిటంటే, ఇది అత్యున్నత నాణ్యత గల బంగారు కవలల చేత కళాత్మకంగా తయారు చేయబడిన కలెక్షన్‌ను అందిస్తుందనీ మిగతా వాటికి దీనికి తేడా కేవలం మెటల్‌లో, ఇది బంగారం కాకుండా స్వచ్ఛమైన వెండి, ఈ విధంగా బంగారు నగల సొగసును, నైపుణ్యాన్ని, అందుబాటు ధరలో అందించడమే లక్ష్యంగా ఎకాధి ముందుకు సాగాలని తెలిపారు. ఈ ప్రారంభోత్సవంపై ఎకాధి డైరెక్టర్స్ వేణు రాచకొండ, శివచరణ్ వుప్పలంచిలు దక్షిణ భారతదేశంలోని ప్రతి మహిళకు ప్రీమియం జ్యువెలరీ అందుబాటులోకి తేవడం మా లక్ష్యమని బంగారం ధరలు పెరిగిన నేపథ్యంలో చాలా మంది వధువులు సంప్రదాయ బంగారు నగలను కొనుగోలు చేయడం కష్టంగా భావిస్తున్నరాని ఎకాధిలో అదే నైపుణ్యం, అదే సౌందర్యంతో, మెటల్ మాత్రమే మారిన ప్రీమియం వెండి నగలని అందిస్తున్నట్టు ప్రకటిస్తూ ఇది ప్రతి వధువు కలలను నెరవేర్చుతుందని తెలిపారు.

ఓయూలో ముగిసిన ఆకృతి-2025



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఇంజినీరింగ్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆకృతి - 2025 శనివారం రాత్రి విద్యార్థుల ఫ్లాష్‌మబ్‌తో ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.వేణు ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఇలాంటి సింపోజియలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించే అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులకి తరగతి గది విద్యాతో పాటుగా ఇలాంటి ఈవెంట్స్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. విభాగం హెడ్ ప్రొ.డి.రామకృష్ణ మాట్లాడుతూ.. కార్యక్రమనికి చేయూత ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు ఎంతగానో శ్రమించి ఈ ఈవెంట్‌ను గొప్పగా నిర్వహించరని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ. చంద్రశేఖర్, ఫ్యాకల్టీ అడ్వైజర్ డా.యం.శ్యామ్ సుందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

29న మాంస వ్యర్థాలకు వేలంపాట



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని అన్ని చికెన్, ఇతర మాంస వ్యర్థాల సేకరణకు ఈ నెల 29న బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు పుర కమిషనర్ అమరేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనువారు 20,000 రూపాయల డీడీని 'కమిషనర్ తుర్కయంజాల్ పురపాలక సంఘం' పేరిట చెల్లించి, సంబంధిత పత్రాలను ఈ నెల 28 లోపు సమర్పించాలని కోరారు. కనీస నిర్ణయాక విలువ 5 లక్షల రూపాయలు ఉన్నట్లు తెలిపారు. నిబంధనలకు లోబడి వ్యర్థాలను స్వీకరించి, ప్రాసెసింగ్ పరిశ్రమలకు తరలించాలన్నారు. లేని యెడల వేలం రద్దు చేయబడుతుందని హెచ్చరించారు. వేలం పాటలో పాల్గొనువారు తుర్కయంజాల్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 9966995842, 9014491650 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, పర్యావరణ ఇంజనీర్ హరీష్, జవాన్లు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



నవతెలంగాణ - చంపాపేట్

చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. అనంతరం పిల్లలకు సర్టిఫికేట్స్, మెడల్స్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఏజీయం. సతీష్, ఆర్.ఐ. రవీందర్ రెడ్డి, ప్రైమరీ కో ఆర్డినేటర్ ప్రీతి శ్రీవాత్సవ, ప్రిన్సిపాల్ ఫణిమాధవి, వైస్ ప్రిన్సిపాల్ సుందర్ సింగ్, ప్రీ ప్రైమరీ ఇంచార్జి పద్మాపతి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి




- సీపీఐ(ఎం) బాలాపూర్ మండల కన్వీనర్ శేఖర్ యాదవ్
- కమిషనర్‌కు వినతి అందజేత

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్గుల్ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పక్కన ఉన్న 8వ డివిజన్ వైష్ణవి ఇన్నేవ్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ సరస్వతికి శనివారం బాలాపూర్ మండల సీపీఐ(ఎం) పార్టీ కన్వీనర్ శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీ అడవి ప్రాంతం అని అన్నారు. దీంతో పాములు విపరీతంగా తిరుగుతూ ఇండ్లలోనికి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ విద్యార్థులకు ఆట స్థలాలు, పార్కుల సదుపాయాలు లేక కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించి.. కాలనీ వాసులకు సహకరించాలని కోరారు. వినతి అందజేసిన వారిలో కాలనీవాసులు అధ్యక్షులు వి.వి.ఎస్. నారాయణ, టిఎస్ఎస్.మూర్తి, యు.నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

నీరే జీవనాధారం





నవతెలంగాణ-సిటీబ్యూరో

నీటి సంరక్షణలో చివరి మజిలీ గ్లేసియర్స్‌ను పరిరక్షించుకోవడమేనని ప్రొఫెసర్ పీజీ శాస్త్రి తెలిపారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో శనివారం జరిగిన సమావేశానికి నేషనల్ ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ పూర్వ డైరెక్టర్, రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హెడ్ పీ.జీ.శాస్త్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవ నాగరికత నీటి దగ్గరే మొదలయిందని, పెరుగుతున్న జనాభా, గ్లోబల్ వార్మింగ్ వలన భూమి మీదున్న నీటి వనరులతో పాటుగా శతాబ్దాలుగా ఉన్న హిమానీ పర్వతాలు కూడా క్రమంగా కరిగిపోతున్నాయని, ఇవి కూడా అంతరిస్తే భూమి మీద జీవజాలం ఉండదన్నారు. 1780 నుండి 2015 వరకు గంగోత్రితో పాటుగా గత యాభై సంవత్సరాల్లో కిలిమంజారో, సియాచిన్, గ్రీన్ ల్యాండ్స్, మిలామ్, పిండారీ తదితర హిమానీ పర్వతాలు క్రమంగా ఎలా కరిగిపోతున్నాయో ప్రెసెంటేషన్ ద్వారా శాస్త్రి వివరించారు. ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని పండిట్ నెహ్రూ అన్నారని, ప్రపంచంలో చైనా, అమెరికా తరువాత చిన్న పెద్ద ప్రాజెక్టులన్నీ కలిసి ఇండియాలో 2800 ప్రాజెక్టులుంటే, ప్రపంచంలోని 18 శాతం జనాభా వున్న ఇండియాకు ఈ ప్రాజెక్టుల్లోని నీరు సరిపోవడం లేదన్నారు. ఇనిస్టిట్యూట్ అఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనుపమ మొహంతీ మాట్లాడుతూ స్వచ్ఛమైన నీరు హిమానీ పర్వతాల్లోని అంటార్కిటికా, గ్రీన్లాండ్స్, నార్త్ అమెరికా, ఇండియాలో ఉన్నాయన్నారు. హిమానీ పర్వతాలు కరిగిపోతే ప్రపంచంలో స్వచ్ఛమైన నీరు దొరకదని, సముద్రాలూ ఉప్పొంగుతాయన్నారు. దక్షిణ భారతంలోని చెరువుల్లో వాటి విస్తీర్ణాన్ని బట్టి 25 శాతం నీళ్లు కూడా రావడం లేదని, హైదరాబాద్‌లో ట్యాంకర్లతో నీళ్లు కొనుక్కుంటున్నామన్నారు. భూగర్భ జలాలను విపరీతంగా తోడటం, కాలుష్యం, క్లయిమేట్ చేంజ్ తదితర వాటితో క్వాలిటీ లేని నీళ్లను తాగి రోగాల బారిన పడుతున్నామన్నారు. అనంతరం కృష్ణా రివర్ యాజమాన్య బోర్డు పూర్వ చైర్ పర్సన్ ఏ. పరమేశం మాట్లాడుతూ కృష్ణా నదీ జలాల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్రలకు వాటాలున్నదువలన ఏ రాష్ట్రానికి తగినన్ని నీళ్లు రావడం లేదన్నారు. రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ జంబుల్ రెడ్డి మాట్లాడుతూ షాద్ నగర్ ప్రాంతంలో కొత్త ప్రాజక్టు నిర్మిస్తే హైదరాబాద్‌కు గ్రావిటీ ద్వారా నీళ్లు అందించవచ్చు న్నారు. ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ పూర్వ చైర్మెన్ డాక్టర్ నాగభూషణ రావు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యానికి, భూతాపం పెరగ డానికి, నీటి కొరతకు మనుషుల నిర్లక్ష్యం కారణమన్నారు. ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ పూర్వ ప్రెసిడెంట్ జి.ఎల్. రావు మాట్లాడుతూ నీటి పొదుపుపై కొన్నేళ్ల పాటు పక్కా కార్యాచరణ ప్రణాళిక అమలుచేయాలన్నారు.

ఇంజనీరింగ్ కాలేజ్ అఫ్ డైరెక్టర్ డాక్టర్ జీ.రామేశ్వర్ రావు మాట్లాడుతూ పంచభూతాల్లో భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన వీటిని కాపాడుకోవాల్సిన అవసరం కేవలం మనిషి ద్వారా మాత్రమే సాధ్యమని, యుగాలుగా మనవెంటే వున్న వీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలో స్వచ్ఛమైన నీరు కేవలం హిమాలయ పర్వత ప్రాంతాల్లోని మంచు పర్వతాల్లో మాత్రమే (గ్లేసియర్స్) దాగి వున్నాయి కాబట్టి, ప్రపంచ నీటి దినోత్సవం 2025 థీమ్ "గ్లేసియర్ ప్రిజర్వేషన్" ద్వారా ప్రపంచానికి యునైటెడ్ నేషన్స్ ఒక హెచ్చరికను జారీ చేసిందన్నారు.

మెట్రో వాటర్ బోర్డు డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గత వేసవికాలంలో ఎనిమిదిన్నర లక్షల వాటర్ ట్యాంకర్లను సప్లై చేస్తే.. ఈ ఏడాది వేసవి మొదట్లోనే ఇప్పటికే నాలుగున్నర లక్షల ట్యాంకర్లను రవాణా చేశామన్నారు. హైదరాబాద్ నగరానికి రోజుకు 550 మిలియన్ గ్యాలన్ల నీటిని సప్లై చేస్తున్నామని, విలువైన ఈ మంచి నీటిని ప్రజలు పొదుపుగా వాడుకోవాలన్నారు. ఇంజనీరింగ్ కాలేజ్ అఫ్ ఇండియా వాటర్ రిసోర్స్ డెవలప్ మెంట్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎం. రాజశేఖర్ రెడ్డి, జీ. నరేష్, ఎస్.ఏ. కవితతో పాటుగా అధికారులు శ్రీధర్ బాబు, లక్ష్మి కాంత రావు, డాక్టర్ రాజారావు, ఫాకల్టీ, హెడ్స్ ఆఫ్ ది డిపార్ట్ మెంట్స్ పలు కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్
- సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-చంపాపేట్

బీసీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీసీ కులగణన చేపట్టి, బీసీ రిజర్వేషన్ 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదింపజేయడంతో యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్, కుర్మగూడ డివిజన్ పరిధిలో శనివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యాకుత్పురా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రవిరాజా, హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కోట్ల శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి మామిడి కృష్ణ కుమార్‌లు మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీ బిల్లును ప్రవేశపెట్టి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఆమోదింపజేయడం వలన రాష్ట్రంలో బీసీ కులాల్లో కాంగ్రెస్ పార్టీ వెలుగు నింపిందని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతిగా ముందుకు సాగుతోందని, బీసీల అభివృద్ధియే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని అన్నారు. బీసీ కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్ 29 శాతం నుండి 42 శాతానికి పెంచి బీసీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని కొనియాడారు. బీసీ ప్రధాని అని చెప్పుకునే నరేంద్ర మోడీ.. పార్లమెంటులో కూడా బీసీల రిజర్వేషన్, కుల గణన చేపట్టి రాజ్యాంగంలో తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి అమలు చేయాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న బీసీ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీల హక్కుల కోసం పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నేతలు మహమ్మద్ అబ్దుల్ ఘని, మహమ్మద్ జాహిద్, మహమ్మద్ నజీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ ఖదీర్ ఫిరోజ్, మహమ్మద్ ఇస్మాయిల్, సురేష్ కుమార్ గౌడ్, నేనావత్ శంకర్ నాయక్, దండుగల కృష్ణ, కుర్మగూడ కాంగ్రెస్ పార్టీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, శశి యాదవ్, లడ్డు యాదవ్, మహమ్మద్ అష్రఫ్ హుస్సేన్, దినేష్ కుమార్, కార్తీక్ కుమార్, సయ్యద్ నుమన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నవతెలంగాణ -హయత్ నగర్

గుర్తు తెలియని ఓ వ్యక్తి మృత దేహం లభ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21న హయత్ నగర్‌లోని వినాయక నగర్ కాలనీ వద్ద ఉన్న శ్రీ కృష్ణ స్టీల్ ట్రేడర్స్ ముందు ఓ గుర్తు తెలియని వ్యక్తి (50-56)మృత దేహం లభ్యమైందని తెలిపారు. ఈ వ్యక్తి బ్లూ కలర్ నిక్కర్ ధరించి.. ఆపస్మారక స్థితిలో పడి ఉండగా 108 ద్వారా హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే తుది శ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ఆ వ్యక్తి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి తయారీని తనిఖీలు



నవతెలంగాణ-మలక్‌పేట్

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తుండడంతో టాస్క్‌ఫోర్స్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం తనిఖీలు చేశారు. చాదర్ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జోరుగా అక్రమ కల్తీ వ్యాపారం సాగుతుండటంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. చాదర్ఘాట్ పరిధిలోని రసూల్పుర, వినాయక నగర్ ప్రాంతాలలో కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదుతో ఫుడ్ సేఫ్టీ అధికారి శృతి ఆలేటి ఆధ్వర్యంలో మూసి పరివాహక ప్రాంత నివాసాల్లో దాడులు నిర్వహించారు. మురుగు వాసనతో కుళ్లిపోయిన అల్లం వెల్లుల్లి తయారీని గుర్తించి.. ఆ మొత్తాన్ని మూసిలో పడబోశారు. ఈ తయారీ కేంద్రానికి ఎలాంటి అనుమతులు లేవని అధికారులు తెలియజేశారు. అల్లం, వెల్లుల్లి పేస్టును ఎసిటిక్ యాసిడ్ మిక్స్ చేసి ఎక్కువ రోజులు నిలువ ఉండేటట్లు చేస్తున్నారని, ఇలాంటివి రుచి, వాసన మంచిగా ఉన్నా కడుపులోకి వెళితే విషంతో సమానమని అధికారులు వివరించారు. ఈ కల్తీ వ్యాపార నిర్వాహకులపై టాస్క్ ఫోర్స్ పోలీసులు కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

భూగర్భ జలాలను కాపాడుకుందాం :శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్ పేట్

నీటిని పొదుపుగా వాడి భూగర్భ జలాలను కాపాడుకుందామని హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్ బి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. లార్డ్స్ ఒలింపియాడ్ పాఠశాలలో హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్‌బి సహకారంతో గాయత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటి ప్రాధాన్యతను తెలియజేస్తూ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నీటి ప్రాముఖ్యతను, నీటిని ఉపయోగించే విధానాన్ని స్పష్టంగా విద్యార్థులకు తెలియజేసినట్టు తెలిపారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ సరిత మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. నీటిని వృధా చేయొద్దని వివరించారు. లార్డ్స్ విద్యా సంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మెన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పంచభూతాలలో ముఖ్యం నీరు అని అన్నారు. అందుకే నీటిని పొదుపుగా వాడాలని కోరారు. వర్షం నీటిని వృధా చేయొద్దని విద్యార్థులకు సూచించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో లార్డ్స్ పాఠశాల డైరెక్టర్ సిద్దాల శ్రీలత, గాయత్రీ ఫౌండేషన్ సీఈఓ రవి కుమార్, లార్డ్స్ ఒలింపియాడ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా అదృశ్యం



నవతెలంగాణ-నాగోల్

ఓ మహిళ అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివనాగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన చరణ్ సింగ్ నాగోల్‌లోని సరస్వతి మార్బుల్ షాప్‌లో వాచ్మెన్‌గా చేస్తూ తన భార్య పిల్లలతో కలిసి నాగోల్ డివిజన్ పరిధిలోని మమతా నగర్ రోడ్ నెంబర్ 6లో నివాసం ఉంటున్నాడు. ఇతని భార్య గుటి దేవి.. ఫతుల్లాగూడలోని గీతాంజలి హ్యాండ్లూమ్‌లో పనిచేసేది. కానీ అక్కడ పని లేకపోవడంతో ప్రస్తుతం ఇంట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో ఈ నెల 21న తాను పని చేసిన చోట డబ్బులు వచ్చేది ఉందని చెప్పి ఆమె ఉదయం 9:30 గంటల ప్రాంతంలో వెళ్లింది. కానీ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చరణ్ సింగ్ ఆమె సెల్‌ఫోన్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. మరోసారి తిరిగి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌లో ఉంది. వెంటనే ఆమె పనిచేసే షాపుకు ఫోన్ చేసి కనుక్కోగా అక్కడికి కూడా రాలేదని సమాచారం వచ్చింది. ఆమె ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలలో వెతికినా ఎలాంటి ఫలితం లేకపోయింది. వెంటనే ఆమె భర్త చరణ్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివ నాగ ప్రసాద్ తెలిపారు.

సింగరేణి కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-చంపాపేట్

సింగరేణి కాలనీ సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్ కలెక్టర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా సింగరేణి కాలనీలో మాత్రం మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవన ఉపాధి కోసం వివిధ పల్లెలు, రాష్ట్రాల నుండి ప్రజలు హైదరాబాద్ సింగరేణి కాలనీకి వచ్చి నివాసం ఉంటున్నారని అన్నారు. ఇక్కడ నివస్తున్న ప్రజలను రాజకీయ నాయకులు ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నారని మండిపడ్డారు. పాతబస్తీ కంటే అధ్వానంగా సింగరేణి కాలనీ ఉందని అన్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, అధికారులు స్పందించి సింగరేణి కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతి అందజేసిన వారిలో సేఫ్ ఫౌండేషన్ ఫౌండర్ ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత, శ్రీను నాయక్, తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు మేలు

- ఉపాధి, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు ఎక్కువ
- బీఎంసీ ఎస్సీ డిపార్ట్మెంట్ నూతన చైర్మెన్‌గా బొల్లపల్లి కుమార్
- కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన ఎస్సీ వర్గీకరణతో ఆయా ఉప కులాలకు ఎంతో మేలు జరుగుతుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కేఎల్ఆర్ చేతుల మీదుగా మహేశ్వరం నియోజవర్గం ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మెన్ క్యారగారి శ్రీధర్ అధ్యక్షతన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్సీ డిపార్ట్మెంట్ నూతన చైర్మెన్ బోల్లపల్లి కుమార్‌కు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి దీప భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు అందుగుల సత్యనారాయణ, ఎర్రవాపు ఇజ్రాయిల్, వత్తుల రఘుపతి, బాల్ నింగని జంగయ్య, నియోజకవర్గ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మెన్ వత్తుల నారాయణ, సలహాదారుడు సూర్ణగంటి సుభాష్, మాజీ కార్పొరేటర్ రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, సీనియర్ నాయకులు గట్టు బాలకృష్ణ, భాను ప్రసాద్, సూర్ణగంటి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పూసల బస్తీలో కలుషిత నీరు సరఫరా'



నవతెలంగాణ-చంపాపేట్

సైదాబాద్ డివిజన్ పూసల బస్తీలో కలుషిత నీటి సరఫరా, లో ప్రెషర్‌తో ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల ఫిర్యాదుతో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ శనివారం జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. తర్వాత కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీవాసులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ వెంట జలమండలి మేనేజర్ శ్రవణ కుమార్, ఇన్‌స్పెక్టర్ మనోహర్, లైన్మెన్ ఆనంద్ తదితరులు ఉన్నారు.

ఎలాంటి ఆటంకాలు లేకుండా నీటి సరఫరా చేయాలి

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కాలనీలలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. ప్రెస్ కాలనీలో లో ప్రెషర్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని తెలుసుకున్న కార్పొరేటర్ శనివారం ఆ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో పవర్ బోరుకు వెంటనే మరమ్మతులు చేస్తామని అన్నారు. హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్బీ అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తూ వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నరసింహ, రాజు, రమేష్, భవాని, నాయకులు పాతూరి శ్రీధర్ గౌడ్, కాసాని అశోక్ తదితరులు పాల్గొన్నారు.



నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడ జైపూర్ కాలనీలో గల షిరిడి సాయిబాబా 17వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త కుమారుడు సాయి కిరణ్, కోడలు శార్వరి, ఆలయ కమిటీ చైర్మెన్ కొలను వెంకట్ రెడ్డి, కార్యదర్శి కొరవి జంగయ్య గుప్త, కోశాధికారి రావుల రంజిత్ గౌడ్ , వైస్ చైర్మెన్ వెంకట రమణ గౌడ్, బద్దం మోహన్ రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు రాములు గౌడ్, జగన్ గుప్త, జాయింట్ సెక్రెటరీ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- నాగోల్

ఫలక్‌నూమ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

నవతెలంగాణ-చంపాపేట్

యాకుత్‌పురా నియోజకవర్గం గౌలిపురా డివిజన్ పరిధిలోని పాత పీఎస్ ఛత్రినాక కందికల్ బోయగూడ రోడ్డు ఏవి కె ఎగ్స్ సెంటర్ వద్ద ఫలక్‌నూమ ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫలక్‌నూమ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి.మల్లేశం మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ డ్రైవ్లో ట్రాఫిక్ రద్దీకి ఇబ్బందులు కలిగిస్తున్న లోడ్ బండ్లు, గుడ్స్ ఆటోలపై కేసులను నమోదు చేసి, జరిమానాలను విధించినట్టు తెలిపారు. రోడ్డుపైనే ఇరువైపులా వాహనాలను నిలిపి ట్రాఫిక్ ఇబ్బందులను సష్టిస్తున్నారని, అదే విధంగా పండ్ల బండ్లతో ట్రాఫిక్ ఇబ్బందుల ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. దీనిపై కూడా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ కనిపించకుండా చేసినట్టయితే వాహన యజమానికి మోటర్ వెహికల్ యాక్ట్ 129(2) రూ.2వేలు వరకు జరిమానా లేదా నెల రోజులు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు, యజమానులు ఎట్టి పరిస్థితులలో మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీస్ ఏఎస్ఐ అబ్దుల్ ఖదీర్, రవి, శ్రీకాంత్ రెడ్డి, ఎస్. లక్ష్మి, హనుమాన్ సింగ్, జైపాల్ రెడ్డి, ఫిరోజ్ ఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.



ముగిసిన శారదా లక్ష్మీనరసింహాస్వామి ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ ఓల్డ్ గాయత్రి నగర్ 20వ డివిజన్ పరిధిలోని శారదా లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడవ రోజు ఘనంగా ముగిసాయి. శ్రీమజ్జగద్గురు ఆదిశంకరాచార్య శ్రీశ్రీ స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి ఆధ్వర్యంలో శ్రీ శారదా లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రభోధోత్సవం శ్రీ సూక్త పురుషసుక్త హెూమం, పూర్ణహుతి, ప్రసాద వితరణ పరమ పూజలో మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోదరుడు నర్సింహా రెడ్డి, చల్లా జయచేంద్ర రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి. రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన అర్చకులు దీక్షితులు బాల్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వంటేరు నర్సింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, కిషోర్ రెడ్డి, వెంకటేష్, బి భాస్కర్ రెడ్డి, బి మధుకర్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిండు జాబిలమ్మ లీలమ్మతో శృత బాంధవ్యం



ప్రభుత్వ ఉద్యోగి అయినా తండ్రి వారసత్వాన్ని, నిబద్ధతను, సిద్ధాంతాలను నరనరాల జీర్ణించుకున్న వ్యక్తి లీలమ్మ. తాను ఎక్కడ పని చేస్తున్నా అక్కడి సాహిత్య కారులకు, ఉద్యమ కారులకు బాసటగా నిలిచేవారు. వారికి కష్టం వస్తే ఆశ్రయమిచ్చారు, ఆదుకున్నారు. మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారిగా ఉంటూ వందలమంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉన్నత చదువులు చెప్పించారు. వారికి తనే దగ్గరుండి పెళ్లిళ్లు జరిపించారు. మంచి ఉద్యోగాలు ఇప్పించారు. సామాజిక స్పృహతో, అంకిత భావంతో సేవాతత్పరత, స్నేహ వాత్సల్యాలతో అందరి ప్రేమాభిమాన పాత్రురాలయ్యారు. తన 92 ఏండ్ల వయసులో మార్చి 11వ తేదీన తుదిశ్వాస విడిచిన ఆమె అశేష అభిమానుల గుండెల్లో ఎప్పటికీ చిరంజీవే.

ఆవిడ ఎలా ఉంటారో తెలియదు. కానీ ఆవిడ అభిరుచులు తెలుసు. ఆసక్తులు తెలుసు. అన్వేషణా దృష్టి తెలుసు. సేవానురక్తి తెలుసు. నిండు జాబిల్లిలా చల్లని వెన్నెలలు ప్రసరించిన మంచి మనసు తెలుసు. ఆవిడ పేరు తేలు లీలమ్మ. ఒక రోజు తనే ఫోను చేసి పరిచయం చేసుకున్నారు. 'మీరు రాసిన రామోజీ పుస్తకం మా బంధువు కొండపల్లి పావన్ దగ్గర తీసుకొని ఓపిగ్గా చదివాను. బాగా రాశారు. పుస్తకంలో మీ ఫోన్ నంబర్ ఇచ్చారుగా నోట్ చేసుకున్నాను'. వయసు పైబడటంతో మాటల మధ్య కాస్తంత విరామం తీసుకుంటున్నారు.

ఆ తర్వాత కొన్ని నెలల పాటు దాదాపు ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో లీలగారి నుంచి తప్పనిసరిగా ఫోను వచ్చేది. ఆవిడ నంబరును 'లీలగారు' అని సేవ్ చేసుకోవడంతో, ఫోను అందుకోగానే 'లీలగారూ! చెప్పండి' అనేవాణ్ణి.

నా సంబోధన ఆవిడకు నచ్చినట్టు లేదు. కొన్ని రోజులు గడిచాక 'మీరు నన్ను లీల గారు అనకండి. అందరూ నన్ను లీలమ్మా అంటారు. మీరూ అలాగే పిలవండి' అన్నారు. సరే నన్నాను.

వ్యక్తిగతంగా ఎవరినీ అమ్మ, అక్క, చెల్లి వంటి వరసలతో సంబోధించటానికి నేను సుముఖుణ్ణి కాను. కానీ పెద్దావిడ మనసు నొప్పించటం ఇష్టం లేక అప్పటి నుంచి 'లీలమ్మా!' అనే పిలిచేవాణ్ణి.

లీలమ్మ ఇలా ప్రతిరోజూ నాతోనే గాక చాలా మందితో ఫోనులో మాట్లాడుతూ ఉంటారని ఆ తర్వాత తెలిసింది. అయితే ఏదో ఉబుసుపోక కాలక్షేపం కోసం నాతో మాట్లాడుతున్నారనుకోవద్దు.

ఫోను చేశారంటే ఏదో ఒక సందేహ నివృత్తో, మరింకేదో సాహిత్య ముచ్చటో ఉండేది.

పార్టీపట్ల అభిమానంతో...

మహిళా, శిశు సంక్షేమ శాఖలో సుదీర్ఘ కాలం సేవలందించి జాయింట్ డైరెక్టర్‌గా లీలమ్మ పదవీ విరమణ చేశారు. 92 ఏండ్ల వయసులోనూ ఎంతో చలాకీగా, ఉత్సాహంగా ఉండేవారామె. సంగీత, సాహిత్యాలలో గాఢ అభిరుచి పెంచుకున్నారు. తేలు రామానుజమ్మ, సూర్యనారాయణ దంపతులకు లీలమ్మ ఒక్కతే కూతురు. పెండ్లి చేసుకోలేదు. పుచ్చలపల్లి సుందరయ్య సారధ్యంలో తండ్రి సూర్యనారాయణ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేవారు. తండ్రి ప్రభావం ఈమెపై బాగా పడింది. కమ్యూనిస్టు పార్టీ అభిమానిగా మారారు. ఈ క్రమంలోనే మేనత్త విజయ భర్త లంకా జోగారావు అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. దీంతో మేనత్త కుమారుడైన లంకా హనిమన్‌ను చేరదీసి సొంత తమ్ముడిలా లీలమ్మ బాధ్యత తీసుకున్నారు. వారి అనుబంధం అలాగే కొనసాగుతూ వచ్చింది. హనిమన్ కుటుంబం లీలమ్మను కడవరకూ కంటికి రెప్పలా చూసుకుంది.

కాలక్షేపం కోసం లీలమ్మ వివిధ పత్రికల్లో వచ్చే సాహిత్య పజిల్స్‌ను పూర్తి చేసేవారు. ఆ క్రమంలో ఏదో సందేహం. కొన్నిసార్లు సమాధానం తెలిసినా ఆవిడకు సమయానికి స్ఫురించేది కాదు. వెంటనే నాకు ఫోన్.

ఒక్కోసారి పాత సినిమాల విడుదల సంవత్సరాలు తెలుసుకోగోరేవారు. విశ్వనాథ సత్యనారాయణ ఏకవీర నవల ఏ సంవత్సరంలో రాశారని ప్రశ్నించేవారు. పురాణాలు, రుషుల సందేహాలు సరేసరి. ఇదీ అదీ అనే తేడా లేకుండా పలురకాల సబ్జెక్టులపై ప్రశ్నలు గుప్పించేవారు. లీలమ్మ సంధించే సవాలక్ష ప్రశ్నల్లో ముప్పాతిక భాగం నాకు తెలిసేది కాదు. అలా అని చెప్పి 'నాకు తెలీదు, మీ తిప్పలేవో మీరు పడండి' అంటూ తప్పించుకునే వాణ్ణికాను. పనిలో పనిగా ఆ విషయమేదో మనమూ తెలుసుకోవచ్చుకదా అనుకొని గూగుల్‌లో గాలించి సమాధానం రాబట్టే వాణ్ణి. కొన్నిసార్లు పొత్తూరి వెంకటేశ్వరరావుగారు రాసిన పారమార్థిక పద కోశాన్నో, పెద్దబాల శిక్ష రిఫర్ చేసేవాణ్ణి. నాతిప్పలేవో నేను పడి ఏదో రకంగా లీలమ్మ సందేహానికి సాధికారిక సమాధానం చెప్పేవాణ్ణి.

నేను ఎంత ఒత్తిడిలో ఉన్నా లీలమ్మ ఫోను మాత్రం ఆన్సర్ చేస్తుండేవాణ్ణి. పెద్దావిడ ఇంత వయసులోనూ పజిల్స్ నింపుతూ, సంగీత సాహిత్య విషయాల మీద ఆసక్తి అనురక్తి నింపుకుని ఉన్నారన్న ఆనందంతో మాట్లాడేవాణ్ణి.

రోజూ ఫోను చేస్తున్నా గంటల తరబడి మాట్లాడేవారు కాదు. మూడు నాలుగు నిమిషాలకు మించి సంభాషణ పొడిగించేవారు కాదు. భోజనం చేశారా? అని అడిగేవారు. ఇంకా చేయలేదంటే, 'సరే చెయ్యండి, మా వాళ్ల నుంచి కూడా నాకు భోజనానికి పిలుపొచ్చింది' అంటూ ఫోన్ సంభాషణ ముగించేవారు. ఆకాస్త వ్యవధిలోనే తన సంగీతాభిరుచినీ, చదువుతున్న పుస్తకాల విశేషాలను నెమరు వేసుకునేవారు. సికింద్రాబాద్‌లో ఉండే కుర్రాడొకరికి ఫోన్ చేస్తే తనకు కావలసిన మ్యూజిక్ సీడీలు తెచ్చిపెడతాడని చెప్తూ తాను తాజాగా తెప్పించుకున్న వాటి వివరాలు చెప్పేవారు. రాత్రి నిద్రపట్టలేదనే వారు.

ఒకటికి రెండు సార్లు బాత్రూమ్‌కు లేవాల్సి వచ్చిందనే వారు. బాత్రూమ్‌లో కాలు జారకుండా తగిన ఏర్పాట్లు చేశారని చెప్పేవారు.

'మిమ్మల్నొకసారి చూడాలని ఉంది. మా ఇంటికి రాగలరా? బసవతారకం ఆస్పత్రి దగ్గర్లోనే. కింద మా తమ్ముడి కూతురిది ఆక్యుపంక్చర్ క్లినిక్ కూడా ఉంటుంది. చాలా తేలిగ్గా ఇల్లు కనుక్కో వచ్చు. మీకు అవసరమైతే ఆక్యుపంక్చర్ ట్రీట్‌మెంట్ కూడా తీసుకోవచ్చు' అన్నారొకసారి లీలమ్మ.

ఎటూ ఫోనులో మాట్లాడుతూనే ఉన్నాంగదా! ప్రత్యేకంగా వెళ్లి మాట్లాడాల్సిన విషయాలేమున్నాయి అని నా పని ఒత్తిళ్లతో తాత్సారం చేస్తూ వచ్చాను.

లీలమ్మ అంతటితో ఊరుకోలేదు. 'నేనైనా మీ ఇంటికి రావచ్చు. కానీ నేను కదలాలంటే బోలెడు ఏర్పాట్లు చేసుకోవాలి. మీరైతే ఈజీగా క్యాబ్‌లో వచ్చేయవచ్చు. కబుర్లు చెప్పుకోవచ్చు. మీరేమనుకోకుంటే చిన్నమాట. నాకు నెలనెలా బోలెడంత పెన్షన్ వస్తుంది. క్యాబ్ చార్జీలు నేనే పే చేస్తాను' అని కూడా లీలమ్మ అన్నారు.

అయినా మొండి ఘటాన్ని కదిలితేనా? ఎప్పటికప్పుడు ఇదిగో అదిగో అంటూ ఏదో వంక తో వాయిదాలు వేస్తూ వచ్చాను.

ఒకసారి రచయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గారితో ఫోనులో మాట్లాడుతూ లీలమ్మ గురించి వివరంగా చెప్పుకొచ్చాను. 'అంతగా ఆవిడ మిమ్మల్ని చూడాలనుకుంటున్నపుడు మీరు వెళ్లి చూసొస్తే బావుంటుంది, అశ్రద్ధ చేయకండి' అన్నారు. అయినా కాలు కదలపలేదు.

ఒకసారి కొండపల్లి పావన్‌కు ఫోను చేసి 'ఈ మధ్య లీలమ్మగారు ఫోన్లు చేయటం తగ్గించారు. ఆవిడ ఆరోగ్యం ఎలా ఉంది?' అని వాకబు చేశాను. లీలమ్మను ఒకసారి చూసి రావాలని కూడా అన్నాను.

'లీలమ్మ ఆరోగ్యం బాగానే ఉంది. మనిద్దరం కలిసి వెళ్దాం' అన్నారు పావన్. కానీ ముడిపడలేదు.

జర్నలిస్టు స్వాతి దుర్గరాజు ఫోను చేసి 'మీకు ఈ కబురు తెలుసా? లీలగారు వారం కిందట కన్ను మూశారట, మా మేనత్త చెప్పింది' అన్నారు.

లీలమ్మను చూద్దామనుకుంటూనే ఒక జీవితకాలం లేటు చేశాను. ఇప్పుడు ఆవిడను చూడటం ఎలా? లీలమ్మ వణుకుతున్న గొంతు, నిండు మనసుతో నవ్వేనవ్వు, సందేహాల పరంపర నా చెవుల్లో వినిపిస్తూనే ఉన్నాయి.

(ఈ రోజు సాయంత్రం 7గంటలకు హైదరాబాద్ బంజారాహిల్స్, రోడ్ నంబర్-1లోని హయత్ ప్లేస్‌లో లీలమ్మ సంస్మరణ కార్యక్రమం)

- గోవిందరాజు చక్రధర్

వీలైనంత సాయం చెయ్యి

ప్రియమైన వేణు గీతికకు

ఎలా ఉన్నావు చిట్టి తల్లి? నేను రాస్తున్న ప్రతి ఉత్తరం చదువుతున్నందుకు సంతోషం. ఈ రోజున నీకు ఒక ఆడపిల్ల వాళ్ళ మేనమామ అన్న మాట వల్ల పడిన వేదన గురించి చెప్తాను. ఇది నా కళ్ళ ముందే జరిగింది. దాదాపు 30 ఏండ్ల పై మాట. నా స్నేహితురాలు ఒక రోజు వాళ్ళ మేనమామ ఇంటికి వచ్చింది. పెండ్లి చూపులు ఏర్పాటు చేశారని, అమ్మ వాళ్ళు చాలా దూరప్రాంతంలో ఉండటం వల్ల మామయ్య ఇంట్లో ఈ కార్యక్రమం పెట్టారని, వీలుంటే నన్ను రమ్మని చెప్పింది.

సరే నేను స్నేహితురాలిని చూసి చాలా రోజులైంది, తను ఎక్కడో ఉద్యోగం చేస్తోంది, కలవడం కుదరటం లేదు, ఈ విధంగానైనా కలవొచ్చని వెళ్ళాను. నేను వచ్చినందుకు సంతోషించింది, వాళ్ళ మామయ్య వాళ్లకు పరిచయం చేసింది. వాళ్ళు అపర కోటీశ్వర్లు. ఇల్లంతా మంచి ఖరీదైన ఫర్నిచర్‌తో చూడముచ్చటగా ఉంది. నేను, నా ఫ్రెండ్ వాళ్ళ మామయ్య కూర్చుని మాట్లాడుకుంటున్నాము. ఇంతలో హఠాత్తుగా 'మీ నాన్న ఎంత కట్నం ఇస్తాడే' అని వాళ్ళ మామయ్య అడిగాడు.

అమ్మ లేఖ



మా ఫ్రెండ్ వాళ్ళది మధ్య తరగతి కుటుంబం, తనకేం చెప్పాలో తెలియక 'ఎక్కువ కట్నం ఇవ్వలేరు, ఏమైనా ఒక పాతిక వేలు ఇవ్వగలరేమో' అంది. దాంతో అతను వెంటనే 'పాతికవేలకు ఎవడు చేసుకుంటాడే, బంట్రోతు కూడా దొరకడు. అయినా కట్నం ఇచ్చుకోలేనప్పుడు ఆడపిల్లని ఎందుకు కన్నాడు మీ నాన్న' అని అనేసరికి పాపం నా ఫ్రెండ్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఏమి మాట్లాడకుండా కళ్ళ నీళ్లు పెట్టుకుని అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయింది.

ఇదంతా ఎందుకు చెప్తున్నాను అంటే, నిజంగా చెల్లెలి మీద ప్రేమ ఉంటే ఒక వేళ మంచి సంబంధం అయితే సాయ పడాలి. డబ్బు ఉన్నవాళ్లకే ఆడపిల్లలు పుట్టాలని, డబ్బు లేని వాళ్లకు ఆడపిల్లలు పుట్టకూడదని నియమం ఎక్కడుంది. అయినా అది మన చేతుల్లో లేని విషయం. ఎప్పుడు కూడా ఎదుటివారి పేదరికాన్ని చూసి హేళన చేయవద్దు నాన్న. ఈ రోజున ఇలా ఉన్నవారు భవిష్యత్తులో ధనవంతులు కావచ్చు.ఇప్పటికీ తాను వాళ్ళ మామయ్య అన్న మాటని తలచుకుని బాధపడుతుంది.

మేన మామ అంటే తండ్రి తర్వాత తండ్రివంటి వాడు. కుటుంబానికి అండగా ఉండాల్సిన వాడు. ఎపుడైనా నీ ఇంటికి కూడా ఎవరైనా ఇటువంటి విషయంలో సాయం కోరితే నువ్వు చేయగలిగిన సాయం చెయ్యి, అంతే కాని ఒక పెండ్లి కాని పేద పిల్లని బాధపెట్టకు నాన్న. ఏ పేద ఇంటి పిల్ల పెండ్లి అయిన సరే నీకు తోచిన సాయం తప్పకుండా చేయి నాన్న... ఉంటాను.



ప్రేమతో అమ్మ
- పాలపర్తి సంధ్యారాణి

పది పరీక్ష రాసి వస్తూ...

(మొదటిపేజీ తరువాయి)

గచ్చిబౌలి ఫ్లై ఓవర్ వద్ద వారి ద్విచక్ర వాహనం అదుపు తప్పి.. ఆర్టీసీ డబుల్ డెక్కర్ బస్సు చక్రాల కింద పడింది. ఈ ఘటనలో బైక్‌పై వెనుక కూర్చున్న ప్రభాతి ఛత్రియ అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె అన్న సుమన్ ఛత్రియకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానికులు దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థిని మృతితో టీఎన్జీవో కాలనీలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ సుందరి పోటీలు రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వీరనారి ఐలమ్మ ట్రస్ట్ భవన్‌లో వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ పెట్టుబడిదారుల మార్కెట్ ప్రయోజనాల కోసం మహిళల అందాల పోటీలు నిర్వహించటం సిగ్గుచేటని విమర్శించారు. ఎంతో మంది మహిళలు అన్నం లేక, రక్తహీనతతో బాధపడుతున్నారనే విషయాన్ని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తుంటే.. ఆ స్థితిని అధిగమించేందుకు తగిన విధాన నిర్ణయాలు తీసుకునే చిత్తశుద్ధి పాలకులకు లేదని చెప్పారు. సరైన ఉపాధి దొరకక, పని ప్రదేశాల్లో వేధింపులు, లైంగిక దాడులు జరుగుతుంటే.. వాటిని అరికట్టలేని స్థితిలో ప్రభుత్వాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మనువాదం ముసుగులో మహిళలను రెండోతరగతి పౌరులుగానే, వంటింటికే పరిమితం చేయాలనే విధానాలను వేగంగా అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడబలుక్కొని తెలంగాణ వేదికగా ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించటం సిగ్గుచేటని విమర్శించారు. మే 7న ప్రారంభించనున్న ఈ పోటీలను అదే నెల 31న గ్రాండ్ ఫినాలేతో ముగించనున్నట్టు తెలిపారు. ఈ పోటీలు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం, మహిళలపై హింస పెరుగుతున్నది, ఈ క్రమంలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన పాలకులు అంతర్జాతీయ వేడుకలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ పోటీలు కాస్మోటిక్స్ వస్తువులను, విలాసవంతమైన సరుకులను అమ్ముకునేందుకు తద్వారా లాభాలు అర్జించేందుకు, స్త్రీల అందచందాలను సరుకుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు అనేక రంగాల్లో ముందుకు పోతూ విజయాలు సాధిస్తుంటే వారి వ్యక్తిత్వం, గౌరవం, ఔన్నత్యాన్ని పెంచే విధంగా విధి విధానాలు రూపొందించాలి గానీ..వారి వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా సినిమాల్లో అశ్లీలతను విచ్చలవిడిగా పెంచేందుకు అనుమతులు కల్పిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.ఎన్. ఆశలత, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

యూఎస్ చట్టాలకు కట్టుబడి ఉండండి

భారతీయ విద్యార్థులకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ : అమెరికాలోని భారతీయ విద్యార్థులు అక్కడి చట్టాలకు కట్టుబడి ఉండాలని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం సూచించింది. ఇటీవల ఇద్దరు భారతీయ విద్యార్థుల విషయంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఈ సూచన జారీ చేసింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అమెరికాలోని భారత ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయాలు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించింది. వీసాలు, వలస విధానాలపై నిర్ణయాలు పూర్తిగా ఆయా దేశాల విచక్షణాధికారానికి సంబంధించినవనీ, వాటిని పాటించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని స్పష్టం చేసింది. వాషింగ్టన్ డీసీలోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్‌గా ఉన్న బదర్‌ఖాన్ సురి విశ్వవిద్యాలయంలో హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నాడని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అధికారులు ఆరోపించిన సంగతి తెలిసిందే. దీంతో అతడి వీసాను రద్దు చేయడమే గాక.. గత సోమవారం వర్జీనియాలోని నివాసం నుంచి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే తర్వాత అతడికి తాత్కాలిక ఉపశమనం లభించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు అతడి బహిష్కరణకు వీల్లేదని వర్జీనియా కోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. అలాగే పాలస్తీనా అనుకూల నిరసనల్లో చురుగ్గా పాల్గొన్నందుకు భారతీయ విద్యార్థిని రంజనీ శ్రీనివాసన్ వీసా రద్దయిన విషయం విదితమే. తీవ్రవాద సంస్థ హమాస్‌కు మద్దతు తెలిపేలా ఆమె కార్యకలాపాలు ఉన్నాయని పేర్కొంటూ అమెరికా ఈ చర్య తీసుకుంది. వీసా ఈనెల 5న రద్దు కావడంతో ఆమె తనకు తానుగా అమెరికాను వీడారు.

ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ వెంటనే పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికీ 40శాతం పనులే పూర్తయ్యాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా పనులు పూర్తికాక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే పనులు పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రయాణం సమస్యాత్మకం..

హైదరాబాద్- వరంగల్ మధ్య వాహనాల రద్దీ బాగా పెరిగి ఉప్పల్ సమీపంలో ట్రాఫిక్ సమస్య పెరిగిందని జాన్‌వెస్లీ తెలిపారు. దాంతో దిగువన 150 మీటర్ల సర్వీసు రోడ్డు నిర్మిస్తూ, ఘట్కేసర్ వైపు వెళ్లే వాహనాల ప్రయాణానికి ఆటంకం లేకుండా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని 2017లో ప్రతిపాదించారని గుర్తు చేశారు. ఉప్పల్ చౌరస్తా నుంచి నారపల్లి (మేడిపల్లి) వరకు 6.2కి.మీ. నిడివిలో 45 మీటర్ల వెడల్పు ఉండే ఆరు లైన్ల ఫ్లైఓవర్‌కు డిజైన్ చేశారని, పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే తర్వాత ఇదే పెద్ద ఫ్లైఓవర్ అని తెలిపారు. రూ.670 కోట్ల అంచనాతో ప్రారంభించిన ఈ ఫ్లైఓవర్‌ను నిర్మాణ సంస్థ ఏకంగా 25 శాతం తక్కువకు టెండర్‌కు దక్కించుకుందన్నారు. కానీ, 43 శాతం మాత్రమే పనులు చేసి ఆపేసిందని తెలిపారు. జాతీయ రహదారులు, ఎలివేటెడ్ కారిడార్స్ నిర్మాణం, ఖర్చు మొత్తం కేంద్ర ప్రభుత్వానిదేనని చెప్పారు. మరి కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని ఎంపీ ఈటల రాజేందర్ (బీజేపీ) అయినప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఈ అలసత్వానికి కారణం నిర్మాణ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం అని కేంద్రం వారిపై పెనాల్టీ వేస్తున్నట్టుగా ప్రకటించడం తన బాధ్యతారాహిత్యాన్ని కప్పి పుచ్చుకోవడమేనన్నారు.

గత ఆగస్టులో చేసిన ప్రకటన ఏమైంది..?

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు సీఎంగా ఉన్నారని.. ఈ ప్రాంత అభివృద్ధికి, ప్రయాణికుల అవస్థలను తొలగించేందుకు ఫ్లైఓవర్ పనులు సత్వరం పూర్తయ్యేలా చూడాలని కోరారు. 2024 ఆగస్టులో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఇక్కడ పర్యటించినప్పుడు 10 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని, 18 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ఇప్పటికీ అతిగతీ లేదన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణ సంస్థపై ఒత్తిడి తెచ్చి ప్రాజెక్టు పూర్తయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి.సత్యం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జె.చంద్రశేఖర్, కోమటి రవి, ఎం.వినోద, ఎర్ర అశోక్, జి.శ్రీనివాసులు, రాజశేఖర్, నాయకులు వెంకన్న, రాథోడ్ సంతోష్, లింగస్వామి, నరేష్, సబితా, లక్ష్మణ్, చింతల యాదయ్య, శ్రీమన్నారాయణ, సృజన, శారద తదితరులు పాల్గొన్నారు.

శాంతిని తీసుకురావాలి

(మొదటిపేజీ తరువాయి)

కలిసి జస్టిస్ గవాయ్.. చురాచంద్‌పూర్ జిల్లాలోని ఒక సహాయ శిబిరాన్ని సందర్శించి, అంతర్గతంగా నిర్వాసితులైనవారిని కలిశారని అధికారులు తెలిపారు. జిల్లాలోని లమ్కాలోని మినీ సెక్రెటేరియట్ నుంచి వారు న్యాయ సేవల శిబిరం, వైద్య శిబిరం, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను వర్చువల్‌గా ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కృష్ణకుమార్, జస్టిస్ గోల్మెయి గైపుల్షిలు కూడా హాజరయ్యారు.

అక్కడ ఏర్పాటు చేసిన సభలో జస్టిస్ గవాయ్ మాట్లాడారు. " భారత రాజ్యాంగం దేశంలోని పౌరులందరికీ సమాన హక్కులను కల్పిస్తుంది. రాష్ట్ర ప్రజలు శాంతి, సాధారణ స్థితిని పునరుద్ధరించాలి" అని ఆయన కోరారు. తాను కార్యనిర్వాహక చైర్మెన్‌గా ఉన్న నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) గతంలో ఇచ్చిన రూ.1.5 కోట్లతో పాటు అంతర్గతంగా నిర్వాసితులకు సహాయ సామగ్రిని అందించటానికి రూ.2.5 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య సేవలను అందించటానికి రాష్ట్రవ్యాప్తంగా 109 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్టు జస్టిస్ గవాయ్ చెప్పారు. సంఘర్షణల కారణంగా బడులకు వెళ్లటం మానేసిన విద్యార్థులను తిరిగి చేర్చుకోవాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. విద్యార్థులందరూ తమ విద్యను పూర్తి చేసేలా చూడాలని ఆయన విద్యాసంస్థలు, ప్రజలకు పిలుపునిచ్చారు. కాగా, అత్యున్నత న్యాయస్థానం ప్రతినిధి బృందానికి ఇంఫాల్ విమానాశ్రయంలో రాష్ట్రంలోని న్యాయవాదుల బృందం హృదయపూర్వకంగా స్వాగతం పలికింది.

ఆ తర్వాత సుప్రీంకోర్టు ప్రతినిధుల బృందం సద్భావన మండప్ సహాయ కేంద్రాన్ని సందర్శించింది. అంతర్గత నిర్వాసితులతో సంభాషించింది. న్యాయమూర్తులు పలువురు ఆరోగ్య అధికారులను సత్కరించారు. కొత్తగా చేరిన 41 మంది న్యాయవాదులకు 'సనద్' పంపిణీ చేశారు. ఐడీపీ విద్యార్థులకు స్టేషనరీని డిస్ట్రిబ్యూట్ చేశారు. మే, 2023 నుంచి ఇంఫాల్ లోయలోని మెయిటీలు, ఆనుకొని ఉన్న కొండల ఆధారిత కుకీ-సమూహాల మధ్య జరిగిన జాతి హింసలో 250మందికిపైగా మరణించగా, వేలాది మంది నిరాశ్రయులైన విషయం విదితమే. రాష్ట్రంలోని బీజేపీ సర్కారు, కేంద్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరితో అల్లర్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఫలితంగా, సామాన్య పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మేధావులు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ శాఖలో 10,954 పోస్టులు మంజూరు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుని వీటి నియామకాలు చేపట్టనున్నారు. ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఇందుకు సంబంధించి సర్కార్ తీసుకున్న నిర్ణయం మేరకు శనివారం పోస్టులను ఆర్థిక శాఖ మంజూరు చేసింది.

ప్రభుత్వానికి రెవెన్యూ జేఏసీ కృతజ్ఞతలు

రెవెన్యూ శాఖలో కొత్తగా 10,954 పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల తెలంగాణ రెవెన్యూ జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి హర్షం ప్రకటించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. తాము గతంలో పలు మార్లు చేసిన వినతి మేరకే సర్కార్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థ పట్టాలెక్కితే క్షేత్రస్థాయిలో ప్రజలకు, రైతులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.

ప్రముఖ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

59వ జ్ఞానపీఠ్ పురస్కారం. అయితే ఈ పురస్కారం అందుకున్న ఛత్తీస్‌గఢ్ తొలి రచయితగా వినోద్ కుమార్ శుక్లా గుర్తింపు పొందారు. అదేవిధంగా హిందీ భాషలో ఈ అవార్డు అందుకున్న 12వ రచయితగా నిలిచారు. ప్రఖ్యాత స్టోరీ టెల్లర్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత ప్రతిభా రే నేతృత్వంలోని జ్ఞానపీఠ్ సెలెక్షన్ కమిటీ సమావేశంలో వినోద్ కుమార్ శుక్లాను అవార్డుకు ఎంపిక చేశారు. ఆయనకు జ్ఞానపీఠ్ పురస్కారంతోపాటు రూ.11 లక్షల నగదు, సరస్వతీదేవి కాంస్య విగ్రహాన్ని అందజేస్తారు. వినోద్ కుమార్ శుక్లా 1999లో సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. దేశంలోని ప్రముఖ హిందీ రచయితల్లో ఒకరైన ఆయనకు సాహిత్య రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ ఉన్నత పురస్కారం దక్కింది.

నా సమాధానాలకు వాళ్ల మైండ్ బ్లాక్

(మొదటిపేజీ తరువాయి)

లేదనీ, దాటవేస్తున్నారని బీఆర్ఎస్ సభ్యులిద్దరూ ఎదురుదాడికి దిగారు. దీంతో మళ్లీ లేచిన కోమటిరెడ్డి మాట్లాడుతూ..వాళ్లు ప్రయివేటు భాగస్వామ్యంతో రోడ్లు వేయబోతున్నారా? అని అడిడితే లేదని చెప్పాననీ, దాంట్లో తప్పేముందని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో పీపీపీ విధానంలో రోడ్లు అస్సలే వేయబోమని స్పష్టం చేశారు. హైబ్రిడ్ యాన్యూటీ(హ్యామ్) విధానంలో వేయబోతున్నామని ప్రకటించారు. ఇప్పటికే పదిరాష్ట్రాల్లో ఈ పద్ధతిలో రోడ్లేస్తున్నారనీ, తమ శాఖ ఉన్నతాధికారులు ఆయా రాష్ట్రాల్లో అధ్యయనం చేసి వచ్చాకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏడు కిలోమీటర్ల ఉప్పల్ ఎలివేటర్ కారిడార్‌ను పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ పూర్తిచేయలేకపోయిందని విమర్శించారు. తమప్రభుత్వం 18 నెలల్లో దాన్ని పూర్తిచేయబోతున్నదని ప్రకటించారు. పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్ల నిర్మాణాన్ని పెద్ద పట్టించుకోలేదని విమర్శించారు. రోడ్లు సరిగా వేయించలేదనీ, తాము అధికారంలోకి వచ్చేనాటికి ఎక్కడ చూసినా గుంతల రోడ్లు దర్శనమిచ్చాయని తెలిపారు. తమ ప్రభుత్వం యుద్ధప్రాతిపదిక రోడ్లను వేయిస్తున్న తీరును సభాదృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీలు ప్రకటించారుగానీ మండల కేంద్రాలకు కనీసం రోడ్లు వేయించలేదని ఎత్తిచూపారు. లేని విషయాన్ని ఉన్నట్టు ఉన్నది లేనట్టు ప్రజల్ని నమ్మించడంలో హరీశ్‌రావు, కేటీఆర్, కేసీఆర్‌కు బాగా అబ్బిందన్నారు. ఆర్ఆర్ఆర్‌కు టెండర్లు పిలిచామనీ, మూడు నెలల్లో వాటిని ఓపెన్ చేసి పనులు మొదలుపెడతామని చెప్పారు.

వెంకన్న నియోజకవర్గంలోనే రూ.200 కోట్లతో రోడ్లేపించినం : ప్రశాంత్‌రెడ్డి

'వెంకన్నా కోపానికి రాకు. నిన్ను చూస్తేనే భయమేస్తుంది. నేను మెల్లగనే అడుగుతున్న మెల్లగనే సమాధానం చెప్పండి..' అని ప్రశాంత్‌రెడ్డి చెబుతూ..తమ పదేండ్ల కాలంలో అస్సలు రోడ్లే వేయలేదన్నట్టు మంత్రి మాట్లాడటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంకన్న నియోజకవర్గ కేంద్రమైన నల్లగొండలోనే రూ.200 కోట్లతో రోడ్లు వేశామని నొక్కిచెప్పారు. చూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. పదేండ్ల తమ పాలనలో డబుల్ రోడ్లు 8 వేల కిలోమీటర్లు, నాలుగు లైన్ల రోడ్లు 600 కిలోమీటర్లు వేశామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 17 వేల కిలోమీటర్లకు రూ.23 వేల కోట్లు ఖర్చవుతాయని చెబుతున్నదనీ, మొత్తం ఖర్చులో 40 శాతం ప్రభుత్వం, 60 శాతం ప్రయివేటు పెట్టుబడులతో వేస్తామని చెబుతున్నదని తెలిపారు. అయితే, ప్రయివేటు వ్యక్తులంటే ఎవరు? అని ప్రశ్నించారు. ఇప్పటికే ఏడాదిన్నర కాలం పూర్తయిందనీ, మూడున్నరేండ్లలో 17 వేల కిలోమీటర్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. అదే సమయంలో హరీశ్‌రావు జోక్యం చేసుకుంటూ 60 శాతం, 40 శాతం విషయంలో బడ్జెట్ బుక్కులో భట్టి ఒకలా చెప్పారనీ, మంత్రి ఇప్పుడు ఒకలా చెబుతున్నారని ఎత్తిచూపారు. అందులో ఏదీ నిజం అని ప్రశ్నించారు. మంత్రికి గింత ఓపిక లేకుంటే ఎట్ల? సమాధానం బాధ్యతగా ఇవ్వాలంటూ కూర్చున్నారు.

నల్లగొండలో చూపిస్తే సన్మానించి కొబ్బరికాయ కొడతా : కోమటిరెడ్డి

హరీశ్‌రావు ప్రశ్నోత్తరాల్లో అడిగిన ప్రశ్నకు తాను కరెక్టుగానే సమాధానం చెప్పానని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఆయన పీపీపీ పద్ధతిలో రోడ్లు వేయబోతున్నారా అని అడిగారని గుర్తుచేశారు. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పానన్నారు. నల్లగొండలో 200 కోట్ల రోడ్లు వేయించారంటా..ఎక్కడో చూపిస్తే సన్మానం చేస్తాననీ, ఆయనకు కొబ్బరికాయ కొడతానని సవాల్ విసిరారు. దండం పెడ్తా బాబూ అబద్ధాలకూ ఓ లెక్క ఉండాలంటూ చురకలు అంటించారు. రూ.200 కోట్లతో అని చెప్పారుగానీ పనులు చేయించలేదన్నారు. తాను మంత్రి అయ్యాక రూ.27 కోట్లు విడుదల చేశానని గుర్తుచేశారు. యాదగిరి గుట్ట టెంపుల్ గొప్పగా కట్టామని చెప్పుకుంటున్నారుగా..దానికి సంబంధించిన రూ.350 కోట్ల బకాయిల్ని మేం చెల్లించుకుంటూ పోతున్నామని వివరించారు. ఎంపీ ఎన్నికల సమయం పోనూ మిగతా 13 నెలల్లో 15 బ్రిడ్జీలు, 2000 కిలోమీటర్ల రోడ్లు యుద్ధప్రాతిపదిక నిర్మించామని సభాదృష్టికి తీసుకొచ్చారు. ఫాంహౌజ్‌లో యజ్ఞాలు, యాగాలు చేయించే బాధ్యత, సచివాలయం కట్టించే బాధ్యతలు చూసుకోవడానికే ఆయన టైం సరిపోయేదనీ, రోడ్లు వేయించే టైం ఆయనకు లేకుండా పోయిందని దెప్పిపొడిచారు. 'యాడ్కిపోయినా చేపలపులుసు పెట్టించుకునేటోళ్లకు ఏం తెలుసు' అంటూ ప్రశాంత్ రెడ్డి, హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ సభ్యులు సభను వాకౌట్ చేసి వెళ్లిపోయారు. ఈ రకంగా సభ అసాంతం హీటెక్కింది.

ఉపాధికార్డు ఉన్న అందరికీ

ఆత్మీయ భరోసా వర్తించదు

రైతుభరోసా వచ్చిన వారికి ఇవ్వడం లేదు : అసెంబ్లీలో మంత్రి సీతక్క స్పష్టీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో ఉపాధి హామీ కార్డు ఉన్న అందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తించబోదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క (ధనసరి అనసూయ) స్పష్టం చేశారు. రైతు భరోసా వచ్చిన వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వడం లేదని చెప్పారు. శనివారం అసెంబ్లీలో వ్యవసాయం, అనుబంధ రంగాల పద్దులపై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, ఇతర కారణాల వల్ల రైతు భరోసా నిధులు ఇప్పటి వరకు రూ.60 కోట్లు విడుదల చేశామని చెప్పారు. ఈనెల 31లోపు రెండో విడత నిధులను విడుదల చేస్తామన్నారు.



ఎకరాలోపు ఉన్న రైతులకు ఆత్మీయ భరోసా ఇవ్వాలి : హరీశ్‌రావు

ఎకరాలోపు భూమి ఉన్న రైతులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని బీఆర్ఎస్ సభ్యులు టి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. పది గుంటల భూమి ఉన్న వారికి రైతుభరోసా కింద ఏడాదికి రూ.మూడు వేల పెట్టుబడి సాయం అందుతుందని వివరించారు. అదే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు వస్తాయని చెప్పారు. ప్రభుత్వం ఆలోచించి పేద రైతులకు ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ,బీసీలకు న్యాయం చేయాలని కోరారు. ఇంకోవైపు రాష్ట్రంలో 1.02 కోట్ల మందికి ఉపాధి హామీ కార్డులున్నాయని వివరించారు. వారికి ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలంటే రూ.12 వేల కోట్లు అవసరమవుతాయని అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్‌లో రూ.930 కోట్లు కేటాయించిందని వివరించారు. 2025-26 బడ్జెట్‌లో కేవలం రూ.600 కోట్లు కేటాయించిందని చెప్పారు. అంటే రూ.330 కోట్ల నిధులకు కోత విధించిందని విమర్శించారు. అందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలంటే ఇంత తక్కువ నిధులు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. దీనిపై మంత్రి సీతక్క స్పందించారు. ఉపాధి హామీ కార్డులున్న అందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను వర్తించబోమని స్పష్టం చేశారు. ఇంకోవైపు ఎకరాలోపు భూమి ఉన్న రైతులకు వర్తింపజేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్స్‌పై కేంద్రం కొరడా

- 357 వెబ్‌సైట్స్ బ్లాక్..!

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా ఝుళిపించింది. జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు అక్రమ ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల 357 వెబ్‌సైట్‌లను బ్లాక్ చేశారు. దాదాపు 2,400 బ్యాంక్ ఖాతాలను అటాచ్ చేశారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని తెలిపింది. రూ.126 కోట్లను ఫ్రీజ్ చేసినట్టు పేర్కొన్నది. మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌తో అప్రమత్తంగా ఉండాలనీ, వాటిని ఎవరూ వినియోగించొద్దని డీజీజీఐ సూచించింది. కొన్ని సంస్థలను నమోదు చేయకుండా, ఆదాయాన్ని దాచిపెడుతూ జీఎస్టీ ఎగవేతలకు పాల్పడుతున్న చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై చర్యలు తీసుకున్నామనీ, 357 వైబ్‌సైట్స్‌ని ఐటీశాఖ సమన్వయంతో బ్లాక్ చేసినట్టు మంత్రిత్వశాఖ పేర్కొన్నది. బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు పాల్పడుతోన్న సుమారు 700 సంస్థలపై నిఘా వేసినట్టు వివరించింది.దేశం వెలుపల ఈ తరహా సంస్థలు నడుపుతోన్న పలువురు భారతీయులపై డీజీజీఐ మరో ఆపరేషన్ చేపట్టి.. వారికి సంబంధించిన 166 ఖాతాలను బ్లాక్ చేసింది. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నది. చాలామంది బాలీవుడ్ ప్రముఖులు, క్రికెటర్లు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ ఈ ప్లాట్‌ఫామ్స్‌కు ప్రచారం నిర్వహిస్తున్నట్టుగా గుర్తించినట్టు పేర్కొన్నది. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, ఆ ప్లాట్‌ఫామ్స్ వ్యక్తుల ఆర్థిక భద్ర తను దెబ్బతీసే అవకాశం ఉన్నదనీ, దేశ భద్రతను దెబ్బతీసే కార్యకలాపాలకు అవి పరోక్షంగా మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరించింది.

వారి చట్టపరమైన హోదా రద్దు

- నాలుగు దేశాలకు చెందిన 5.32 లక్షల మంది వలసదారులపై ఎఫెక్ట్
- ట్రంప్ మరో షాకింగ్ నిర్ణయం

వాషింగ్టన్ : వివాదాస్పద చర్యలతో అలజడి సృష్టిస్తున్న ట్రంప్.. మరో షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు తాత్కాలిక వలసదారులను టార్గెట్ చేసుకున్నారు. యూఎస్‌వ్యాప్తంగా ఐదు లక్షల మందికి పైగా వలసదారులకు తాత్కాలిక నివాస హోదాను రద్దు చేస్తున్నట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. క్యూబా, హైతీ, నికరాగ్వే, వెనిజులా దేశాలకు చెందిన లక్షలాది మంది వలసదారులకు చట్టపరమైన హోదాను రద్దు చేస్తున్నట్టు హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం వెల్లడించింది. నెల రోజుల్లో వారిని దేశం నుంచి బహిష్కరించనున్నట్టు వివరించింది. 2022 అక్టోబర్ తర్వాత ఆ నాలుగు



దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చిన దాదాపు 5,32,000 మందికి ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి. మానవత పెరోల్ కార్యక్రమం కింద అమెరికాకు వచ్చిన వారిపై ఈ కొత్త విధానం ప్రభావం చూపనున్నది. వీరంతా ఇతరుల ఆర్థిక సహకారంతో అమెరికాకు వచ్చారనీ, రెండేండ్ల పాటు యూఎస్‌లో నివసించటానికి, పని చేయటానికి తాత్కాలిక అనుమతులు పొందారని హోమ్‌లాండ్ సెక్యూరిటీ సెక్రెటరీ క్రిస్టీ నోయెమ్ వెల్లడించారు. వీరు ఏప్రిల్ 24 లేదా ఫెడరల్ రిజిస్టర్‌లో నోటీసులు ప్రచురించిన 30 రోజుల తర్వాత అమెరికాలో ఉండేందుకు లభించిన లీగల్ స్టేటస్‌ను కోల్పోనున్నారని తెలిపారు.మానవతా పెరోల్ అమెరికాలో సుదీర్ఘకాలంగా ఉన్న వెసులుబాటు. యుద్ధం, రాజకీయ అస్థిరత ఉన్న దేశాల ప్రజలు అమెరికాకు వచ్చి తాత్కాలికంగా నివాసం ఉండేందుకు వీలుగా ఈ లీగల్ స్టేటస్‌ను కల్పిస్తారు. గతేడాది అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ దీని గురించి పలుమార్లు ప్రస్తావించారు. ఇందులో భాగంగా ఆయన ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకోవటం గమనార్హం. అంతకముందు ఉన్న నిబంధనల ప్రకారం.. మానవతా పెరోల్ కింద వచ్చేవారు రెండేండ్ల పాటు చట్టబద్ధంగా దేశంలో ఉపాధి పొందొచ్చు. ఆ గడువు ముగిసిన తర్వాత మరింత ఎక్కువ కాలం ఉండాలనుకుంటే.. శరణార్థిగా లేదా వీసా కోసం దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉండేది. అయితే, ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దరఖాస్తుల ప్రక్రియను నిలిపివేశారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ పలు ఫెడరల్ కోర్టులలో పిటిషన్లు దాఖలయ్యాయి.



సెమీస్‌లో పోరాడి ఓడిన

త్రీసా-గాయత్రి

స్విస్ బ్యాడ్మింటన్ టోర్నీ

బస్సెల్(స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. సెమీస్‌కు చేరిన ఏకైక షట్లర్ల జంట త్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ ఓటమిపాలయ్యారు. మూడుసెట్ల పాటు హోరాహోరీగా సాగిన ఈ గేమ్‌లో త్రీసా-గాయత్రి చైనా టాప్ షట్లర్లకు ముచ్చెమటలు పట్టించారు. హోరాహోరీగా సాగిన ఈ గేమ్‌లో త్రీసా-గాయత్రి 21-15, 16-21, 12-21తో టాన్-లియో(చైనా) చేతిలో ఓటమిపాలయ్యారు. అంతకుముందు పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన ఏకైక షట్లర్ సుబ్రమణ్యం కూడా పరాజయాన్ని చవిచూశాడు. సుబ్రమణ్యం 10-21, 14-21తో పొపొవ్(చైనా) చేతిలో ఓటమిపాలయ్యాడు.

కెప్టెన్సీకి హీథర్ నైట్ గుడ్‌బై



లండన్: ఇంగ్లండ్ మహిళల జట్టు కెప్టెన్ హీథర్ నైట్ సంచలన నిర్ణయం తీసుకుంది. కెప్టెన్సీ నుంచి గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఇసిబి) ధ్రువీకరించింది. "ఇంగ్లండ్ మహిళల జట్టు కెప్టెన్సీ పదవి నుంచి హీథర్ నైట్ వైదొలిగింది. 9ఏళ్ల పాటు కెప్టెన్ సేవలు అందించినందుకు థాంక్యూ నైట్" అని ఇసిబి ఎక్స్‌లో పేర్కొంది. 2016లో కెప్టెన్‌గా ఎంపికైన హీథర్ నైట్.. 199 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ మహిళలజట్టుకు ముందుండి నడిపించింది. ఆమె సారథ్యంలోనే 2017 వన్డే ప్రపంచకప్‌ను ఇంగ్లండ్ గెలుచుకుంది. అంతేకాకుండా ఇంగ్లండ్ జట్టును ఐసిసి టోర్నమెంట్లలో ఫైనల్‌కు కూడా చేర్చింది. హీథర్ నైట్ ఇంగ్లండ్‌ను 134 మ్యాచ్‌ల్లో విజయాలను అందించింది. ఆమె వరుసగా రికార్డు స్థాయిలో ఎనిమిది వన్డే సిరీస్‌లను ఇంగ్లండ్‌కు అందించింది. గత ఏడాది యుఎఇ వేదికగా జరిగిన టి20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ జట్టు గ్రూపు స్టేజిలోనే ఇంటిముఖం పట్టింది. ఆ తర్వాత యాషెస్ సిరీస్‌లో కూడా అదే తీరును ఇంగ్లండ్‌ను కనబరిచింది. ఈ క్రమంలోనే ఇంగ్లండ్ జట్టు పగ్గాల నుంచి ఆమె తప్పుకుంది. ఇంగ్లండ్ కొత్త కెప్టెన్‌గా నాట్ స్కీవర్ బ్రంట్ ఎంపికయ్యే ఛాన్స్ ఉంది.

తొలి పంచ్ బెంగళూరుదే !

కోల్‌కతాపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు
ఐపిఎల్ సీజన్-18



కోల్‌కతా: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-18 తొలి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) బోణీ కొట్టింది. ఈడెన్‌గార్డెన్స్ వేదికగా శుక్రవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు జట్టు ఏడు వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై ఘన విజయం సాధించింది. కోల్‌కతా జట్టు నిర్దేశించిన 175 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు జట్టు 16.2 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. బెంగళూరు ఓపెనర్లు సాల్ట్(56), కోహ్లి(59నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. వీరిద్దరూ పవర్‌ప్లే 6 ఓవర్లలోనే 80పరుగులతోపాటు తొలి వికెట్‌కు 95పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ధాటిగా ఆడే క్రమంలో సాల్ట్(56) ఔటైనా.. కెప్టెన్ రజత్ పటీధర్(34)తో కలిసి కోహ్లి విజయతీరాలకు చేర్చాడు. స్పెన్సర్ జాన్సన్ ఓవర్లో సిక్సర్, ఫోర్ కొట్టి లివింగ్‌స్టోన్(15) మ్యాచ్‌ను ముగించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కోహ్లికి దక్కింది.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 174పరుగులు చేసింది. ఓపెనర్ డికాక్(4) నిరాశపరిచినా.. నరైన్-రహానే కలిసి 2వ వికెట్‌కు 103పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ జోడీని బెంగళూరు యువ బౌలర్ రసిక్ సలామ్ విడదీశాడు. ఆ తర్వాత రహానే(56) అర్ధసెంచరీతో మెరిసినా.. చివర్లో బెంగళూరు బౌలర్లు కట్టడిగా బౌలింగ్ చేయడంతో కోల్‌కతా భారీస్కోర్‌ను నమోదు చేయలేకపోయింది. యువ బ్యాటర్ రఘువంశీ(30) మినహా మిగతా బ్యాటర్లంతా నిరాశపరిచారు. బెంగళూరు బౌలర్లలో కృనాల్ పాండ్యాకు మూడు, హేజిల్‌వుడ్‌కు రెండు, యశ్ దయాల్, రసిక్ సలామ్, సూయాశ్ శర్మకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు :

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి)స్పెన్సర్ జాన్సన్ (బి)వరుణ్ చక్రవర్తి 56, కోహ్లి (నాటౌట్) 59, దేవదత్ పడిక్కల్ (సి)రమణ్‌దీప్ సింగ్ (బి)నరైన్ 10, రజత్ పటీధర్ (సి)రింకు సింగ్ (బి)వైభవ్ అరోరా 34, లివింగ్‌స్టోన్ (నాటౌట్) 15, అదనం 3. (16.2ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 177పరుగులు.

వికెట్ల పతనం: 1/95, 2/118, 3/162

బౌలింగ్: వైభవ్ అరోరా 3-క్రీ-42-1, స్పెన్సర్ జాన్సన్ 2.2-0-31-0, వరుణ్ చక్రవర్తి 4-0-43-1, హర్షిత్ రాణా 3-0-32-0, సునీల్ నరైన్ 4-0-27-1.

దిగ్గజ బాక్సర్ ఫోరెమాన్ కన్నుమూత



టెక్సాస్: దిగ్గజ అమెరికా బాక్సర్ జార్జ్ ఫోరెమాన్(76) కన్నుమూశారు. రెండుసార్లు ప్రపంచ హెవీ వెయిట్ బాక్సింగ్ చాంపియన్ జార్జ్ ఫోరెమాన్ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జార్జ్ మరణానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. బాక్సింగ్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత జార్జ్.. క్రైస్తవ మత బోధకుడిగా సేవలందించారు. అమెరికాలోని టెక్సాస్‌లో 1949లో జన్మించిన జార్జ్... యవ్వనంలో బాక్సింగ్ మీద దృష్టి సారించాడు. తొలి టైటిల్ వేటలో మహ్మద్ అలీ చేతిలో కంగుతిన్న జార్జ్ 19ఏళ్లకు తన శక్తిని ప్రపంచానికి చాటాడు. తన పంచ్ వపవర్ చూపిస్తూ.. 1968లో జరిగిన ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం గెలుపొందాడు. కెరియర్‌లో 76 మ్యాచుల్లో జార్జ్ విజేతగా నిలవగా.. వాటిలో ఏకంగా 68సార్లు నాకౌట్ చేయడం విశేషం. 28 ఏళ్లకే ఆటకు అల్విదా పలికి అందర్ని ఆశ్చర్యపరిచిన ఈ స్టార్ బాక్సర్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నాడు.

నవచిత్రం

అద్భుతమైన థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా



తమన్నా నాగసాధుగా నటించిన చిత్రం 'ఓదెల 2'. సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి ఇది సీక్వెల్. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి.మధు నిర్మించారు. ఏప్రిల్ 17న ఈ సినిమా థియేటర్స్‌లో విడుదల కానుంది.
ఈ నేపథ్యంలో తమన్నా మాట్లాడుతూ, 'ఈ సినిమాని డైరెక్టర్ అశోక్ చాలా అద్భుతంగా తీశారు. ఇది ఈజీ జోనర్ కాదు. ఒక పల్లెటూరి కథని ఇంత ఎగ్జైటింగ్‌గా, థ్రిల్లింగ్‌గా చెప్పడం మామూలు విషయం కాదు. భైరవి క్యారెక్టర్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. మధు సినిమాని చాలా గ్రాండ్‌గా నిర్మించారు. ఇది గ్రేట్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా' అని తెలిపారు.
'ఈ సినిమా టీజర్‌కి ఆర్గానిక్‌గా చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'ఓదెల' సినిమా నాకు ఒక ఎమోషన్. నేను ఆ ఊర్లో పుట్టి, పెరిగాను. ఊరిని కాపాడేది ఆ ఊర్లో ఉన్న ఇలవేల్పు దేవుడి గుడి. ఒక లైన్‌లో చెప్పాలంటే.. ఓదెల విలేజ్‌లో ఒక కష్టం వస్తే, ఆ కష్టం పెద్దదైతే ఆ ఊరిలో ఉన్న ఓదెల మల్లన్న నాగ సాధు క్యారెక్టర్ ద్వారా ఎలా పరిష్కరించారనేది కథ. కంటెంట్, స్క్రీన్ ప్లే, విజువల్ వండర్‌గా ఉంటాయి. సౌందర్ రాజన్ చాలా అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు.అజనీష్ అద్భుతమైన మ్యూజిక్ చేస్తున్నారు. భైరవి పాత్రలో తమన్నా చాలా అద్భుతంగా నటించారు' అని సంపత్ నంది చెప్పారు.
నిర్మాత డి. మధు మాట్లాడుతూ, 'మహా కుంభమేళాలో రిలీజ్ చేసిన టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. కంటెంట్‌ని నమ్ముకుని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమా చేశాం. తమన్నా ఈ సినిమా కోసం కంప్లీట్‌గా ట్రాన్స్‌ఫామ్ అయ్యారు. సంపత్ నంది సూపర్ విజన్, డైరెక్టర్ అశోక్ దర్శకత్వం సినిమాని అద్భుతంగా తీర్చిదిద్దారు' అని తెలిపారు.
డైరెక్టర్ అశోక్ తేజ మాట్లాడుతూ, 'ఆకలిగా ఉందని అన్నం కోసం సంపత్ నంది దగ్గరికి వెళ్లాను ఆయన నాకు బిర్యాని తినిపించారు. సంపత్‌కి థ్యాంక్స్' అని చెప్పారు.



అన్ని రకాల అంశాలతో అలరిస్తుంది

మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ కాంబోలో తెరకెక్కిన భారీ చిత్రం 'ఎల్ 2 : ఎంపురాన్'. ఆశీర్వాద్ సినిమాస్, శ్రీ గోకులం మూవీస్ బ్యానర్లపై ఆంటోనీ పెరుంబవూర్, గోకులం గోపాలన్ నిర్మించారు. ఈనెల 27న మలయాళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతుంది.
ఈ నేపథ్యంలో శనివారం మేకర్స్ నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మోహన్‌లాల్ మాట్లాడుతూ, 'మా సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్న దిల్ రాజుకి థ్యాంక్స్. 47ఏళ్లుగా నా ఈ సినిమా ప్రయాణంలో తెలుగు చిత్ర సీమతో ఎంతో అనుబంధం ఉంది. తెలుగు ప్రేక్షకులు చూపించే ప్రేమ ఇంకెక్కడా దొరకదు. ఇండియాలోనే టాలీవుడ్ ది బెస్ట్ ఇండస్ట్రీగా ఉంది. పృథ్వీరాజ్ ఈ చిత్రంతో తెరపై అద్భుతం చేశారు. మేం ముందుగా లూసిఫర్‌ను మూడు పార్టులుగా తీయాలని అనుకున్నాం. ఎంపురాన్ బ్లాక్ బస్టర్ అయితే.. మూడో పార్ట్‌తో మళ్లీ వస్తాం. పాలిటిక్స్, యాక్షన్, ఎమోషన్స్, ఎంటర్టైన్మెంట్ ఇలా అన్ని రకాల అంశాలతో అందరినీ అలరించేలా ఉంటుంది' అని అన్నారు.
'ఇలాంటి సినిమాను మేం ఎప్పుడూ ట్రై చేయలేదు. ఒరిజినల్ వర్షన్‌లానే తెలుగు వర్షన్ ఉంటుంది. 'లూసిఫర్' సినిమాను అన్ని భాషల్లో రిలీజ్ చేయలేదు. కానీ అన్ని భాషల్లోకి ఆ చిత్రం రీచ్ అయింది. అందుకే ఇప్పుడు ఈ రెండో పార్ట్‌ను ప్రపంచ వ్యాప్తంగా అన్ని భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. బుకింగ్స్ ఓపెన్ చేసిన వెంటనే అన్నీ హౌస్ ఫుల్స్ అవుతున్నాయి. ఈ రేంజ్ ట్రెండ్ చూసి మేమంతా సర్‌ప్రైజ్ అవుతున్నాం. ఈ మూవీ కోసం మోహన్‌లాల్, నేను ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పని చేశాం. మూడో పార్ట్ చేసేలా సపోర్ట్ చేయండి' అని పృథ్వీరాజ్ సుకుమారన్ చెప్పారు.
దిల్ రాజు మాట్లాడుతూ, "లూసిఫర్' ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలిసిందే. మాలీవుడ్‌లో అత్యధిక బడ్జెట్‌తో తీసిన ఈ సీక్వెల్ ఏ రేంజ్‌లో ఉందో టీజర్, ట్రైలర్ చూస్తేనే అర్థం అవుతోంది. పృథ్వీరాజ్ సుకుమార్ పాన్ ఇండియా డైరెక్టర్ కాబోతోన్నారు. అన్ని భాషల్లో ఈ చిత్రం పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

డిఫరెంట్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్



'మాస్ సినిమాలు చేస్తున్నాను. కానీ రస్టిక్‌గా ఉండే సినిమా చేసి చాలా రోజులైంది. ఫ్యాన్స్ కోసం మంచి రస్టిక్ యాక్షన్ ఉన్న ఒక సినిమా చేయాలని నేను, డైరెక్టర్ అరుణ్ అనుకున్నాం. యాక్షన్‌తో పాటు మంచి ఎమోషన్ ఉన్న సినిమా 'వీర ధీర సూరన్' అని హీరో విక్రమ్ అన్నారు.
ఆయన హీరోగా ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య, సూరజ్ వెంజరాముడు, దుషార విజయన్ కీలక పాత్రలు పోషించారు. హెచ్ఆర్ పిక్చర్స్ రియా శిబు నిర్మించారు. ఎన్.వి.ఆర్ సినిమా తెలుగు రైట్స్‌ని సొంతం చేసుకోగా, మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా నైజాం రిలీజ్ జరుగుతుంది. ఈనెల 27న ఈ సినిమా విడుదల కానుంది.
ఈ సందర్భంగా హీరో విక్రమ్ మాట్లాడుతూ,'ఈ సినిమాలో సూర్యతో కలసి యాక్ట్ చేయడం ఎంతో సంతోషాన్నిచ్చింది. తుషార డిఫరెంట్ క్యారెక్టర్స్ చేస్తున్నారు. ఈ సినిమాలో ఆమె పెర్ఫార్మెన్స్, క్యారెక్టర్ మెమొరబుల్‌గా ఉంటాయి. పృథ్వీకి ఈ సినిమా ఒక టర్నింగ్ పాయింట్ అవుతుంది. ప్రసాద్‌ది లక్కీ హ్యాండ్. ఆయన మా సినిమాని రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇది డిఫరెంట్ మాస్ కమర్షియల్ ఎంటర్టైనర్. డైరెక్టర్ అరుణ్ ఈ సినిమాని చాలా అద్భుతంగా తీశాడు. జీవి ప్రకాష్ కుమార్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ప్రొడ్యూసర్స్ ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాని గ్రాండ్‌గా నిర్మించారు. ఇది అందరూ ఎంజాయ్ చేసే సినిమా. కచ్చితంగా మీరంతా ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను. ఈ సినిమా ఫస్ట్ షాట్ నుంచే కథ మొదలైపోతుంది. కాబట్టి ఐదు నిమిషాల ముందే థియేటర్‌లో ఉండేలా చూసుకోవాలని ప్రేక్షకులుని కోరుతున్నాను (నవ్వుతూ)' అని చెప్పారు.
సినిమా ట్రైలర్, టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. 'రంగస్థలం' లాంటి రా అండ్ రస్టిక్ సినిమా ఇది. ఇందులో నా క్యారెక్టర్ పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. అరుణ్ చాలా టాలెంటెడ్ డైరెక్టర్. ఈ సినిమాలో 16 నిమిషాల నిడివి గల ఒక సింగిల్ షాట్ ఉంది. ఆ షాట్‌ని మీరు థియేటర్స్‌లో చూడాల్సిందే' అని యస్ జె సూర్య చెప్పారు. నిర్మాత ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ,'మహారాజా' తర్వాత మేము తెలుగులో చేస్తున్న సినిమా ఇది. కచ్చితంగా ఇది సెన్సేషనల్ హిట్ అవుతుంది. ప్రేక్షకులు ఇప్పుడు ఏం కోరుకుంటున్నారో అన్ని ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉన్నాయి' అని అన్నారు.

ఘనంగా 'నాట్స్' 8వ తెలుగు సంబరాలు



ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) 8వ తెలుగు సంబరాలు ఈవెంట్ కు సిద్ధమవుతోంది. జూలై 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఈ ఉత్సవాలు అమెరికాలోని టంపాలో జరగనున్నాయి.
ఈ నేపథ్యంలో నాట్స్ 8వ తెలుగు సంబరాలు కార్యక్రమ కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సంబరాలు కాన్ఫరెన్స్ కన్వీనర్, పూర్వపు చైర్మన్ శ్రీనివాస్ గుత్తికొండ, నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేనితోపాటు జయసుధ, ఆమని, దర్శకులు హరీశ్ శంకర్, మెహర్ రమేష్, సంగీత దర్శకుడు తమన్, గీత రచయితలు రామజోగయ్య శాస్త్రి, చంద్రబోస్, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని, 'నాట్స్' చేస్తున్న సేవల గురించి కొనియాడారు.
నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని మాట్లాడుతూ, 'నాట్స్ అంటే సేవ, భాష ..ఈ రెండు పదాలు గుర్తుకువస్తాయి. అమెరికాలోని తెలుగు వారికి అండగా నిలబడేందుకు ఈ ఆర్గనైజేషన్‌ను స్థాపించాం. మా సంస్థ 8వ తెలుగు సంబరాల వేడుకలో పలువురు తెలుగు కవులు, కళాకారులు, నటీనటులు, ఇతర రంగాల ప్రముఖులు హాజరు కాబోతున్నారు' అని అన్నారు.

అందమైన మెలోడీ 'నాలో ఏదో..'


చాందినీ చౌదరి, విక్రాంత్

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. సంజీవ్ రెడ్డి దర్శకుడు. యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 26వ తేదీన ఫస్ట్ సింగిల్ 'నాలో ఏదో..'ని రిలీజ్ చేయబోతున్నారు. సునీల్ కశ్యప్ బ్యూటీఫుల్ కంపోజిషన్‌లో హీరో హీరోయిన్స్ విక్రాంత్, చాందినీ చౌదరి మధ్య వచ్చే రొమాంటిక్ సాంగ్‌గా ఈ పాటను చిత్రీకరించారు. ఈ పాటకు శ్రీజో లిరిక్స్ అందించారు. సింగర్స్ దినకర్ కల్వల, అదితి భావరాజు పాడారు. ఇటీవల డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీ సాంగ్స్ మీద కూడా మ్యూజిక్ లవర్స్‌లో మంచి ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి అని చిత్ర యూనిట్ తెలిపింది.

భిన్న కథతో

'ఎర్ర గులాబి'



యువన్ సూర్య ఫిలిమ్స్ పతాకం పై శ్రేయసి షాలిను హీరోయిన్‌గా పరిచయం చేస్తూ మనోహర్ చిమ్మని దర్శకత్వంలో నిర్మాత యువన్ శేఖర్ నిర్మిస్తున్న రోడ్-క్రైమ్-థ్రిల్లర్ సినిమా 'ఎర్ర గులాబి'.
ఈ చిత్ర ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌లను నిర్మాత యస్ కె యన్ శనివారం లాంచ్ చేశారు. 'ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ చాలా బాగున్నాయి. సినిమా కూడా చాలా బాగుంటుందని, బాగా ఆడాలని ఆశిస్తున్నాను' అని యువన్ సూర్య ఫిలిమ్స్ టీమ్‌కు ఆయన అభినందనలు తెలిపారు. నేటి సమాజంలోని పలు సున్నితమైన అంశాల్లో ఈతరం యువతకు నేరుగా కనెక్ట్ అయ్యే నేపథ్యంతో నిర్మిస్తున్న ఈ హీరోయిన్ ఓరియెంటెడ్ రోడ్-క్రైమ్-థ్రిల్లర్ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాలో యువతరాన్ని హుషారెత్తించే ఒక తెలంగాణ ఫోక్ సాంగ్, ఇంగ్లీష్ సాంగ్‌తో కలిపి మొత్తం 3 వైవిధ్యమైన పాటలున్నాయి. లేడీ 'యానిమల్'ను తలపించేలా మంచి యాక్షన్ సన్నివేశాలున్నాయి. ఒక ఫుల్ లెంగ్త్ కామెడీ పాత్రలో జబర్దస్త్ వీరబాబు నటించాడు. అభ్యుదయ చిత్రాల దర్శకుడు బాబ్జీ ఈ సినిమాలో ఒక సెన్సేషనల్ రోల్‌లో నటించడం విశేషం. మనూటైమ్ మూవీ మిషన్ సమర్పణలో రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

వచ్చే ఐదేండ్లలో స్టార్టప్‌లు రెట్టింపు

- 2030 నాటికి 2.4 లక్షలకు చేరొచ్చు
- లాంగ్‌హౌస్ రిపోర్ట్



న్యూఢిల్లీ : వచ్చే ఐదేళ్లలో భారత్‌లో స్టార్టప్‌ల సంఖ్య రెట్టింపు కావొచ్చని ఎగ్జిక్యూటివ్ సర్చ్ సంస్థ లాంగ్‌హౌస్ అంచనా వేసింది. 2030 నాటికి స్టార్టప్‌ల సంఖ్య 2.4 లక్షలకు చేరొచ్చని తెలిపింది. 2023లో స్టార్టప్‌ల సంఖ్య 1.2 లక్షలుగా ఉందని.. భారతదేశ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ వేగంగా విస్తరించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించింది. లాంగ్‌హౌస్ రిపోర్ట్ ప్రకారం.. స్టార్టప్‌ల పెరుగుదలతో యూనికార్న్‌లు లేదా 1 బిలియన్ డాలర్లు (రూ.8600 కోట్లు) విలువ కలిగిన సంస్థలు పెరగొచ్చు. 2030 చివరి నాటికి యూనికార్న్‌ల సంఖ్య 280కి చేరొచ్చు. ప్రస్తుతం వీటి సంఖ్య 120గా ఉంది. స్టార్టప్‌ల విస్తరణ ఉపాధిని భారీగా పెంచనుంది. స్టార్టప్‌లు కీలక రంగాలలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ కల్పనకు దోహదం చేయనున్నాయి.

ఐదు కోట్ల ఉద్యోగాలు..

వచ్చే 2030 నాటికి స్టార్టప్‌ల్లో మొత్తంగా ఐదు కోట్ల ఉద్యోగాలు సృష్టించబడే అవకాశాలున్నాయని లాంగ్‌హౌస్ నివేదిక తెలిపింది. వీటిలో 40 నుంచి 50 లక్షలు వైట్ కాలర్ ఉద్యోగాలు ఉండొచ్చు. మరో కోటి ఉద్యోగాలు గిగ్ ఎకానమీ నుండి వస్తాయి. పరిశ్రమలలో 3.5 కోట్ల నుంచి 4 కోట్ల పరోక్ష ఉద్యోగాలు ఉండొచ్చని అంచనా. "ఇప్పటికే ఉన్న స్టార్టప్‌ల్లో కంటే కొత్త సంస్థల్లోనే ఎక్కువ ఉద్యోగాల సృష్టి చోటు చేసుకోవచ్చు. దేశంలో ప్రస్తుతం 120 యూనికార్న్‌లుండగా.. 2030 నాటికి 280కి చేరొచ్చు. ముఖ్యంగా ఎఐ, సాస్, క్లీన్ టెక్, ఫిన్‌టెక్ రంగాల్లో ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉండొచ్చు." అని లాంగ్‌హౌస్ సీనియర్ పార్ట్‌నర్ రోహిత్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.

కలిసస్తోన్న అనుభవం..

2020 నుంచి 2024 మధ్య యునికార్న్ వ్యవస్థాపకులలో దాదాపు 40 శాతం మందికి 10 నుండి 15 సంవత్సరాల ముందు పని అనుభవం ఉంది. ఇది 2008 నుండి 2013 కాలంలో 26 శాతంగా ఉంది. యునికార్న్ వ్యవస్థాపకులలో 55 శాతం మంది తమ వెంచర్‌లను ప్రారంభించే ముందు ఏదో ఒక సంస్థలో నాయకత్వ పాత్రలను కలిగి ఉన్నారు. 20 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న యునికార్న్ వ్యవస్థాపకుల వాటా ఇటీవలి సంవత్సరాలలో 30 శాతానికి చేరుకుంది. ఇది మరింత అనుభవ వ్యాపారవేత్తల వైపు మళ్లడాన్ని సూచిస్తుంది. కాగా.. ఇటీవల స్టార్టప్‌లకు తగ్గుతోన్న నిధుల నేపథ్యంలో ఆ సంస్థలు ఆర్థికంగా ఎలా మద్దతును అందుకోగలవో వేచి చూడాలి.

ట్విట్టర్ పాత లోగో పిట్ట వేలం



వాష్టింగ్టన్ : ఎలన్ మస్క్‌కు చెందిన దిగ్గజ సోషల్ మీడియా వేదిక ట్విటర్ (ప్రస్తుతం ఎక్స్) పాత లోగో బ్లూ బర్డ్‌ను వేలం వేశారు. దీన్ని ఆర్ఆర్ ఆక్షన్ వేలం వేయగా 35వేల డాలర్లకు (దాదాపు రూ.30లక్షలు)కు అమ్ముడుపోయింది. ట్విట్టర్‌ను 2022లో ఎలన్‌మస్క్ కొనుగోలు చేసిన తర్వాత ఆ సంస్థ పేరును, లోగోను ఎక్స్‌గా మార్చారు. ఒకప్పుడు శాన్‌ఫ్రాన్సిస్కోలోని హెడ్‌క్వార్టర్ వద్ద దర్శనమిచ్చిన 12 అడుగుల పొడుగు, 9 అడుగుల వెడల్పు, 254 కిలోల బ్లూ బర్డ్ గుర్తు దాదాపు రూ.30 లక్షలకు వేలంలో విక్రయించినట్లు ఆర్ఆర్ ఆక్షన్ తెలిపింది. కాగా.. దీన్ని ఎవరు దక్కించుకున్న విషయాన్ని ఆ సంస్థ వెల్లడించలేదు.

రూ.550 కోట్ల ఐపీఓకు ఎస్ఎస్ఎఫ్ ప్లాస్టిక్స్

ముంబయి : ఎస్ఎస్ఎఫ్ ప్లాస్టిక్స్ రూ.550 కోట్ల ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) కోసం సెబీకి ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. ప్రతిపాదిత ఐపిఒ కింద రూ.300 కోట్లు విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ సంస్థలు రూ.250 కోట్ల విలువ చేసే షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్) మార్గంలో విక్రయించనున్నాయి. ప్రస్తుతం ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ సంస్థలకు కంపెనీలో 100 శాతం వాటాలు ఉన్నాయి. బాటిల్స్, కంటైనర్స్, ఇంజినీరింగ్ ప్లాస్టిక్ కాంపోనెంట్లు మొదలైన వాటి డిజైనింగ్ నుంచి డెలివరీ వరకు వివిధ ప్యాకేజింగ్ సొల్యూషన్స్‌ను ఎస్‌ఎస్ఎఫ్ ప్లాస్టిక్స్ అందిస్తోంది.

భవిష్యత్తులో కెఎల్ఎం ఆక్సివా పబ్లిక్ ఇష్యూ

- సీఈఓ మనోజ్ రవి వెల్లడి

హైదరాబాద్ : రాబోయే ఏళ్లలో తమ సంస్థను పబ్లిక్ ఇష్యూకు తీసుకువచ్చే యోచనలో ఉన్నామని కెఎల్ఎం ఆక్సివా ఫిన్‌వెస్ట్ సీఈఒ మనోజ్ రవి తెలిపారు. ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) కోసం ప్రణాళికలు వేసుకుంటున్నామన్నారు. కెఎల్ఎం ఆక్సివా ఫిన్‌వెస్ట్ హైదరాబాద్‌లో రజతోత్సవ వేడుకలను నిర్వహించింది. రూ.2,000 కోట్ల పైగా విలువ కలిగిన ఈ ఎన్‌బిఎఫ్‌సి శనివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన ఫార్చునా ఉద్యోగులతో 25వ సదస్సు వేడుకలను జరుపుకుంది. దేశంలో తమ సంస్థకు 1000 కి పైగా శాఖలు ఉన్నాయని మనోజ్ రవి తెలిపారు.

జొమాటో కొత్త పేరు ఎటర్నల్ లిమిటెడ్

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో తన పేరును 'ఎటర్నల్ లిమిటెడ్'గా మార్చే ప్రతిపాదనకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఆమోదముద్ర వేసింది. ఇది మార్చి 20 నుంచి అమల్లోకి వస్తుందని ఆ కంపెనీ శనివారం వెల్లడించింది. అయితే తమ ఫుడ్ డెలివరీ వ్యాపార విభాగం మాత్రం జొమాటోగానే కొనసాగుతుందని తెలిపింది. కార్పొరేట్ సంస్థ పేరు, స్టాక్ పేరు మాత్రం ఎటర్నల్‌గా మారుతాయని పేర్కొంది. తన ప్రధానమైన జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్ సంస్థలకు ఎటర్నల్ మాతృసంస్థగా ఉంటుందని వెల్లడించింది.

సామ్‌సంగ్ నుంచి ఏఐ గెలాక్సీ బుక్5 సిరీస్

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా గెలాక్సీ బుక్5 సిరీస్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. అత్యాధునిక పనితీరు, ఎఐ ఫీచర్లతో వీటిని రూపొందించినట్లు పేర్కొంది. ఇంటెల్ కోర్ అల్ట్రాతో లభించే వీటి ప్రారంభ ధరను రూ.1,14,900గా నిర్ణయించినట్లు వెల్లడించింది. ఇంతక్రితం గెలాక్సీ బుక్4 సిరీస్ మోడల్‌తో పోల్చితే రూ.15వేలు తక్కువని తెలిపింది.

బంధన్ ఎఎంసి నుంచి 'వేదార్థ' వేదిక

న్యూఢిల్లీ : బంధన్ ఎఎంసి కొత్తగా ప్రత్యామ్నాయ పెట్టుబడి వేదిక 'వేదార్థ'ను ప్రారంభించింది. ఈ వేదికలో బంధన్ ఎఎంసిల ఎఐఎఫ్, పిఎంఎస్‌లోని ఈక్విటీ, స్థిర ఆదాయ పరిష్కారాల ఉత్పత్తులను పొందుపర్చుతున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. దీనికి హెడ్‌గా మినాల్ సింగ్ వ్యవహరిస్తారని తెలిపింది.

బ్రెయిట్లింగ్ 140వ వార్షికోత్సవ ఎగ్జిబిషన్

హైదరాబాద్ : నగరంలోని కమల్ వాచ్ కంపెనీ వద్ద బ్రెయిట్లింగ్ తన 140వ వార్షికోత్సవ వింటేజ్ వాచ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను బ్రెయిట్లింగ్ బోటిక్ వద్ద మార్చి 25 వరకు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. 1884లో కార్యకలాపాలు ప్రారంభించిన బ్రెయిట్లింగ్ 140 ఏళ్లుగా వాచ్ తయారీ ఆవిష్కరణలలో ఉంది. తమ ఎగ్జిబిషన్‌లో విప్లవాత్మక గడియారాలను చూసే అవకాశాన్ని కల్పిస్తున్నామని బ్రెయిట్లింగ్ సిఇఒ జార్జెస్ కెర్న్ పేర్కొన్నారు.

ట్రయల్ రన్‌కు మరో రెండ్రోజులు

ఆస్ట్రియా ఇంజినీరు కోసం ఎదురుచూపులు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

> దేవన్నపేట పంప్‌హౌజ్‌కు మళ్లీ రానున్న మంత్రులు
> వచ్చే ఖరీఫ్‌కు సాగునీరు..?

దేవాదుల ప్రాజెక్టు 3వ దశలోని మూడో ప్యాకేజీ కింద హనుమకొండ జిల్లా హసనపర్తి మండలంలోని దేవన్నపేట పంప్‌హౌజ్‌లో ఒక్క మోటార్‌ను రన్ చేసి 50వేల ఎకరాలకు సాగునీరందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ నెల 18న నీటి పారుదల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దేవన్నపేట పంప్‌హౌజ్‌కు మోటార్ స్విచ్చాన్ చేయడానికి వచ్చినా పనులు పూర్తి కాక పోవడంతో అర్ధరాత్రి వరకు వేచి చూశారు. వారం రోజులుగా ప్రాజెక్టుల మోటార్లకు సంబంధించిన సలహా దారులు కె. పెంటారెడ్డి ప్రాజెక్టు వద్దనే మకాం వేసి మోటార్ల బిగింపు, ట్రయల్‌రన్‌కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టు అధికారులు సైతం ఇక్కడే మకాం వేశారు. కాగా, ఆస్ట్రియాలోని 'ఆండ్రిట్జ్' కంపెనీకి చెందిన మోటార్లను దేవన్నపేట పంప్‌హౌజ్‌లో వినియోగి స్తుండటంతో ఆ కంపెనీ ఇంజినీర్ల సమక్షంలోనే వాటిని రన్ చేయాల్సి ఉంది. దేవన్నపేట పంప్‌హౌజ్‌లో ఒక్క మోటర్‌నైనా రన్ చేస్తే ధర్మసాగర్ రిజర్వాయర్‌ను నింపడానికి అవకాశముంటుంది. తద్వారా వరంగల్ నగరంతోపాటు పలు గ్రామాలకు తాగునీరు, పంటలకు సాగునీరందనుంది. రబీలో సాగుచేసిన వరి పొట్ట దశలో ఉండటంతో చివరిదశలో నీరందించాలని రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ఉంది. దాంతో రాత్రిపగళ్లు దేవన్నపేట పంప్‌హౌజ్‌లో నిరంతరం పనులు జరుగుతున్నాయి. దేవన్నపేటలో ఒక్క మోటర్‌ను విజయవంతంగా రన్ చేసినా 40 నిమిషాల్లో ఇక్కడి నుంచి గోదావరి జలాలు ధర్మసాగర్ రిజర్వాయర్‌కు చేరుతాయి. రామప్పలో ప్రస్తుతం 1 టీఎంసీల నీరుంది. ధర్మసాగర్ రిజర్వాయర్ ను గోదావరి జలాలతో నింపడం ద్వారా మార్చి 31 తర్వాత గ్రేటర్ వరంగల్‌కు తాగునీటి సమస్య రాకుండా ఉంటుందని అధికారులు ట్రయల్ రన్ కోసం తీవ్రంగా పని చేస్తున్నారు.

2008లో రూ.1,410 కోట్లతో పనులు ప్రారంభం

మూడో ప్యాకేజీ పనులను 2008లో రూ.1,410 కోట్లతో ప్రారంభించారు. మూడో దశలో సలివాగులో టన్నెల్ పనుల్లో ప్రమాదం ఏర్పడి కార్మికులు మృతి చెందడంతో 2016 వరకు నిలిచిపోయాయి. సుమారు తొమ్మిదేండ్ల విరామం తరువాత మళ్లీ 2017లో పనులు ప్రారంభమయ్యాయి. దేవన్న పేటలో 144.5 మీటర్ల అత్యంత లోతైన పంప్‌హౌజ్‌ను నిర్మించారు. ఈ ప్యాకేజీలో రామప్ప నుంచి ధర్మసాగర్ రిజర్వా యర్ వరకు 49.06 కిలోమీటర్ల మేరకు టన్నెల్‌లో గోదావరి జలాలను తరలిస్తున్నారు. దేవన్నపేట పంప్‌హౌజ్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్ వరకు 6.86 కిలోమీటర్లు ఉంటుంది. దేవన్నపేట పంప్‌హౌజ్‌లో 3 మోటర్లను అమర్చారు. ఈ పంప్‌హౌజ్‌ను ప్రారంభిస్తే ఒక్కో మోటర్‌తో 16.56 క్యుమెక్స్ అంటే మొత్తం 49.68 క్యుమెక్స్ (1,750 క్యుసెక్కులు) గోదావరి జలాలను తరలించి వేగంగా ధర్మసాగర్ రిజర్వాయర్‌ను నింపడానికి అవకాశముంది. రామప్ప సరస్సు సముద్రమట్టానికి 209.38 మీటర్ల ఎత్తులో ఉంది. ధర్మసాగర్ రిజర్వాయర్ 309.5 మీటర్ల ఎత్తులో ఉంది. దేవాదుల మూడో దశలో మూడో ప్యాకేజీ కింద రామప్ప నుంచి దేవన్నపేట వరకు గ్రావిటీ ద్వారా గోదావరి జలాలు రానున్నాయి. దేవన్నపేట నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌కు ఎత్తిపోతలతో గోదావరి జలాలను తరలిస్తారు. దేవన్నపేటలో మూడు మోటర్లతో ట్రయల్ రన్ సక్సెస్ అయితే వచ్చే వానాకాలం జనగామ జిల్లాతోపాటు యాదాద్రి, సూర్యపేట జిల్లాలకు సాగునీరందుతుంది. ఒక్క మోటర్‌ను రన్ చేయడానికి 'ఆండ్రిట్జ్' కంపెనీకి చెందిన కీలక ఇంజినీర్ ఇక్కడకు రావడానికి వీసా కోసం ప్రయత్నిస్తు న్నట్టు సమాచారం. శనివారం లేదా ఆదివారం వరకు దేవన్నపేటకు చేరుకునే అవకాశముంది. ట్రయల్ రన్ విజయవంతమైతే రెండ్రోజుల్లో మళ్లీ మంత్రులు దేవన్నపేటకు వచ్చి మోటర్‌ను స్విచాన్ చేసి ధర్మసాగర్ రిజర్వాయర్ కింద 60వేల ఎకరా లకు సాగునీరందించను న్నారని తెలిసింది. కాగా, తొమ్మిదేండ్ల జాప్యంతో అంచనా వ్యయం రూ.270 కోట్లు అదనంగా పెరిగింది.



వానకాలపుసాగుకు సాగునీరు..?

రబీ సాగు ముగింపు దశకు చేరుకోవడంతో ఇక ఈ పంప్‌హౌజ్‌తో వానాకాలపు సాగుకు సమృద్ధిగా సాగునీరందించే అవకాశముంది. ఈ మూడు మోటర్లతో గోదావరి జలాలను పంపింగ్ చేస్తే పది రోజుల్లో 1.50 టీఎంసీల నీటితో ధర్మసాగర్ రిజర్వాయర్‌ను నింపవచ్చు. దేవన్నపేటలో మూడు మోటర్ల బిగింపు, ట్రయల్‌రన్ సక్సెస్ అయితే వచ్చే వానాకాలంలో మూడో ప్యాకేజీ కింద భూములు సస్యశ్యామలం కానున్నాయి.

ప్రొ. శివానందన్‌కు ఐద్వా సంఘీభావం

ఈ నెల 24న స్టూడెంట్స్ మార్చ్‌కు మద్దతు

న్యూఢిల్లీ : టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్ఎస్) నుంచి అన్యాయంగా రెండేండ్ల పాటు సస్పెండ్ చేయడిన దళిత పీహెచ్‌డీ స్కాలర్ రాందాస్ ప్రిని శివానందన్‌కు ఐద్వా సంపూర్ణ సంఘీభావం తెలిపింది. టీఐఎస్ఎస్ డెవలప్‌మెంట్ స్టడీస్ విభాగం స్కాలర్ ప్రిని శివానందన్‌పై జారీ చేసిన సస్పెండ్ ఉత్తర్వు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, ప్రభుత్వ అన్యాయమైన విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే ప్రజాస్వామ్య హక్కుపై దాడిగా ఐద్వా విమర్శించింది. ఈ సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా బాంబే హైకోర్టులో శివానందన్ సవాల్ చేసినా దురదృష్టవశాత్తూ ఈ నెల 12న అతని పిటిషన్‌ను కొట్టివేసిందని ఐద్వా తెలిపింది. దీంతో టీఐఎస్ఎస్ యొక్క చట్టవిరుద్ధ చర్యలకు కోర్టు స్పష్టంగా మద్దతు ఇచ్చినట్లయిందని పేర్కొంది. కోర్టు చర్య ఇతర విశ్వవిద్యాలయాలు ఉపాధ్యాయులు, విద్యార్థుల నిరసన హక్కులను హరించడానికి ధైర్యం చేస్తుందని ఐద్వా ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్ఈపీ, విద్యను కాషాయీకరణ చేయడం, నిరుద్యోగం వంటి వాటికి వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కును ప్రస్తావించడానికి ఇప్పుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాలని శివానందన్ యోచిస్తున్నట్టు తెలిపింది. తన పిటిషన్ కొట్టివేసిన తరువాత శివానందన్ చెప్పిన 'ప్రతీ ఒక్కరికీ విద్య, ఉపాధి అందుబాటులోకి వచ్చేవరకూ అధ్యయనం, పోరాటం కొనసాగుతుంది' అనే వ్యాఖ్యలను ఐద్వా గుర్తు చేసింది. ఎన్ఈపీ, బీజేపీ-ఆర్ఎస్ఎస్ నియమించిన విద్యా సంస్థల అధిపతుల చట్టవిరుద్ధ చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులందరికీ ఐద్వా తన సంఘీభావాన్ని తెలియజేసింది. గత కొన్నేండ్లుగా వ్యక్తిగత వేధింపులు ఎదుర్కొంటున్నప్పటికీ శివానందన్ కొనసాగిస్తున్న పోరాటాన్ని ఐద్వా ప్రశంసించింది. ఈ నెల 24న నిర్వహిస్తున్న పార్లమెంట్‌కు యునైటెడ్ స్టూడెంట్స్ మార్చ్‌కు ఐద్వా హృదయపూర్వక మద్దతు ప్రకటించింది. కాగా, జాతీయ విద్యా విధానం అమలుకు వ్యతిరేకంగా గతేడాది ఏప్రిల్‌లో ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫోరం నిర్వహించిన జాతీయ ర్యాలీలో పాల్గొన్నందుకు శివానందన్‌ను టిఐఎస్ఎస్ సస్పెండ్ చేసింది. రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్నారని, శివానందన్ 'జాతి వ్యతిరేకి' అని ఉత్తర్వుల్లో టీఐఎస్ఎస్ ఆరోపించింది.

ఎన్‌పీడీసీఎల్‌లో రెవెన్యూ లోటు తీర్చేదెలా..?

- రూ.10,393 కోట్ల భర్తీకి ప్రత్యామ్నాయాలపై సమాలోచనలు..
- ప్రభుత్వ సబ్సిడీ ఎంత..?

నవతెలంగాణ- వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎన్‌పీడీసీఎల్) 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.10,393 కోట్ల రెవెన్యూ లోటుందని అంచనా వేశారు. ఈ రెవెన్యూ లోటును ఎలాంటి ప్రత్యామ్నాయాలతో భర్తీ చేస్తారనే విషయం మాత్రం టీఎస్ఈఆర్‌సీ చేపట్టిన బహిరంగ విచారణలో ప్రస్తావించలేదు. టారీఫ్‌లో ఎలాంటి పెంపుదల లేకుండా ఇంత భారీ లోటును పూడ్చుకోవడానికి ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచడంలో ఎన్‌పీడీసీఎల్ విఫలమైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ కొనుగోలుకే రూ. 14,042కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. సరఫరా ఖర్చులే రూ.613 కోట్లు.రూ.19,814 కోట్ల సమగ్ర ఆదాయం ఆవశ్యకతగా అంచనా వేశారు. నష్టాలను తగ్గించుకోవడానికి తీసుకుంటున్న చర్య లను సైతం సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి వివరించారు.ఈ నష్టాలను తగ్గించడం వల్ల ఎంత ఆదాయం సమకూరుతుందనే విషయాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు.

ప్రభుత్వ సబ్సిడీ ఎంత..?

రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఇందులో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకం కింద విద్యుత్ సబ్సిడీ ఇస్తున్నారు. వ్యవసాయ రంగానికి ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎన్పీడీసీఎల్‌కు ఎంత సబ్సిడీ చెల్లిస్తుందనే వివరాలు ఎక్కడా పొందుపరచలేదు. గృహజ్యోతి పథకానికి సంబంధించి మాత్రం కంపెనీ పరిధిలో 24 లక్షల 50 వేల 795 కుటుంబాలకు రూ.925 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు.

వ్యవసాయ సర్వీసుల్లో పెరుగుదల..

కంపెనీ పరిధిలో 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకు 33 వేల 397 వ్యవసాయ సర్వీసులను విడుదల చేస్తే, 2024లో 39 వేల 351 సర్వీసులను విడుదల చేశారు. 2025 మార్చి వరకు ఎన్ని వ్యవసాయ సర్వీసులు విడుదల చేశారనే వివరాలు పొందుపరచలేదు.ఏదేమైనా 2023, 2024 సంవత్సరాలను పరిశీలిస్తే 5,954 సర్వీసులు పెరిగాయి.

అలహాబాద్ హైకోర్టు తీర్పుపై ఐద్వా తీవ్ర ఆవేదన

న్యూఢిల్లీ : అలహాబాద్ హైకోర్టు ఏక సభ్య ధర్మాసనం ఇటీవల ఇచ్చిన తీర్పుపై ఐద్వా తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. మైనర్ బాలిక రొమ్ము పట్టుకుని లాగడం, పైజమా తాడును తెంపడం వంటి చర్యలు అత్యాచారం కిందకు రావని, లైంగిక వేధింపులు, దుస్తులు చింపడం వంటి మైనర్ నేరం కిందకు వస్తుందని హైకోర్టు ఒక సమీక్షా కేసులో తీర్పు ఇవ్వడంపై ఐద్వా దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం ఐద్వా అధ్యక్షులు పికె శ్రీమతి, న్యాయ సలహాదారు కీర్తీ సింగ్, ప్రధాన కార్యదర్శి మరియం ధవలే ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కేసు వివరాల ప్రకారం ఒంటరిగా వెళుతున్న 11 ఏళ్ల బాలికను బైక్‌పై ఇంటి వద్ద దింపుతామని ఆశపెట్టిన ఇద్దరు నిందితులు, ఒక నిర్మానుష ప్రదేశం వద్ద బైక్‌ను నిలిపి బాలికను ఒక కల్వర్ట్ కిందకు లాక్కుని వెళ్లారు. తరువాత మైనర్ బాలిక రొమ్ము పట్టుకుని లాగడం, పైజమా తాడును తెంపడం వంటి చర్యలకు పాల్పడ్డారు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేయగా కుటుంబ సభ్యులు విని సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. నిందితులను ఆపడానికి ప్రయత్నించారు. దీంతో కుటుంబ సభ్యులను దేశవాళీ తుపాకీతో భయపెట్టి నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనపై ఐపిసి, పోక్సో చట్టం కింద అత్యాచారం కేసు నమోదయింది., ట్రయల్ కోర్టు ఇద్దరు నిందితులకు సమన్లు కూడా జారీ చేసింది. నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ కేసు తీవ్రతను తగ్గిస్తూ మైనర్ బాలిక రొమ్ము పట్టుకుని లాగడం, పైజమా తాడును తెంపడం వంటి చర్యలు అత్యాచారం కిందకు రావని, లైంగిక వేధింపులు, దుస్తులు చింపడం వంటి మైనర్ నేరం కిందకు వస్తుందని తీర్పు చెప్పింది. 11 ఏళ్ల బాలికపై జరిపిన ఈ దారుణ చర్యలు ఖచ్చితంగా అత్యాచారం కిందకు వస్తాయని ఐద్వా ప్రకటనలో పేర్కొంది. హైకోర్టు జడ్జి నిందితుడికి కనీసం వారెంటు కూడా జారీ చేయకపోవడాన్ని ఐద్వా ప్రముఖంగా ప్రస్తావించింది. ఈ తీర్పు పితృస్వామ్య పక్షపాతంతో కూడి ఉందని, ఒక అమాయక మైనర్ బాలికపై దారుణాలను తక్కువ చేసేదిగా ఉందని ఐద్వా విమర్శించింది. హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ఈ కేసుపై మాత్రమే కాకుండా, ప్రస్తుతం విచారణలో ఉన్న ఇతర కేసులపై కూడా ప్రభావం చూపించే అవకాశం ఉందని ఐద్వా హెచ్చరించింది. కాబట్టి ఈ తీర్పుపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లాలని ఐద్వా డిమాండ్ చేసింది. అదేవిధంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళ్లే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ఉద్యమం నిర్వహించాలని తన విభాగాలకు ఐద్వా పిలుపునిచ్చింది.

బూత్ స్థాయి సమస్యల పరిష్కారానికి రాజకీయ పార్టీలతో ఈసీ అధికారుల భేటీలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 4 వేలకు పైగా ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు తమ తమ అసెంబ్లీ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న పోలింగ్ బూత్ స్థాయిలోని సమస్యలను పరిష్కరించడానికి అఖిల పక్ష సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 31 వరకూ ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని భారత ఎన్నికల సంఘం శనివారం వెల్లడించింది. బూత్ స్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి రాజకీయ పార్టీలతో బహుళ స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఎన్నికల సంఘం ఇటీవల తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. నాలుగు వేలకు పైగా ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులతో పాటు 788 జిల్లా ఎన్నికల అధికారులు, 36 రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు కూడా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఇటువంటి సమావేశాలను నిర్వహించాలని ఇసి ఆదేశించింది.

విమానాలు ఆలస్యం

సమయానికి రావటం లేదు

- ఎయిర్ ఇండియాపై సుప్రియా సూలే అసహనం



న్యూఢిల్లీ : దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా సేవలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విమానంలో తనకు విరిగిపోయిన సీటును కేటాయించారంటూ కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఎయిర్ ఇండియాపై ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూడా ఎయిర్ ఇండియా సేవలపై పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, ఎయిర్ ఇండియా సేవలలో ఆశించినంత మార్పు వచ్చినట్టు కనబడటం లేదు. తాజాగా ఎన్సీపీ(శరద్ పవార్) ఎంపీ సుప్రియా సూలే సైతం దేశీయ విమానయాన సంస్థపై తన అసహనం వ్యక్తం చేశారు. ఎయిర్ ఇండియా విమానాలు సమయానికి రావటంలేదని ఆమె ఆరోపించారు. తాను గంటకు పైగా వేచి ఉండాల్సి వచ్చిందంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "ఎయిర్ ఇండియా విమానాలు నిరంతరం ఆలస్యమవుతున్నాయి. ఇది ఏమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. మేం ప్రీమియం ఛార్జీలు చెల్లిస్తాము.. అయినప్పటికీ విమానాలు సమయానికి రావు. ఆలస్యం కారణంగా పిల్లలు, సీనియర్ సిటిజన్స్, నిపుణులు ఇలా ఎంతో మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేను ఎయిర్ ఇండియా సంస్థకు విమానంలో ప్రయాణించాను. దీని కోసం గంట 19 నిమిషాలు వేచి చూడాల్సి వచ్చింది. ఇలాంటి జాప్యాలు పునరావృతం కాకుండా ఆయా సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి. విమానయాన సంస్థలు జవాబుదారీతనంతో వ్యవహరించేలా కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలి" అని ఆమె ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతున్నది. బీజేపీ నేత జైవీర్ షెర్గిల్ సైతం ఎయిర్ ఇండియా సేవలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎయిర్ ఇండియాకు 'చెత్త ఎయిర్‌లైన్స్' విభాగంలో ఆస్కార్ అవార్డు ఇవ్వాలంటూ వ్యాఖ్యానించారు. సంస్థ అన్ని రికార్డులనూ బద్దలు కొట్టిందని వ్యాఖ్యానించటం గమనార్హం.



చిట్యాల మండలంలో బర్డ్ ఫ్లూ

- 2లక్షల కోళ్లను చంపి పూడ్చిపెట్టిన అధికారులు

నవతెలంగాణ-చిట్యాల

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులోని కోళ్ల ఫామ్‌లో బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. కోళ్లకు పరీక్షలు చేయగా బర్డ్ ఫ్లూ వచ్చినట్టుగా నిర్ధారణ అయిందని జేడీ రమేశ్ తెలిపారు. రోజువారి పరీక్షల్లో భాగంగా మూడ్రోజుల కిందట ఫామ్‌లో కోళ్ల శాంపిల్స్‌ను హైదరాబాద్‌కు పంపించారు. అక్కడ బర్డ్ ఫ్లూ పాజిటివ్‌గా వచ్చిందని తెలిపారు. శనివారం ఉదయం కోళ్ల ఫామ్‌లో వెటర్నరీ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి పరిశీలించి సుమారు రెండు లక్షల కోళ్లను చంపినట్టు చెప్పారు. వాటిని నాలుగు అడుగుల లోతు గుంత తీసి జేసీబీ సహాయంతో కోళ్లను పూడ్చేశారన్నారు. బర్డ్ ఫ్లూ ఉన్న కోళ్ల ఫామ్‌కు 10 కిలోమీటర్ల పరిధిని రెడ్ జోన్‌గా పరిగణిస్తున్నామని, ఆ ప్రాంతాన్ని మూడు జోన్‌లుగా విభజించి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అక్కడి ప్రాంత ప్రజలు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. మూడు కిలోమీటర్ల పరిధిలో ఒక జోన్, 6 కిలోమీటర్ల పరిధిలో రెండో జోన్, 10 కిలోమీటర్ల పరిధిలో మూడో జోన్‌గా పరిగణించి ఆ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడూ పరీక్షలు చేస్తూ బర్డ్ ఫ్లూను నియంత్రించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

వెస్పా 2025 స్కూటర్ల ప్రదర్శన



హైదరాబాద్ : ప్రముఖ ప్రీమియం స్కూటర్ల తయారీ కంపెనీ పియాజియో తన వెస్పా లగ్జరీ స్కూటర్లు, 2025 వెస్పా పోర్ట్‌ఫోలియోను హైదరాబాద్‌లో ప్రదర్శించింది. తన వెస్పా, అప్రిలియాలను ఆధీకృత మోటోప్లెక్స్ డీలర్ వద్ద పలు మోడళ్లను అందుబాటులో ఉంచింది. 2025 వెస్పా పోర్ట్‌ఫోలియో సరికొత్త సాంకేతికతను కలిగి ఉందని పియాజియో వెహికల్స్ 2డబ్ల్యు డొమెస్టిక్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అజయ్ రఘువంశీ పేర్కొన్నారు. కొత్త వెస్పా ఎప్పటిలాగే ప్రత్యేకంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

గొంతు నొక్కుతా..

- మహిళా నిరసనకారులకు బీజేపీ నేత బెదిరింపులు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- పశ్చిమ బెంగాల్‌లో ఘటన

కోల్‌కతా: మహిళల పట్ల బీజేపీ నేతలు అగౌరవంగా ప్రదర్శిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఇఅంటి ఘటనే ఒకటి చోటు చేసుకున్నది. రోడ్డు ప్రారంభోత్సవానికి వెళ్లిన బీజేపీ సీనియర్ నేత పట్ల స్థానిక మహిళలు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆయన సహనం కోల్పోయారు. గొంతు నొక్కుతానంటూ మహిళలను ఆయన బెదిరించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మెదినీపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఈనెల 21న ఖరగ్‌పూర్‌లోని ఆరో నంబర్ వార్డులో కొత్తగా నిర్మించిన రోడ్డును ప్రారంభించేందుకు బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ దిలీప్ ఘోష్ వెళ్లారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలు ఆయనను చుట్టుముట్టారు. ఆయన ఎంపీగా ఉన్నప్పుడు ఎక్కడా కనిపించలేదంటూ నిరసన తెలిపారు. తమ కౌన్సిలర్ ప్రదీప్ సర్కార్ ఈ రోడ్డును నిర్మించారని అన్నారు. ప్రారంభోత్సవం కోసం ఆయన రావడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేత దిలీప్ ఘోష్ తీవ్రంగా స్పందించారు. మహిళా నిరసనకారులను తృణమూల్ మద్దతుదారులుగా ముద్రించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఎంపీలాడ్ నిధులతో ఈ రోడ్డును నిర్మించినట్టు చెప్పారు. "మీ నాన్న డబ్బులతో కాదు. వెళ్లి ప్రదీప్ సర్కార్‌ని అడగండి" అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై కొందరు మహిళలు ఆగ్రహించారు. తమ తండ్రి గురించి ఎందుకు ప్రస్తావించావని దిలీప్ ఘోష్‌ను నిలదీశారు. ప్రజాప్రతినిధివైన నువ్వు ఇలా మాట్లాడవచ్చా? అని ప్రశ్నించారు. దీంతో దిలీప్ ఘోష్ సహనం కోల్పోయారు. "మీ పద్నాలుగు తరాల గురించి కూడా మాట్లాడతా. అరవకండి. మీ గొంతు నొక్కుతా" అని బెదిరించారు. ఆ మహిళలను 'తృణమూల్ కుక్కలు'గా ఆయన అభివర్ణించారు. అయితే బీజేపీ నేత వ్యాఖ్యలతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది.